



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 345 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 1 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# విలక్షణ రాజకీయం



- చంద్రబాబు జీవితంలో ఎన్నో మలుపులు.. మరెన్నో మజిలీలు
- సంక్షోభాల నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన వైనం
- పాతాళానికి పడినా.. తర్వాత ఆకాశమే హద్దుగా ఎదిగే తత్వం
- ఊహకు అందని ఆలోచనలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఎవరైనా రాజకీయాల్లో గెలుస్తుంటారు.. ఓడిపోతుంటారు. మళ్లీ ప్రజాదరణ పొంది అధికార పీఠం అధిష్ఠిస్తారు. అయితే చంద్రబాబు అలా కాదు. సంక్షోభాల నుంచి ప్రపంచ స్థాయికి వెళ్లడం.. ఓటమితో చతికిలబడడం.. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా ఎదగడం ఆయన రాజకీయ శైలి. ఆయనది ఆది నుంచీ విలక్షణమైన రాజకీయ జీవితం. మలుపులు.. మజిలీలు ఎన్నెన్నో ఉన్నాయి. అతి సాధారణ కుటుంబంలో జన్మించి.. విద్యార్థి దశలోనే గెలుపోటములు ఒంటబట్టించుకున్నారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై.. అంజయ్య హయాంలో మంత్రివర్గంలో చేరారు. టీడీపీలోకి వచ్చాక చాలాకాలం మంత్రి కావాలన్న ఆలోచనే చేయలేదు. 1983లో ఎన్టీఆర్ మొదటిసారి సీఎం అయ్యాక చంద్రబాబు టీడీపీలోకి వచ్చారు. 1984 ఆగస్టు సంక్షోభంలో తాను మామ చాటు అల్లుడిని కాదని.. నాయకత్వ పటిమ పదునుగా ఉందని నిరూపించుకున్నారు. 1985లో మళ్లీ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక.. అవకాశమున్నా.. ఎమ్మెల్యే, మంత్రి పదవుల జోలికి వెళ్లలేదు. కానీ రాష్ట్ర గతినే ఒక మలుపుతిప్పిన కర్షక పరిషత్ చైర్మన్‌గా దాదాపు - మిగతా2లో



# డ్రాగన్-ఏనుగు ఒక్కటవ్వాలి

- భారత్‌తో సంబంధాలపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీతో సమావేశం
- ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సమావేశానికి ప్రాధాన్యం
- సరిహద్దు సమస్య భారత్-చైనా సంబంధాన్ని నిర్వచించనివ్వకూడదు
- స్నేహితులుగా ఉండటం, మంచి పొరుగువారిగా ఉండటం, డ్రాగన్, ఏనుగు కలిసి రావడం చాలా ముఖ్యం
- సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కొనసాగుతుందని ఆశిస్తున్నా:మోదీ

6

## పాక్ సరిహద్దు తీవ్రవాదంపై భారత్‌కు చైనా మద్దతు


- మీ బోర్డర్ దాటి వస్తున్న పాక్ టెర్రరిస్టుల సంగతేంటి?
- టెర్రర్ కార్యకలాపాల వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తాం
- ఎటువంటి ఉగ్రవాద చర్యల నిర్మూలనకైనా తమ మద్దతు ఉంటుంది
- టియాంజిన్ నగరంలో ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్న మోదీ..
- ప్రాంతీయ శాంతి, ఆర్థిక స్థిరత్వం, సరిహద్దు ఉద్రిక్తతల తగ్గింపు, సాంకేతిక రంగాల్లో సహకారం పెంచుకునే వంటి అంశాలపై చర్చలు
- వాణిజ్య, టెక్నాలజీ, రక్షణ రంగాల్లో ఒప్పందాలు చేసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.



# ప్రొఫైల్ నకిలీ.. సైబర్ మకిలి

- ఆన్ లైన్ మోసాల్లో ఇలాంటివే ఎక్కువ
- సైబర్ వేధింపులు, ప్రొఫైల్ హ్యాకింగ్ కూడా
- నాలుగేళ్లలో మూడురెట్లు పెరిగిన ఫిర్యాదులు
- ఎన్ సీఆర్‌పీలో వెల్లువెత్తుతున్న కంప్లయింట్స్

6



# ఇదేం 'మైత్రి'.. భారత్‌పై అమెరికా ధోరణి

- స్నేహ ఆకాంక్షలు.. అంతలోనే ఆంక్షలు
- ద్వైపాక్షిక బంధం ఎత్తుపల్లాలమయం
- సుంకాల ద్వారా మరోసారి స్నేహధర్మానికి అమెరికా తూట్లు పొడుస్తోంది.

# ఉధృతంగానే గోదావరి



- పోలవరం నుంచి 10.84 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ధవళేశ్వరంలో కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- లంక, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించిన అధికారులు

6

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

గోదావరి ఉధృతి కొనసాగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటిమట్టం మరింత పెరిగింది. మహారాష్ట్ర, ఒడిశా, చత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,84,329 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48.10 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.050 - మిగతా2లో



# బీచ్ శాండ్‌పై కదలిక

- టెండర్లు ఖరారు చేయనున్న సర్కారు
- ముందు వరుసలో అదానీ కంపెనీలు
- హైకోర్టు సూచనల మేరకు నిబంధనల్లో మార్పులకు అవకాశం
- మరో 16 వేల హెక్టార్లలో లీజులకు కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

బీచ్‌శాండ్ మైనింగ్‌లో కదలిక మొదలైంది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో టెండర్లు ఖరారు చేసే పనిలో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) నిమగ్నమైంది. గత జగన్ ప్రభుత్వ హయాంలోనే రెండు ప్రాంతాల్లో వెయ్యి హెక్టార్లలో రెండు - మిగతా2లో

# పింఛనుదారుల్లో టెన్షన్!



- అనర్హులంటూ దాదాపు లక్ష మంది దివ్యాంగులకు ప్రభుత్వం నోటీసులు
- వీటిని అందుకున్న వారిలో పెన్షన్ కోసం తీవ్ర ఆందోళన
- వారికి సొమ్ము పంపిణీపై రోజుకో రీతిలో సర్కారు వైఖరి..
- పునఃపరిశీలన కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇస్తామంటూ అనుకూల మీడియాలో లీకులు
- దివ్యాంగులు కాని వారికి, దొంగలకు పింఛన్లు ఇస్తున్నారంటూ స్వయంగా ప్రచారానికి తెర తీసిన సీఎం చంద్రబాబు
- నెల రోజులుగా కునుకు కరువైన దివ్యాంగ లబ్ధిదారులు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

అనర్హుల పేరుతో నెల రోజులుగా కూటమి ప్రభుత్వం లక్షల సంఖ్యలో పంపుతున్న నోటీసులతో పింఛన్ లబ్ధిదారుల్లో కలకలం రేగుతోంది. నేడు పింఛన్ డబ్బులు అందుతాయో లేదో అంతు చిక్కక నోటీసులు అందుకున్న వారిలో గందరగోళం నెలకొంది. దివ్యాంగులు కానివారికి, దొంగలకు పింఛన్లు ఇస్తున్నారని... పెన్షన్లు తొలగిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబే ఈ ప్రచారానికి తెర తీయడంతో వాటినే నమ్ముకుని బతుకీడుస్తున్న కుటుంబాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో వైద్యులే ధ్రువీకరించి ఇచ్చిన సర్టిఫికెట్లు ఇప్పుడు చెల్లవని చెప్పడం ఏమిటని నివ్వెరపోతున్నారు. ఆయా లబ్ధిదారుల పెన్షన్లు రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం వారికి పంపుతున్న నోటీసుల్లోనే తేల్చి చెబుతోంది. దీంతో ఒకటో తారీఖు వచ్చిందంటే.. గతంలో సంతోషంగా పెన్షన్ల కోసం ఆరాటంగా ఎదురు చూసిన గ్రామాల్లో ఇప్పుడు ఆందోళన తాండవిస్తోంది. ఈ ప్రభుత్వం ఎవరి పింఛన్ ఎగరగొట్టిందోననే ఆదుర్దా నెలకొంది. నెలనెలా చేతికందే పింఛను డబ్బులనే నమ్ముకుని జీవిస్తున్న దివ్యాంగులతో టీడీపీ కూటమి సర్కారు పూటకో రకంగా ఆటలాడుకుంటోంది. రాష్ట్రంలో మొత్తం 7.86 లక్షల మంది దివ్యాంగ పింఛను లబ్ధిదారుల్లో 5.50 లక్షల మందికి కొత్తగా వైద్య పరీక్షలు నిర్వహించగా దాదాపు లక్ష మంది అనర్హులుగా నిర్ధారణ అయినట్లు చెబుతుండటంతో నెల - మిగతా2లో

# పింఛనుదారుల్లో టెన్షన్!



-మొదటిపేజీ తరువాయి

రోజులుగా కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నారు. నోటీసులు అందుకున్న వారంతా సోమవారం చేపట్టనున్న సెప్టెంబరు నెల పింఛన్ల పంపిణీలో తమ చేతికి డబ్బులు అందుతాయో లేదో అనే భయాందోళనలో ఉన్నారు. 2024 ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ హయాంలో ఇచ్చిన పింఛన్లతో పోలిస్తే టీడీపీ కూటమి సర్కారు వచ్చాక గత 15 నెలలలోనే ఏకంగా దాదాపు నాలుగున్నర లక్షల మేర పెన్షన్లు తగ్గిపోవడం గమనార్హం.

**2011 జన గణన ప్రకారమే 12.19 లక్షల మంది దివ్యాంగులు..**

కేంద్ర ప్రభుత్వం చివరిసారి దేశవ్యాప్తంగా నిర్వహించిన జనగణన వివరాల ప్రకారం 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో 12,19,785 మంది దివ్యాంగులున్నారు. అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం ప్రస్తుతం మొత్తం దివ్యాంగులకిచ్చే పింఛన్లు 7,86,091 మాత్రమే. గత జనగణన నాటికి నాలుగేళ్ల వయసులో ఉన్నవారికి ప్రస్తుతం 18 ఏళ్లు నిండి ఉంటాయి. అంటే రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల్లో మూడో వంతు కంటే ఎక్కువ మందే ఇంకా పింఛన్లు పొందడం లేదని స్పష్టమవుతుంది. అయితే రాష్ట్రంలో పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగుల్లో పెద్ద సంఖ్యలో అనర్హులు ఉన్నారంటూ సీఎం చంద్రబాబు స్వయంగా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. పింఛన్లను ఎగరగొట్టేందుకే రీ వెరిఫికేషన్ చేపట్టి దీన్ని ప్రచారంలోకి తెచ్చినట్లు స్పష్టమవుతోంది.

**పంపిణీపై సందిగ్ధం..**

అనర్హుల పేరిట దాదాపు లక్ష మంది దివ్యాంగ పింఛనుదారులకు నోటీసులు జారీ చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం సెప్టెంబరు నెలలో వారి పింఛన్లు నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. అయితే ప్రతి చోటా దివ్యాంగ పింఛన్‌దారులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతుండడంతో ఉలిక్కిపడింది. పింఛన్ల పంపిణీ చేపట్టే సెర్ప్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇటీవల విలేకరులతో మాట్లాడుతూ నోటీసులిచ్చిన వారికి తిరిగి వైద్య పరీక్షలు జరిగి కొత్తగా అర్హులుగా తేలితే పింఛను పునరుద్ధరణ ఉంటుంది.. అప్పటిదాక ఆగిపోతుందని చెప్పారు. అయితే పునఃపరిశీలన కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా పంపిణీ చేయనున్నట్లు టీడీపీ అనుకూల మీడియాకు లీకులిచ్చింది. దీంతో నోటీసులు అందుకున్న లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం కొత్త వెంకటాపురంలో నివసించే గురజాల గోపినాయుడు చిన్నతనంలో పోలియో సోకడంతో రెండు కాళ్లు కోల్పోయాడు. ఊహ కూడా తెలియని వయసులో అతడి భవిష్యత్తుతో విధి ఆడుకుంది. తండ్రి దేవేంద్రనాయుడు పొలంలో పాము కాటుకు గురై రెండు కళ్లు కోల్పోయాడు. తల్లి జయమ్మకు వెన్నెముక సమస్యతోపాటు సరిగా వినపడదు. ఆ కుటుంబంలో ముగ్గురి వద్దా వైద్యాధికారులు ధ్రువీకరించిన సదరం సర్టిఫికెట్లు ఉన్నాయి. దేవేంద్రనాయుడు, గోపినాయుడు దశాబ్దాలుగా పింఛన్‌లు పొందుతుండగా వాటిని తొలగిస్తున్నట్లు ఇటీవల అధికారులు నోటీసులు పంపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద చిన్నబంకు నిర్వహిస్తున్న దివ్యాంగుడు గోపినాయుడును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు బెదిరించి వెళ్లగొట్టారు. ఇటు బతుకు దెరువుకోల్పోయి.. అటు పింఛన్లు రద్దై ఎలా బతకాలో అంతుబట్టడం లేదని ఆ కుటుంబం చిత్రవధకు గురవుతోంది.

**జగన్ హయాంలో సులభంగా సదరం సరిఫికెట్ల జారీ..**

దివ్యాంగులకు అర్హత ఉండి పింఛను పొందాలంటే ముందుగా వైకల్యాన్ని నిర్ధారిస్తూ వైద్యులు సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలి. 2014%–%19 మధ్య టీడీపీ హయాంలో ఇది పెద్ద ప్రహసనంగా ఉండేది. దీనికి హాజరు కాలేక, ఆ తిప్పలు పడలేక టీడీపీ పాలనలో చాలా మంది దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందలేకపోయారన్న విమర్శలున్నాయి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దివ్యాంగ పింఛన్ల మంజూరులో కీలకమైన సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను సరళతరం చేశారు. అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్ల జారీకి వీలుగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రతి మూడు నెలలకు స్లాట్లను విడుదల చేస్తూ గ్రామ, వార్డు సచివాలయాల్లో బుకింగ్ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. సదరం సర్టిఫికెట్ల జారీ పెరగడంతో అర్హులైన దివ్యాంగులు కొత్త పింఛను పొందడానికి వీలు ఏర్పడింది. దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పింఛన్ల మంజూరు, ధ్రువపత్రాల జారీలో గత ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకంగా 29.51 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) గతంలో ప్రకటించింది. ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ నిరంతర ప్రక్రియగా చేపట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 2.07 లక్షల మంది దివ్యాంగులకు కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నాలుగు రోజుల క్రితం స్వయంగా విలేకరుల సమావేశంలోనే చెప్పారు.

**తల్లిదండ్రులు లేరు ఆపై వైకల్యం**

వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో ఉంటున్న సాకె సాయిలక్ష్మి పుట్టుకతోనే మూగ, చెవుడు బాధితురాలు. కంటి చూపులో లోపాలున్నాయి. 15 ఏళ్ల క్రితమే ఆమె తల్లిదండ్రులిద్దరినీ కోల్పోవడంతో చిన్నాన్న రామాంజనేయులు వద్ద ఉంటోంది. 2005 నుంచి ఆమెకు దివ్యాంగ పింఛన్ వస్తోంది. కూటమి ప్రభుత్వం సాయిలక్ష్మీ పింఛన్‌ను తొలగిస్తూ నోటీసు పంపింది. స్పష్టంగా మూడు శారీరక లోపాలు ఉన్నప్పటికీ రీ వెరిఫికేషన్ పేరుతో వైకల్యం 20 శాతమేనంటూ నిర్ధారించడం గమనార్హం.

**కాలు తొలగించారు**

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కుడ్డంగి (గాలగొండ)లో నివసిస్తున్న గిరిజనుడు పూజారి నానాజీ నాయుడుకి ముల్లు గుచ్చుకుని సెప్టిక్ కావడంతో కాలు తొలగించారు. ఆయనకు 90 శాతం అంగవైకల్యం ఉన్నట్లు 2022 ఆగస్టులో వైద్యులు ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్ జారీ చేశారు. అప్పటి నుంచి రూ.6 వేలు పెన్షన్ పొందుతున్నాడు. గత ప్రభుత్వంలోనే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు కావడంతో కొంత భాగం నిర్మాణం కూడా జరిగింది. తాజాగా రీ వెరిఫికేషన్ అనంతరం ఆయనకు 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని, పింఛన్ తొలగిస్తున్నామంటూ ఆగస్టు 14న జి.మాడుగుల ఎంపీడీవో నోటీసు జారీ చేశారు.

**కాలు తొలగించినా.. వైకల్యం తాత్కాలికమట..**

ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా వింజమూరు మండలం సాతానువారిపాళేనికి చెందిన దివ్యాంగుడు అశోక్‌కుమార్‌కు ఓ ప్రమాదంలో కాలు పూర్తిగా దెబ్బ తినడంతో తొలగించారు. ఒంటి కాలిపై ఊత కర్ర సాయంతో కాలం వెళ్లదీస్తున్నాడు. ఆయనకు 59 శాతం వైకల్యం ఉందంటూ 2015లో జిల్లా ఆస్పత్రి నుంచి సదరం సర్టిఫికెట్ ఇవ్వడంతో దివ్యాంగ పింఛన్ పొందుతున్నారు. రీ వెరిఫికేషన్ అనంతరం ఆయన పింఛన్ రద్దు చేస్తున్నట్లు కూటమి సర్కారు ప్రకటించింది. మోకాలి వరకు ఒక కాలు పూర్తిగా తొలగించినా.. అది తాత్కాలిక వైకల్యమని నోటీస్‌లో పేర్కొనడం పట్ల ఆ కుటుంబం నివ్వెరపోతోంది. తానెలా బతకాలంటూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆక్రోశిస్తున్నాడు.

**23 ఏళ్లుగా ఘనాహారం లే దు..**

విశాఖ జిల్లా ఆనందపురం మండలం ముచ్చర్ల పంచాయతీకి చెందిన చెరుకూరి గున్నేష్ పుట్టుకతోనే ఉలుకు పలుకు లేకుండా మంచానికే పరిమితమయ్యాడు. 23 ఏళ్లుగా ఘనాహారం తీసుకున్నది లేదు. ఆహారం గొంతు దిగని కారణంగా నిత్యం పాలే ఇస్తుంటారు. 2008లో వైఎస్సార్ హయాం నుంచి దివ్యాంగుల పెన్షన్ పొందుతున్నాడు. ప్రస్తుతం రూ.6 వేలు వస్తుండగా దాన్ని హఠాత్తుగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. రోజుకు నాలుగు లీటర్ల పాలు ఆహారం కింద ఇచ్చేందుకు నెలకు దాదాపు రూ.9 వేలు దాకా ఖర్చు అవుతోంది. ఇంట్లోవారినే గుర్తించలేక మంచాన పడ్డ పిల్లాడి పెన్షన్ ఆపడం ఈ ప్రభుత్వం చేస్తున్న పాపం కాదా? అని నానమ్మ సన్యాసమ్మ ప్రశ్నిస్తోంది.

**మంచంలోనే అన్నీ.. 40 శాతమే వైకల్యమంట!**

ఈ ఫొటోలో కనిపిస్తున్న ఎనిమిదేళ్ల చిన్నారి బధిరుడు.. ఆపై అంగవైకల్యం.. మతిస్థిమితం లేదు. మల మూత్రాలు వచ్చినా చెప్పలేడు. మంచంలోనే అన్నీ.. నాలుగేళ్లుగా దివ్యాంగ పింఛన్ పొందుతుండగా 90 శాతం ఉన్న వైకల్యాన్ని ప్రభుత్వం ఇటీవల 40 శాతానికి మార్చేసింది. ఏకంగా పింఛన్‌ను ఎత్తివేస్తున్నట్లు నోటీసు ఇవ్వడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగపాలెం గ్రామానికి చెందిన మొగల్ షబ్బీర్, సోనీ దంపతుల దయనీయ పరిస్థితి ఇదీ! తమ కుమారుడు మొగల్ మహమ్మద్ రసూల్‌ను పుట్టుకతోనే వైకల్యం వెంటాడితే కూటమి సర్కారు పింఛన్ తొలగించి పొట్టగొడుతోందని కూలి పనులకు వెళ్లి జీవిస్తున్న ఆ కుటుంబం ఆక్రోశిస్తోంది.

**కుడికాలు, చెయ్యి పనిచేయవు**

బాపట్ల మండలం కొండు'ట్లవారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మల్లెల మనోజ్ పుట్టుకతోనే పోలియో బాధితుడు. కుడి కాలు, చెయ్యి పనిచేయవు. అతడి తల్లిదండ్రులు వలస కూలీలు. 70 ఏళ్ల వయసున్న నాయనమ్మ, చెల్లిపైనే ఆధారపడి రోజువారీ పనులు చేసుకోవాలి. అన్నం తినడంతోపాటు చిన్నచిన్న పనులన్నీ ఎడమ చేతితోనే. మనోజ్‌కు 76 శాతం వైకల్యం ఉన్నట్లు గతంలో తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరణ పత్రం ఇవ్వగా అతడికి 18 శాతం వైకల్యం మాత్రమే ఉన్నట్లు ఇటీవల సదరం సర్టిఫికెట్ జారీ అయింది. నీ పింఛన్ తొలగిస్తున్నామంటూ తాజాగా ప్రభుత్వం నుంచి నోటీసు రావడంతో మనోజ్ మానసికంగా కుంగిపోతున్నాడు.

**పెన్షనే ఆధారం..**

మంచానికే పరిమితమైన 60 ఏళ్ల షేక్ జిలానీ ఆరేళ్ల క్రితం పక్షవాతానికి గురి కావడంతో కాలు, చేతులు పని చేయకుండా పోయాయి. కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా మంచం పైనుంచి లేవలేని పరిస్థితి. వితంతువు కావడంతో జిలానీ కుమార్తె కూడా తన పిల్లలతో కలసి ఆయన వద్దే ఉంటోంది. నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెంలో ఓ చిన్న ఇంట్లో ఉంటున్న వీరందరికీ ఆయన పెన్షనే ఆధారం. ఇన్నాళ్లూ రూ.15 వేలు పెన్షన్ పొందుతుండగా కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో వైకల్యాన్ని 59 శాతానికి తగ్గించి పెన్షన్ రూ.6 వేలకు కుదిస్తున్నట్లు నోటీసు పంపడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది.

**వైకల్యం ఆపై హృద్రోగం**

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం లుకులాం గ్రామానికి చెందిన పిల్ల చిన్నబాబుకు ఎడమ కాలు, చేయి పనిచేయదు. దీనికి తోడు గుండె ఆపరేషన్ జరిగింది. ఆయనకు 80 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరిస్తూ గతంలో వైద్యులు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. మూడేళ్ల నుంచి ఆయనకు దివ్యాంగ పింఛను వస్తోంది. ఆ డబ్బులే వారికి జీవనాధారం. రీ వెరిఫికేషన్ అనంతరం పింఛన్ రద్దు చేస్తామని తాజాగా ప్రభుత్వం నోటీసులు పంపడంతో ఆ కుటుంబంలో కలకలం రేగుతోంది.

**శారీరక ఎదుగుదల లేదు**

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరుకు చెందిన ఈ బాలిక పేరు షేక్ కురవపల్లి ఆరీఫా. జన్యుపరమైన లోపాలతో జన్మించింది. శరీరంలో సత్తువ లేదు. మెడ నిలబడదు. నడుములు పని చేయవు. ఎక్కడ పడుకోబెడితే అక్కడే ఉంటుంది. మాటలు కూడా రావు. తొమ్మిదేళ్ల వయసు వచ్చినా శారీరక ఎదుగుదల లేదు. ఆ చిన్నారికి వంద శాతం వైకల్యం ఉండటంతో ఇన్నాళ్లూ రూ.15 వేల దివ్యాంగ పింఛన్ అందేది. ఇటీవల రీవెరిఫికేషన్‌లో భాగంగా దాన్ని రద్దు చేసి రూ.6 వేల పింఛన్ కొనసాగిస్తున్నట్లు అధికారులు నోటీసులు ఇచ్చారు.

**పుట్టుకతోనే మనోవైకల్యం**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన ఈ బాలుడి పేరు అరుణ్ తేజ్. పుట్టుకతోనే మానసిక వైకల్యం బారిన పడ్డాడు. జీవితాంతం అలాగే ఉంటుందని డాక్టర్లు నిర్ధారించారు. అరుణ్ తేజ్‌కు తోడుగా ఇంట్లో ఇప్పటికీ ఎవరో ఒకరు ఉండాల్సిందే. గత ప్రభుత్వంలో మానసిక దివ్యాంగుడి కోటాలో నెలకు రూ.3,000 పింఛన్ వచ్చేది. ఇప్పుడు 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉందని, పింఛన్ తొలగిస్తున్నామంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ ప్రభుత్వానికి కొంచెం కూడా మానవత్వం లేదా? అని ఆ కుటుంబం వాపోతోంది.

# విలక్షణ రాజకీయం

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రికి ఉన్నంత అధికారాన్ని ఆయనకు కట్టబెట్టారు. దీంతో 1989లో టీడీపీ ఓడిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈయనే టార్గెట్ అయ్యారు. ఎన్ని రకాలుగా వేధించాలో.. ఎన్ని విధాలుగా మానసిక క్షోభ కలిగించాలో అన్నీ చేశారు. 1994లో టీడీపీ అప్రతిహత విజయంతో మళ్లీ అధికారంలోకి వచ్చాక.. 1995 సెప్టెంబరు వరకు ఆయన కల్లోల దశనే ఎదుర్కొన్నారు. పేరుకు మంత్రిగా ఉన్నప్పటికీ లక్ష్మీపార్వతి ప్రభావం పడింది. అప్పుడే సరికొత్త రాజకీయ సంక్షోభం నుంచి ఆయన వినూత్న నాయకుడిగా రూపాంతరం చెందారు. అదే.. 1995 సెప్టెంబరు 1న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం..!

ఎవరైనా ముఖ్యమంత్రి అయితే మహా ఆనందపడిపోతారు. ఆయన మాత్రం తీవ్ర విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్టీఆర్ నుంచి అధికారం లాగేసుకున్నారన్న అపఖ్యాతి చుట్టుముట్టింది. కానీ 1999 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు జైకొట్టడంతో విమర్శకుల నోళ్లు మూతపడ్డాయి.

**ఊహకు అందని ఆలోచనలు..**

1995లో ముఖ్యమంత్రి అయిన తర్వాత టెక్నాలజీ వైపు చూసిన చంద్రబాబు 1999 తర్వాత దానిని కొత్త పుంతలు తొక్కించారు. ప్రపంచస్థాయి నేతలతో పరిచయాలు పెంచుకోవడం, ఆ పరిచయాలను రాష్ట్రం కోసం ఉపయోగించడం ద్వారా.... ఎవరు అవునన్నా...కాదన్నా చంద్రబాబు ఈ విషయంలో గ్రేట్ అని చంద్రబాబు బద్ద విరోధులు సైతం ప్రశంసించేలా చేసుకోగలిగారు. అందరూ ఒక దిశలో ఆలోచిస్తే.. ఆయన అందుకు భిన్నకోణంలో ఆలోచించి.. ఊహకు అందనంత దూరంలో ప్రణాళికలు రూపొందించేవారు. అందులో కొన్ని ప్రజలకు సరైన రీతిలో దక్కకపోవడంతో 2004లో ఓటమి పాలయ్యారు. వరుసగా పదేళ్లు అధికారం కోల్పోయినా.. ఎక్కడా నిరుత్సాహపడకుండా 2014లో నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రి అయ్యారు. రాజధాని గానీ, చెప్పుకోదగ్గ పరిశ్రమలు గానీ ఏవీ లేని విభజిత రాష్ట్రాన్ని నిలబెట్టే క్రమంలో ఆయన చేసిన ప్రయోగాలు ప్రజలకు రుచించలేదు. దాంతో మళ్లీ ఓటమి పాలయ్యారు.

**ఆ ఐదేళ్లూ వేధింపులు.. కక్షసాధింపులు**

2019లో అధికారంలోకి వచ్చింది జగన్ కావడంతో వేధింపులు, సాధింపుల స్థానంలో కక్ష సాధింపులు మొదలయ్యాయి. చంద్రబాబు చుట్టూ మనుషులు లేకుండా చేయాలన్న జగన్ ప్రయత్నం కొంత వరకు ఫలించింది. అధికారంలో ఉన్నప్పుడు వీరుడు, శూరుడు, విక్రమార్కులు అన్నవారు సైతం ఇంట్లో పెళ్లికి కార్డు ఇవ్వడానికి కూడా చంద్రబాబు వద్దకు వెళ్లలేదు. ఎంత కిందకు పడితే అంత పైకి లేస్తారనే పేరున్న చంద్రబాబును మరింత కఠినంగా తొక్కేయడం కోసం జగన్ తన ఒరిజినల్ రూపాన్ని బయటపెట్టుకున్నారు. 70 ఏళ్లు పైబడిన వ్యక్తి అని చూడకుండా అమానుష పద్ధతిలో తప్పుడు కేసులో అరెస్టు చేశారు. 53 రోజుల పాటు జైలు జీవితం గడిపిన చంద్రబాబు.. ఒక్కసారిగా ప్రజల గుండెల్లోకి దూసుకుపోయారు. కళ్లుదిరిగే మెజారిటీతో 2024లో ఘన విజయం సాధించారు. ఒక వ్యక్తి అధికారం కోల్పోవడం, మళ్లీ తిరిగి రావడం సాధారణం.. కానీ ఇన్ని సార్లు అధికారం పోయినా మళ్లీ మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో విజయతీరాలకు చేరుకోవడం అసాధారణ విషయం. ఇది చంద్రబాబుకే చెల్లింది.

**ఎక్కడున్నా కింగ్ మేకర్....**

చంద్రబాబు ఎక్కడున్నా కింగ్‌మేకరే. అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్డీయే కన్వీనర్‌గా వ్యవహరించిన ఆయన.. ప్రఖ్యాత క్షిపణి శాస్త్రవేత్త అయిన ఏపీజే అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ఎంపిక చేయడంలో కీలక భూమిక పోషించారు. అదే విధంగా ప్రముఖ జన్యు శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌ను, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి లాంటి వారిని సలహాదారులుగా నియమించుకోవడం ద్వారా.. శాస్త్ర సాంకేతిక రంగాల పరిజ్ఞానాన్ని రాష్ట్రప్రభుత్వం వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రపంచ స్థాయి కార్పొరేట్ దిగ్గజాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించి రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఏపీకి రావడం చంద్రబాబు వల్లే సాధ్యమైంది. కర్షక పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పుడు.. క్షీర విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్‌ను పిలిపించి పాడి ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత కూడా ఆయనదే.

పడిపడి లేచిన బాబు..

పడి.. లేవడం చంద్రబాబు నైజం. నాలుగు సార్లు సీఎంగా పనిచేసిన ఆయన.. ప్రతిపక్ష నేతగానూ సుదీర్ఘకాలం పనిచేశారు. 2004, 09ల్లో వరుస పరాజయాలతో పదేళ్లు ప్రతిపక్షంలోనే కూర్చున్నారు. 2014లో కొత్త రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అనుభవజ్ఞుడు కావాలని జనం ఆశించి ఆయనకే పట్టం కట్టారు. మళ్లీ 2019లో ఓడిపోయి ఐదేళ్లూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. అయితే ఈ ఐదేళ్లలో ఆయన రాజకీయ నాయకత్వానికే సవాల్ ఎదురయ్యే అనుభవాలు ఎదురయ్యాయి. ప్రజల్లోకి వెళ్లకుండా నాటి సీఎం జగన్ ఆయన్ను కట్టడి చేశారు. ఇంట్లో నుంచి బయటకే రానివ్వలేదు. ఆయన సహచరులను తప్పుడు కేసుల్లో ఇరికించి జైళ్లకు పంపారు. చివరకు చంద్రబాబును సైతం అక్రమ కేసులో ఇరికించి.. అక్రమంగా అరెస్టు చేసి జైలు పాల్జేశారు. అదే జగన్‌కు అశనిపాతమైంది. 30 ఏళ్లు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంతో ఏలతానని కలలుగన్న జగన్‌కు జనం కర్రుగాల్చి వాతపెట్టారు. కనీసం ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేశారు. చంద్రబాబును మళ్లీ సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు. ఇలా ఎన్ని సార్లు ఆయన కింద పడినా.. మళ్లీ జనం అండతో పైకి లేస్తూనే ఉన్నారు.

**పది నిమిషాలిస్తే..**

ఒక చిన్న అవకాశం దొరకాలే గాని.. దానినెలా సద్వినియోగం చేసుకోవాలో చంద్రబాబుకు తెలిసినంత మరెవరికీ తెలియదేమో? అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ను హైదరాబాద్‌కు రప్పించడమే అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. దటీజ్ చంద్రబాబు అని దేశమంతా ప్రశంసించింది. ఆ సమయంలోనే మరో విశేషం చోటుచేసుకుంది. అంతటి క్లింటన్ వచ్చినప్పుడు అలా వచ్చి ఇలా వెళ్లిపోతే మనకేముంటుంది.. మనమేంటో, మనకేం కావాలో చెప్పుకోవాలని చంద్రబాబుకు అనిపించింది. ఎవరెవరినో పట్టుకున్నారు.. క్లింటన్‌తో పది అంటే పదే నిమిషాలు విడిగా మాట్లాడేందుకు అనుమతి పొందారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు ఎంత సమయమిస్తే ఆ సమయానికి కార్యక్రమం ముగిసిపోవాలి. కానీ చంద్రబాబుతో పది నిమిషాల కోసం కూర్చుంటే వారి చర్చలు ఏకంగా 40 నిమిషాలు కొనసాగాయి. అమెరికా నుంచి వచ్చిన క్లింటన్ భద్రతా సిబ్బంది కూడా ఆశ్చర్యపోయారు. మహా అయితే ఐదు నిమిషాలు ఎక్కువ కొనసాగవచ్చు.. అరగంట ఎక్కువ సేపు మాట్లాడడం వారినే కాదు, అమెరికా పారిశ్రామికవేత్తలనూ విస్మయపరిచింది.

## ఉధృతంగానే గోదావరి

-మొదటిపేజీ తరువాయి

మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.470 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక, ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నాయి. రాజమహేంద్రవరం అఖండ గోదావరి వద్ద లంక, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 12.80 అడుగులుగా ఉంది. ఈ నీటిమట్టం 13.75 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వరద నిలకడగా ఉండడంతో ఆ పరిస్థితి రాకపోవచ్చునని పేర్కొన్నారు. మరోవైపు ధవళేశ్వరం నుంచి 11 లక్షల 35 వేల 249 క్యూసెక్కుల మేరకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ భాగంలోని ఏటూరు నాగారం వద్ద వరద తగ్గుముఖం పట్టగా, కూనవరం, ధవళేశ్వరం వద్ద పెరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

## బీచ్ శాండ్‌పై కదలిక

-మొదటిపేజీ తరువాయి

మైనింగ్ లీజులు చేపట్టేందుకు అవసరమైన డెవలపర్ ఎంపిక కోసం టెండర్లు పిలిచారు. ఇప్పుడు ఆ టెండర్లకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాయి. టెండర్లు ఖరారు చేసుకోవచ్చని హైకోర్టు ఇటీవల అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో నిర్వహించిన టెండర్లలో కంపెనీలు దాఖలు చేసిన ఆర్థిక, సాంకేతిక బిడ్లను అధికారులు పరిశీలించారు. బిడ్డింగ్‌లో అర్హత సాధించిన కంపెనీల వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిసింది. ఇందులో అదానీ గ్రూప్‌నకు చెందిన రెండు కొత్త కంపెనీలు బిడ్‌లు దాఖలు చేసిన విషయాన్ని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. శ్రీకాకుళం జిల్లా గార, విశాఖ జిల్లా భీమిలిలో మైనింగ్‌కు జరిగిన టెండర్లలో అదానీ గ్రూప్ కంపెనీలే ముందువరసలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైకోర్టు సూచనల మేర కు ప్రాజెక్టు డెవలపర్ విధులు, ఏపీఎండీసీ బాధ్యతల విషయంలో కొన్ని నియమ నిబంధనలు మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు గనుల శాఖ నివేదిక సమర్పించినట్లు తెలిసింది. గతంలో వచ్చిన న్యాయపరమైన చిక్కులు జూలై 31తో తొలగిపోయాయని, ఇక టెండర్ల ఖరారు ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉందని ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. తొలిదశలో శ్రీకాకుళం జిల్లా గారలో 909.85 హెక్టార్లు, విశాఖ జిల్లా భీమిలిలో 90.15 హెక్టార్లలో విడివిడిగా డెవలపర్ కోసం టెండర్లు పిలిచినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఏపీలో ఇంకా 16 వేల హెక్టార్ల పరిధిలో బీచ్‌శాండ్ మినరల్స్ నిక్షేపాలున్నాయని, ఈ మేరకు ఏపీఎండీసీకి లీజులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు ఆ నివేదికలో తెలిపారు. అయితే కేంద్రం కేవలం వెయ్యి హెక్టార్లకే లీజులు ఇచ్చిందని నివేదించారు. ఈ అంశాలపై గతంలో అణుశక్తి విభాగం లేవనెత్తిన అంశాలు, ఏపీఎండీసీ ఇచ్చిన వివరణలు, ఇతర సాంకేతిక అంశాలను కూడా ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే కోర్టు చిక్కులు తొలగినందున తొలుత వెయ్యి హెక్టార్ల పరిధిలో టెండర్లు ఖరారు చేయాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. 16,004 హెక్టార్ల పరిధిలోని 16 లీజులను కూడా ఏపీఎండీసీకి కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరోసారి కేంద్రానికి లేఖ రాసింది. బీచ్‌శాండ్ మైనింగ్, ఇందులోని ఖనిజాలైన ఇలిమినైట్, రుటైల్, గార్మెట్, సిలిమినైట్, జిర్కాన్, మోనోజైట్‌లను ప్రాసెస్ చేసే ప్లాంట్ల ఏర్పాటు కోసం కనీసం 2 వేల కోట్ల పెట్టుబడులు ఉంటాయని గనుల శాఖ చెబుతోంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం 1 సెప్టెంబర్ 2025




www.viswamvoice.com

# తమిళనాడులో ఆంధ్ర తెలుగు ప్రాంతాలను ఆంధ్ర రాష్ట్రంలో కలపాలి

- తమిళనాడు చెన్నపట్నం ను ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేయాలి.
- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ మేడా శ్రీనివాస్ డిమాండ్.

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** మద్రాస్,హైదరాబాద్లను అభివృద్ధి పరిచిన ఆంధ్రులకు నేడు రాజధాని లేకపోయిందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తీవ్ర ఆవేదన చెందారు. ఈ సందర్భంగా మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ తమిళనాడు రాజధాని నాటి చెన్నపట్నం (మద్రాస్) (చెన్నై)ను ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేసి జాతీ సమగ్రతను, ప్రజాస్వామ్యక విలువలను కాపాడాలి. ఆంధ్ర తెలుగు వారి రాజకోటగా నాడు అభివృద్ధి పరిచిన ప్రస్తుత చెన్నై ప్రాంతంపై ఆంధ్రులకు మాత్రమే సర్వ హక్కులు వున్నాయి.1956లో జరిగిన విభజనకు సంబందించి నాటి చెన్నపట్నం నేటి చెన్నై ను ఆనాటి తమిళ సర్కార్ ఆక్రమించి నిర్దాక్ష్యాణ్యంగా కర్నూల్ రాజధాని అంటు ఆంధ్రులను గెంటి వేసారు. ఆనాటి నుండి ఆంధ్రప్రదేశ్ కు బలమైన నాయకత్వ లోపం ప్రస్ఫుటంగా వుంటూనే వుంది.నేటికి మద్రాస్ నలుమూలల ఆంధ్ర మూలాలు, సాంప్రదాయాలు, ఆంధ్రుల శ్రమతో నిర్మించిన చారిత్రిక కట్టడాలు కనబడుతున్నాయి.నేడు భూత వైద్యుల పాలనతో తమిళనాడు పాలన కొనసాగుతున్నప్పటికి అక్కడ హిందూ ధర్మం వుందన్నా,పవిత్ర దైవ క్షేత్రాలు వున్నాయన్నా నాటి ఆంధ్రుల త్యాగాలు,చరిత్ర ప్రత్యేక్షంగా నేటికి కనపడుతూనే వుంది . తమిళనాడు ఒక దైవశక్తి గల రాష్ట్రం అని, ఆ రాష్ట్రాన్ని రావణాసురుల సంతతి



పాలించటం భారతదేశ సార్వబౌమాధికార ప్రతిష్టకు కళంకంగా బావించాలి.భారతదేశం కోహినూర్ వజ్రాన్ని కోల్పోయి ఎంత నష్టపోయిందో ఆంధ్రప్రదేశ్ మద్రాస్ ప్రాంతాన్ని కోల్పోయి అంత పెద్ద స్థాయిలో నష్టపోయిందని ఆయన ఆవేదన చెందారు.. ఆంధ్రుల శ్రమను , త్యాగాలను,ఆత్మగౌరవాన్ని తమిళనాడు ప్రభుత్వం గుర్తించాలి..ఆంధ్రుల హక్కులను గౌరవించాలి . అనేక దశాబ్దాలుగా ఆంధ్రులు ఆనాటి మద్రాస్ కేంద్రంగా జీవితాలు కొనసాగించారని , చెన్నపట్నం అభివృద్ధికి , లభించిన గుర్తింపులో ఆంధ్రుల ఖ్యాతి ఎన లేనిదని,నేటికి మద్రాస్ చెన్నపట్నం లో అనేక పరిసర ప్రాంతాల్లో నేటి ఆంధ్ర మూలాలు గొప్ప చరిత్ర కనభడుతుంది . తమిళనాడు లోగల అనేక చారిత్రిక దేవాలయాల సేవా నిర్మాణ కార్యక్రమాల్లో ఆంధ్రుల పాత్ర వుంది . ఆ నాడు రాజాజీ వంటి పెద్దల ముసుగులో ఢిల్లీ కేంద్రంగా జరిగిన రాజకీయ కుట్రలో భాగంగా పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర విభజనలో కొన్ని ప్రధాన తెలుగు ప్రాంతాలను దాచి పెట్టి హడా వడిగా ఆనాడు ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ కారులు దృష్టి మళ్ళించి అభివృద్ధి చెందిన ఆంధ్ర ప్రాంతాలను కాకుండా కర్నూల్ రాజధానిగా అంటు ఆంధ్రులను తరలించేసారు..ఆనాటి నుండి నేటి వరకు ఢిల్లీ రాజకీయ కుట్రలకు ఆంధ్ర రాష్ట్రం నష్ట పోతూనే వుంది. ఆంధ్రరాష్ట్రంపై జరుగుతున్న కుట్రలను కుతంత్రాలను ప్రారద్రోలే విధంగా అంకుటిత కార్యా సాధనతో పోరాడి మన హక్కులను, ఆత్మగౌరవాన్ని , కోల్పోతున్న అభివృద్ధిని సాధించుకోక పోతే బావి తరాలు ఈ తరాలను క్షమించరని , ఆంధ్రుల త్యాగాలతో సొంతంగా అభివృద్ధి చేసిన చెన్నపట్నం ను వదులుకోవాల్సి వచ్చిందని, అనంతరం హైదరాబాద్ ను వదులుకోవాల్సి వచ్చిందని , ప్రస్తుత చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలను నిర్మించిన ఆంధ్రులకు నేడు రాజధాని లేకుండా పోయిందని, ప్రస్తుత ఆంధ్ర రాష్ట్ర పాలకులుగా చెలామణి అవుతున్న పాలకులకు కనువిప్పు కలిగే గొప్ప మహానగరాన్ని రాజధానిగా నిర్మించి చూపిద్దాం.ప్రస్తుత పాలకులతో ఆంధ్రులకు రాజధాని ఒక స్వప్నంగానే మిగిలిపోతుందని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తీవ్ర మనస్థాపం చెందారు . సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు.ఈ సమావేశం లో అర్పిసి సెక్యులర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్... సూపర్ హిట్

సీఎం చంద్రబాబు చిత్రపటానికి మహిళల పాలాభిషేకం

స్త్రీ శక్తి పథకంతో మహిళల్లో ఆత్మ గౌరవం, సాధికారత

**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-**ఆగష్టు 31..రాష్ట్రంలో ఆడబిడ్డలను,అక్కా చెల్లెమ్మలను సామాజికంగా, ఆర్థికంగా పైకి తీసుకొచ్చి,వారి కాళ్లపై వాళ్లు నిలబడి స్వయం అభివృద్ధి,ఆర్థిక స్వావలంబనతో ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ అన్నారు.కూటమి ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తూ ద్రాక్షారామంలో నియోజకవర్గస్థాయి "స్త్రీ శక్తి- ఉచిత బస్సు పథకం సక్సెస్ సమావేశం" నిర్వహించారు. తొలుత కూటమి ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న పలు సంక్షేమాలపై పలువురు మహిళలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను ఏడాది తిరగకుండానే 90 శాతం హామీలను అమలు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని,మహిళ సాధికారత,మహిళా స్వావలంబనను దృష్టిలో ఉంచుకొనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసారన్నారు. కుటుంబ వ్యవస్థలో ముఖ్య భాగమైన స్త్రీ శక్తి విధానాన్నే సూపర్ సిక్స్ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పథకం కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని,ఇందు కోసం



ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.162 కోట్ల చొప్పున ఏడాదికి రూ.1,942 కోట్ల రూపాయల భారం పడుతుందని,ఈ ప్రయాణ ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఏపీఎస్ఆర్టీసీకి చెల్లిస్తుందన్నారు. ముఖ్యంగా బాలురతో పాటు,బాలికల విద్యకు ఎంతో ప్రోత్సాహకంగా తల్లికి వందనం పథకం అని,పేదరికంలో ఉన్న కుటుంబాలు బాలికలను ఉన్నతంగా చదివించాలనే ఆలోచనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం అమలు చేసి ఆడబిడ్డల చదువుకు అండగా నిలిచారని తెలిపారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించి, మహిళలకు ఆర్థికంగా భరోసా ఇవ్వడం జరుగుతుందని,మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి సూపర్ సిక్స్ పథకాలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో స్త్రీ శక్తి అమలు చేశారని,పథకం అమలు తర్వాత మహిళల ప్రయాణ సంఖ్య 40 శాతం నుంచి అనూహ్యంగా 67 శాతానికి పెరిగిందని, ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో 74 శాతమున్న ఐదు రకాల బస్సులైన పల్లెవెలుగు,అల్ట్రా పల్లెవెలుగు,ఎక్స్ ప్రెస్,సిటీ ఆర్డినరీ,మెట్రో ఎక్స్ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం సాగించవచ్చు అన్నారు. ఆర్టీసీలో మొత్తం 11,449 బస్సులు ఉండగా 8,458 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తోందని,రాష్ట్ర వ్యాప్తంగా సగటున రోజుకు 25 లక్షల మంది మహిళలు,బాలికలు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తూతున్నారన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు, బాలికలు పట్టణాల్లో ఉన్నత చదువులు,ఇతర ఉద్యోగాలు చేసుకునే అవకాశం వారికి లభిస్తుందని తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రతి పేద కుటుంబంలో ప్రయాణ ఛార్జీల రూపంలో నెలకు రూ.1000 నుంచి రూ.1500 వరకు ఆదా అవుతుందన్నారు.అలాగే దీపం -2 పథకం ద్వారా ప్రతి కుటుంబానికి మూడు ఎల్పీజీ సిలిండర్లు ఉచితంగా అందజేయడంతో పేద మధ్యత రగతి కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గిందిని, పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా నాయకులు జాస్తి విజయలక్ష్మి, బళ్ళ లక్ష్మి, వయిట్ల గజలక్ష్మి, విజయలక్ష్మి,పెద్ద ఎత్తున వీర మహిళలు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం

స్త్రీ శక్తి సూపర్ సక్సెస్ ...

సూపర్ సిక్స్ పై ప్రశంసల జల్లు...

మండపేటలో మహిళలతో భారీ సభ...

**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మహిళలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు.మండపేట బస్ స్టాండ్ లో ఆదివారం స్త్రీ శక్తి విజయోత్సవ సభ నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సభాధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు.మహిళలు మాట్లాడుతూ చంద్రబాబును ప్రశంసలతో ముంచెత్తారు. ఆనాడు అన్న ఎన్.టి.ఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వడంతో పాటు మహిళలకు వివిధ పదవుల్లో అధిక ప్రాధాన్యత, రాజకీయ రిజర్వేషన్లు కల్పించారని కొనియాడారు. ఆయన తరువాత చంద్రబాబు అదే దారిలో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు గుర్తింపు తీసుకువచ్చారన్నారు. పలు పథకాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు విశేష కృషి చేశారన్నారు. తల్లికివందనం, ఉచిత గ్యాస్, స్త్రీ శక్తి, మహాశక్తి ఇలా ప్రతి పథకంలోనూ మహిళలను ప్రధాన భాగస్వాములు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ముఖ్యంగా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మహిళల పట్ల ఎంతో గౌరవమర్యాదలు కనబరుస్తారని పేర్కొన్నారు. ఆయన ఎమ్మెల్యే కావడం గర్వకారణమని పేర్కొన్నారు ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ తనను నాలుగుసార్లు ఎమ్మెల్యే గా వరుసగా గెలిపించిన ప్రజలందరికీ పాదాభివందనం తెలియజేశారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల్లో భాగంగా పింఛన్లు అందరికీ మూడు నెలలు వెనక్కి వెళ్ళి మరీ ఇచ్చారన్నారు. మూడు వేలు ఉండే దివ్యాంగుల పింఛను ను 6 వేలు చేయడం జరిగిందన్నారు. పింఛన్లు నిమిత్తం ఏటా 192 కోట్లు ఒక్క మండపేట నియోజకవర్గం నుండే ఖర్చు అవుతున్నట్లు చెప్పారు. 38,435 మంది లబ్ధిదారులకు గానూ 335 మందికి అనర్హులుగా గుర్తిస్తూ నిజాయితీని నిరూపించుకోమని నోటీస్ లు ఇవ్వగా ఖాళీగా ఉన్న వైసీపీ నేతలు దానిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 2 వేల పింఛను ను 3 వేలు పెంచడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ పెంచుకుంటూ పోతానని చావు తెలివితేటలు ప్రదర్శించాడని విమర్శించారు.అందుకే ప్రజలు 11 సీట్లకు పరిమితం




చేసి చావు దెబ్బ కొట్టారన్నారు. ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ను రద్దు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ప్రజలు సోలార్ విద్యుత్ ను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ళ సూచించారు. ఐదేళ్లు పాటు ప్రజలు నెల నెల కట్టే విద్యుత్ బిల్లును బ్యాంక్ లకు కడితే ఆ తరువాత 20 ఏళ్ల పాటు విద్యుత్ బిల్లు కట్టాల్సిన పని లేదన్నారు. గతం లో మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరిలో కలపాలని కోరినా గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజల కల నెరవేర్చే బాధ్యత ప్రస్తుత ప్రభుత్వం లో తనదని పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో ఎనిమిదిన్నర లక్షల మంది ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. అన్న క్యాంటీన్ ద్వారా ఎంతో మంది నిరుపేదలకు అన్నం పెడుతున్నారన్నారు. గతం లో దౌర్భాగ్యం కొద్ది అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఈ పథకాన్ని దుర్మార్గంగా రద్దు చేశారన్నారు. మండపేట లో కొంత మంది నాయకులు వారి ప్రభుత్వ హయాంలో చేసిందేమీ లేకపోయినా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు మాత్రం పేర్లు పెడుతున్నారన్నారు. ఒకప్పుడు చంద్రబాబు హైదరాబాద్ ను అభివృద్ధి చేస్తే ప్రస్తుతం అది తెలంగాణా రాష్ట్రం కు ఆర్థిక శక్తి గా మారిందని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి జరిగితే ఆ ప్రభావం రాష్ట్రం అంతటా ఉంటుందని పేర్కొన్నారు.

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్ లు, పార్టీ నాయకులు, రాష్ట్ర నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్,తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి,మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, బీజేపీ, జన సేన , టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## గోదావరి నది ఉధృత పెరగడంతో వినాయక విగ్రహాల నిమర్జనం చేసే భక్తులు నిబంధనలు పాటించాలి



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** గోదావరి నది వరద ఉధృతి పెరగడంతో కొవ్వూరు పట్టణంలోని గోదావరి నది తిర గోష్పాద క్షేత్రం నందు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేశారు. ఎగువ ప్రాంతాన కురిసిన వర్షాలకు గోదావరి నది ప్రవాహం రోజురోజుకీ పెరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వినాయక చవితి వేడుకలు కావడంతో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే భక్తులు పోలీస్ నిబంధనలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని కొవ్వూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి విశ్వం కోరారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో మెడికల్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బంది పోలీస్ సిబ్బంది రెవిన్యూ సిబ్బందిలతో పటిష్ట బందోబస్తులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ప్రజలు గోదావరి నదిలో దిగరాదని హెచ్చరికలు జారీ చేశారు.

## మద్దూరులో బాబు షూరిటి - మోసం గారంటీ కార్యక్రమం





**విశ్వం వాయిస్ న్యూస్ - కొవ్వూరు** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ఏడాది పైన అవుతున్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని కొవ్వూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. ఆదివారం కొవ్వూరు మండలంలోని మద్దూరు గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ కూటమి పర్వత్వం సంక్షేమ పథకాలను తుంగలోకి తొక్కిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయిందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైకు అదుపుతప్పి లారీని ఢీకొన్న ఘటనలో ఒకరి మృతి మరొకరికి తీవ్ర గాయాలు

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మారేడుమిల్లి నుంచి బైక్ పై వస్తూ ఉండగా దేవరపల్లి సమీపంలోకి రాగానే వారి బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా,మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మెగా డిఎస్సి లో మెరిసిన శ్రీలక్ష్మి



రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ 31 ఆగస్టు :- రామచంద్రాపురం మండలం ఉండూరు గ్రామానికి చెందిన వరసాల శ్రీలక్ష్మి మెగా డిఎస్సి లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు సబ్జెక్టు నందు 78.45 మార్కులు సాధించి తూర్పు గోదావరి జిల్లా ఎస్సి గ్రూప్ 3 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా ఉద్యోగ అవకాశం పొందారు.ఈ సందర్బంగా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు,సహాయ సహకారాలు అందించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మహిళలకు సమాన అవకాశాలు కల్పించిన మహిళా హక్కుల ప్రదాత,భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కు నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఆశించే అభ్యర్థులు తమ పిల్లలను ప్రాథమిక స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## ఊపందుకొంటున్న స్వదేశీ ప్రచారం

శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి.యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమీకండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా. తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు.స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు.కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది.అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది.వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది.కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి.మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమీకండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది.అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది.ఈ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది.మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు.ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ.250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు.అయితే, రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు."ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు."భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు."ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది.భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు.అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది."చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు."రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న. విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు..2025 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం.దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం.లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

## సమన్వయ లోపంతోనే యూరియా కష్టాలు




తెలంగాణలో వానాకాలం పంటలకు అవసరమైన ఎరువులు దొరక్క రైతులు ఆందోళన చెందుతుంటే, ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలపై దృష్టి సారించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ యూరియా కొరత ఎందుకు వచ్చింది? తెలంగాణలో అన్నదాతలు యూరియా కోసం వానలో తడుస్తూ సరఫరా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం సరిహద్దుల వరకు ఇదే దృశ్యం. చివరికి విసిగి వేసారి రాస్తారోకోలు కూడా నిర్వహించారు. ఇది కేవలం రైతుల సమస్యగానే కాక, రాజకీయంగా కూడా చిచ్చు రేపుతోంది. వానాకాలంలో పత్తి, వరి పంటలకు యూరియా డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ ఖరీఫ్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా. కేంద్రం 9.8 లక్షల టన్నులు కేటాయించినా, ఆగస్టు నాటికి 5.4 లక్షల టన్నులే రాష్ట్రానికి చేరాయి. దాంతో 3 లక్షల టన్నుల లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రం మధ్య ఆరోపణల యుద్ధం, సమన్వయ లోపం వల్ల రైతులు నష్టపోయారు. సమయానికి ఒత్తిడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత యూరియా అవసరం మరింత పెరిగింది. ఎకరానికి 170 కిలోల వినియోగం ఉంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. భారీ వర్షాలతో యూరియా కొరత రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్రమైంది. ప్రపంచ సరఫరా గొలుసులో అంతరాయాలు, సహజవాయువు ధరల పెరుగుదల, చైనా వంటి దేశాల ఎగుమతి పరిమితులు యూరియా దిగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయి. యుద్ధ ఉద్రిక్తతలు కూడా దిగుమతి సమస్యలను మరింత పెంచాయి. వర్షాకాలం రాకముందే, మార్చి నెల నుంచే యూరియా నిల్వలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలమైంది. వర్షాకాలం సమీపిస్తోందని ముందుగానే అంచనా వేసి, యూరియా నిల్వల కోసం కేంద్ర అధికారులతో సంప్రదింపులు జరపడంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర అధికారులు, వ్యవసాయ శాఖ మంత్రి ఏప్రిల్%-%మే నెలల్లోనే ఢిల్లీకి వెళ్లి యూరియా నిల్వలను సమీకరించేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పద్ధతిని అనుసరించకపోవడం వల్లే ఈ రోజు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ హల్‌చల్ చేస్తోంది. సబ్సిడీ యూరియా పారిశ్రామిక అవసరాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలు, అధిక ధరలు, కఠిన రేషన్ విధానాలు రైతులకు మరింత ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇటీవలి కాలంలో డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డీఈఎఫ్) వినియోగం గణనీయంగా పెరిగింది. నూతన డీజిల్ వాహనాలకు ఇది తప్పనిసరి కావడంతో, డీఈఎఫ్ తయారీలో యూరియాను వినియోగిస్తున్నారనే సమాచారం ఉంది. ఫలితంగా వ్యవసాయానికి కేటాయించిన సబ్సిడీ యూరియా పారిశ్రామిక అవసరాలకు మళ్లిపోయే అవకాశం ఉంది. ఈ దందాను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విజిలెన్స్ అధికారులను రంగంలోకి దించి, కఠిన చర్యలు తీసుకోవాలి. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ 145 పని దినాల్లో 78 రోజులు నిలిచిపోయింది. సాంకేతిక సమస్యలు, అమ్మోనియం లీకేజీతో ఉత్పత్తి నిలిచిందని యాజమాన్యం చెబుతోంది. ఈ ప్లాంట్ సామర్థ్యం ఏటా 12 లక్షల టన్నులు. షట్‌డౌన్ ప్రభావం తెలంగాణ వాటాపై పడింది. యూరియా కొరత వెనుక ప్రపంచ, దేశీయ సరఫరా సమస్యలు, పెరిగిన సాగు, స్థానిక ఉత్పత్తి అంతరాయాలు, బ్లాక్ మార్కెటింగ్, రాజకీయ సమన్వయ లోపం ఉన్నాయి. రైతు కష్టాలు తీరాలంటే సమయానికి సరఫరా, పారదర్శక పంపిణీ, తగిన బఫర్ స్టాక్‌లు, సమన్వయంతో కూడిన ప్రణాళిక తప్పనిసరి. లేకపోతే ప్రతి ఏడాది రైతులకు కష్టాలే మిగులుతాయి.

## భిన్న దేశాలతో దౌత్య సంబంధాలు



అంతా సవ్యంగా ఉన్న రోజుల్లో భిన్న దేశాలతో దౌత్య సంబంధాలు సాఫీగా సాగి పోతాయి. కానీ సవాళ్లు ఎదురయ్యే కాలంలో వాటిని నిలబెట్టుకోవటం, కొత్త బంధాలు ఏర్పర్చుకోవటం సులభం కాదు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైఖరి కారణంగా భారత్-అమెరికా సంబంధాల్లో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జపాన్‌లో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ఈ నెల 31న, ఆ మర్నాడూ చైనాలోని తియాన్‌జిన్‌లో జరగబోయే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో కూడా ఆయన పాలుపంచుకుంటారు. జపాన్‌తో మనకు చిరకాల మైత్రి ఉంది. మన స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ)ని స్థాపించి పోరాడినప్పుడు అన్ని విధాలా చేయూతనందించింది జపానే. స్వాతంత్ర్యానంతరం ఆ బంధం మరింత బలపడింది. రెండో ప్రపంచ యుద్ధ పరిసమాప్తి అనంతరం లాంఛనంగా 1951 సెప్టెంబర్ 8న శాన్‌ఫ్రాన్సిస్కో శాంతి ఒప్పందం కుదిరినప్పుడు జపాన్‌కు పాక్షిక సార్వభౌమత్వం మాత్రమే ఇవ్వాలన్న నిబంధనను మన దేశం తీవ్రంగా వ్యతిరేకించి సంతకం చేసేందుకు నిరాకరించింది. అందుకు జపాన్ ఈనాటికీ మన పట్ల కృతజ్ఞతగా ఉంటుంది. తొలిసారి 2014లో ఎన్డీయే సర్కారు ఏర్పడినప్పుడే మోదీ జపాన్‌ను సందర్శించారు. ఈ దశాబ్ద కాలంలో ఇరు దేశాల సంబంధాలూ మోదీ అన్నట్టు ఎన్నో రెట్లు పెరిగాయి. మన దేశంలో ప్రస్తుత జపాన్ పెట్టుబడుల విలువ 4,200 కోట్ల డాలర్లు. దేశంలోని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా మెట్రో రైలు ప్రాజెక్టులు జపాన్ ఆర్థిక సహకారంతో సాకారమయ్యాయి. ఢిల్లీ%-%ముంబై పారిశ్రామిక వాడ, సెమీకండక్టర్లు తదితరాలపై జపాన్ ముద్ర బలంగా ఉంది. ముంబై%-%అహ్మదాబాద్ మధ్య సాకారం కానున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు అత్యాధునిక ఈ%-%10 రకం బుల్లెట్ రైలును అందించాలని జపాన్ నిర్ణయించింది. వచ్చే పదేళ్లలో మన దేశంలో జపాన్ పెట్టుబడుల్ని పది లక్షల కోట్ల యెన్‌ల(6,800 కోట్ల డాలర్ల) స్థాయికి తీసుకెళ్లాలని మోదీ, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా శిఖరాగ్ర సమావేశంలో నిర్ణయించటం, పెట్టుబడులతోపాటు నవీకరణ, పర్యావరణం, ఆరోగ్యం తది తరాల్లో కలిసి పనిచేయాలనుకోవటం... రాగల అయిదేళ్లలో భిన్న రంగాల నిపుణుల సేవలు పొందేందుకు పరస్పరం అయిదు లక్షల మందిని బదలాయించుకోవాలను కోవటం భారత్, జపాన్‌ల మైత్రి పటిష్ఠతకు నిదర్శనం. ఈ క్రమంలో సహజంగానే సవాళ్లుంటాయి. స్వేచ్ఛాయుత, శాంతియుత, సంపద్వంత ఇండో%-%పసిఫిక్ ఆవిర్భవించాలన్న నినాదం అమెరికా ఛత్రఛాయలో ఏర్పడింది. దక్షిణ చైనా సముద్ర ప్రాంత సరిహద్దుల విషయంలో చైనాతో జపాన్‌కు తగాదా లేకున్నా, దాని దూకుడు పెద్ద సమస్యగా మారింది. చైనా తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల జపాన్‌కు ఎగుమతుల సమస్య ఏర్పడుతోంది. చైనాను కట్టడి చేయాలన్న బృహత్తర పథకానికి ఈ వివాదం తోడ్పడుతుందని అమెరికా భావించి మనల్ని అందులో కీలక భాగస్వామిని చేసింది. సుంకాల వివాదంలో ఇది ఎటు పోతుందన్న ఆందోళన జపాన్‌కు సహజంగానే ఉంటుంది. అయితే తమ వైఖరి మారబోదని మోదీ చెప్పటం జపాన్‌కు ఊరటనిచ్చే అంశం. ఇండో%-%పసిఫిక్ విషయంలో మన వైఖరి చైనాకు కంటగింపుగానే ఉండొచ్చు. జపా న్‌తో సంబంధాలు సుహృద్భావంతో ఉండగా, చైనాతో సంబంధాలు అందుకు భిన్నం. సుంకాల వివాదం నేపథ్యంలో భారత్ దగ్గరవుతుందన్న అంచనా చైనాకుంది. ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సుకు మోదీ వెళ్తారా వెళ్లరా అనే సంశయం మొదట్లో ఉన్నా... రష్యా చొరవతో అది సాధ్యపడుతోంది. ఇది సాన్నిహిత్యానికి దారి తీస్తుందా లేదా అన్నది చూడాలి. చైనా ఇప్పటికే ఎరువులు, అరుదైన ఖనిజాలు, సొరంగాల తవ్వకంలో తోడ్పడే యంత్ర సామగ్రి ఎగుమతులపై ఉన్న నిషేధాలు తొలగించటానికి సూత్రప్రాయంగాఅంగీకరించింది. మోదీ చైనా పర్యటనలో ఈ విషయంలో మరింత స్పష్టత వస్తుంది. చైనాతో మన సంబంధాలు బలపడే సూచనలుం డగా, ట్రంప్ సైతం చైనాతో సన్నిహితమై దక్షిణాసియాలో పలుకుబడి పెంచుకోవాలనుకుంటున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మన వ్యూహాత్మక ఆధిక్యతను నిలబెట్టుకుంటూ జపాన్, చైనాలతో సఖ్యత కుదుర్చుకోవటం దౌత్యపరంగా మనకు పెను సవాలే. మోదీ దీన్ని ఎలా ఛేదించగలరో చూడాలి.

## ప్రజాస్వామ్యానికే ప్రమాదం!

'ఫాసిజం అనేది ఒక్క రాత్రిలో రాదు. మెల్లమెల్లగా దేశంలోకి చొచ్చుకువస్తుంది. వ్యవస్థలను క్రమంగా బలహీనపరుస్తుంది. ఆ తర్వాత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా సమాధి చేస్తుంది..' జర్మనీలో నాజీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది చరిత్రకారులు, రచయితలు చేసిన వ్యాఖ్యలివి.. ప్రస్తుతం భారతదేశం అటువైపే ప్రయాణిస్తున్నదా? అనే తీవ్రమైన ఆందోళన ప్రజాస్వామ్యవాదులను కలచివేస్తున్నది. ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ వ్యవహరిస్తున్న తీరును ఇటీవల రాహుల్ గాంధీ బయటపెట్టాక.. ఈ ఆందోళన మరింత పెరిగింది. ఇండియాలో కూడా అలాంటి సిద్ధాంతాలను అనుసరిస్తున్నారా అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ అనుమానం.. వాస్తవరూపం దాల్చే దారిలో అడుగులు పడక ముందే.. ప్రజలు, ముఖ్యంగా యువత మేల్కొనాల్సిన అవసరముంది. లేకుంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడి.. ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాలు.. ఆనాటి జర్మనీలో నాజీల పాలనా లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయని విమర్శకులు, మేధావులు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాజీ పాలనలో హిట్లర్ ఒక్కడినే దేశరక్షకుడిగా చిత్రీకరించారు. అప్పుడు జర్మనీలో జాతీయతను ఒక ఆయుధంగా మలిచి.. ప్రశ్నించే, విమర్శించే వారిని దేశద్రోహులుగా ముద్రవేసేవారు. ఇప్పుడు ఇండియాలోనూ భారత్ మాతాకీ జై వంటి నినాదాలను జాతీయతకు, తమ రాజకీయ ఎజెండాకు ఒక సాధనంగా మలుచుకుంటున్నారు. భారత్ లో విపక్ష పార్టీల నేతలు, వారి కుటుంబసభ్యులపై ఈడీ, సీబీఐ, ఐటీ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా వారిని బలహీనపర్చే కార్యక్రమం కొనసాగుతున్నది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే నేతలు, మేధావులు, సామాజిక కార్యకర్తలపై దేశద్రోహం ముద్ర వేసి అనేక సంవత్సరాలుగా జైళ్లలో ఉంచుతున్నారు. మైనార్టీలైన ముస్లింలు, క్రైస్తవుల పట్ల వివక్ష పెరిగేలా కుట్రలు పన్ని అమలు చేస్తున్నారు. సీఏఏ, ఎన్‌ఆర్సీ వంటి చట్టాలు ఇందులో భాగమే అనే అభిప్రాయాలున్నాయి. గోరక్షకుల దాడులు, మతమార్పిడి ఆరోపణలతో దాడులు, మణిపూర్‌లో జాతి హింస వంటివి ఈ వివక్షను స్పష్టంగా సూచిస్తున్నాయి.

ముఖ్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్ పై వస్తున్న తీవ్రమైన ఆరోపణలు ఇందుకు నిదర్శనం. అయితే ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా ఈసీ సరైన జవాబు ఇవ్వకపోవడం ఈ అనుమానాలను మరింత బలోపేతం చేస్తున్నది. కొన్నేళ్లుగా వెలువడుతున్న తీర్పులను చూస్తే న్యాయవ్యవస్థపైనా ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అంతేకాకుండా గతంలో బీజేపీ ప్రతినిధిగా పని చేసిన ఒక నాయకురాలిని బాంబే హై కోర్టు జడ్జిగా ప్రతిపాదించడం కూడా ఇందులో భాగమేననే చర్చ జరుగుతున్నది. 'ఎలాంటి నేరం చేయకున్నా దేశంలోని అనేక మంది కవులు, రచయితలు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు జైళ్లలో మగ్గుతున్నారు.. కానీ బహిరంగంగా మారణహోమానికి పిలుపునిచ్చేవారికి మాత్రం బెయిల్ దొరుకుతున్నది' అని అరుంధతి రాయ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. విమర్శనాత్మక ఆలోచనలను అణచివేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విమర్శలు చేసినందుకు జేఎన్ యూ వంటి వర్సిటీల్లో విద్యార్థులు, ప్రొఫెసర్లు దాడులకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఇదీ జర్మనీలో నాజీల విధానాన్ని గుర్తుకు తెస్తున్నాయన్నారు. జోసెఫ్ గోబెల్స్ నాయకత్వంలోని ప్రచార మంత్రిత్వ శాఖ జర్మనీలో మీడియాను పూర్తిగా నియంత్రించింది. ఇప్పుడు భారతదేశంలో మీడియా స్వేచ్ఛ క్రమంగా క్షీణిస్తున్నదని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ వంటి సంస్థలు గుర్తించాయి, 2025 వరల్డ్ ఫ్రీడమ్ ఇండెక్స్ ప్రకారం 180 దేశాల్లో మీడియా స్వేచ్ఛలో ఇండియా 151వ స్థానంలో ఉన్నది. అంతేకాకుండా ప్రతిసంవత్సరం వివిధ కారణాలతో వందలాది మంది జర్నలిస్టులను అరెస్ట్ చేస్తున్నారు. జర్నలిస్టుల హత్యలు సైతం జరుగుతున్నాయి. నాజీల పాలనలో మీడియా అంతా ప్రభుత్వ అనుకూల వార్తలను మాత్రమే ప్రసారం చేసేది. భారత్ లోనూ ప్రస్తుతం మీడియా ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు చోటివ్వకుండా ప్రభుత్వ భజననే చేస్తున్నది.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
సోమవారం 1 సెప్టెంబర్ 2025
www.viswamvoice.com





## పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మెడికల్ క్యాంప్



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని ఆదివారం చిక్కం వెంకటకృష్ణ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో పేరాయి చెరువులో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు విచ్చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టి డి పి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్లరమణబాబు, జనసేన నాయకులు చిక్కం భీముడు, చిక్కం ఉమేష్, యాళ్ల సతీష్,చిక్కాల సతీష్, గండి స్వామి, పెయ్యాల దుర్గారావు,గునిశెట్టి చినబాబు పడాల నానాజీ,ఎంపీటీసీ తాళ్ళ లలితా, రవి,నల్లా పవన్,చిక్కం రమేష్ మారిశెట్టి, చిక్కం కాసు, నాగులపల్లి రాజు, నల్లా పవన్, రవణం మధు, మధుర శ్రీను, మోటూరి కిరణ్ అర్లపల్లి దుర్గ, మధుర సత్యనారాయణ, సలాది నాగరాజు, సలాది గణపతి, బిక్కిన ఏసు, గనిశెట్టి లలితా శ్రీనివాస్, గొల్లకోటి వెంకటేష్, ఆకేటి వెంకన్న, అరిగెల నానాజీ, నరసింహామూర్తి, గుమ్మళ్ళ తాతకాపు, చెట్ల మంగతాయారు, దంగేటి బేబీ, కోడి శివ,వరసాల రమణ, వీరమహిళలు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లపై మెరుపుదాడి...

### 8 మందిపై కేసు నమోదు...



మండపేట మండలం... విశ్వ వాయిస్ న్యూస్... మండపేట మండలం లోని ఏడిదలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న కొందరు వ్యక్తులను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్ కు అందిన సమాచారం మేరకు ఎస్సై వీ కిషోర్ తన సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేశారు. గ్రామ శివారు ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై కిషోర్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.7,800 నగదు, 104 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

## ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం...




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యాభ్యాసం కొనసాగించిన నలుగురికి ఉద్యోగ అవకాశాలు దక్కినట్లు కళాశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్ ఏన్ నరసింహారావు ఆదివారం తెలిపారు.. టీచర్ ఉద్యోగానికి కాట్రేనికోనకు చెందిన పంతాడి వీర వేణి సెలెక్ట్ అయినట్లు. అదే మండలానికి చెందిన లంకె రామకృష్ణ పోలీస్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అమలాపురం మండలం తాండవపల్లి గ్రామానికి చెందిన జల్లి నాగమణి. కొత్తపేటకు చెందిన వట్టికూటి రాజేష్ కుమార్ పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఒకే కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కావడంతో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె. మనోహర్. కరాటం ప్రవీణ్. యాలంగి వరప్రసాద్.కే శ్రావణ్ దిలీప్ చోడే జాన్ పాల్. సిహెచ్ సంసోన్. డాక్టర్ కె హేమ విజిత మల్లిపూడి విజయలక్ష్మి వెంకటేష్. శ్రీనివాస్‌ల వెంకట్ పాల్గొన్నారు

## రామాయం పట్నం దిశ తిరిగినట్టే

**ఒంగోలు:** దేశంలో ఇంధన డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ భారీ ప్రణాళికతో ముందుకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో ఒక అత్యాధునిక చమురు రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వ రంగ సంస్థ యోచిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను ప్రస్తుతం పరిశీలిస్తోంది.ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి,

# చంద్రబాబు నాయుడు మరో 15 సంవత్సరాలు ముఖ్యమంత్రి గా ఉండాలి

**ఎం ఎల్ ఏ అయితాబత్తుల**



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** చంద్రబాబు నాయుడు మరో 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటేనే అమరావతి అద్భుత నగరంగా తీర్చి దిద్దబడుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ఆదివారం స్థానిక ఎర్ర వంతెన వద్దగల తన క్యాంపు కార్యాలయంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరిట ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తన హయాంలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినప్పటికీ చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో సూపర్ సిక్స్ పథకా లను సూపర్ హిట్ చేశారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్ ప్రయాణం పథకాన్ని అందించినందుకు అమలాపురం నియోజకవర్గం మహిళల తరపున చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## రైతులకు డ్రోన్లు పంపిణీ చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్



**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ 31 ఆగస్టు:-** వ్యవసాయ రంగంలో ఆధునిక యాంత్రీకరణ అయిన డ్రోన్లు వినియోగం అన్ని విధాల రైతుకు శ్రేయస్కరమని, పెట్టుబడులను గణనీయంగా తగ్గించేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడు పడుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశె ట్టి సుభాష్ రైతులకు పేర్కొన్నారు.ఆదివారం ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ లో జరిగిన వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రామచంద్రపురం, కె.గంగవరం మండలాల రైతులుకు కిసాన్ డ్రోన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి సుభాష్ ముఖ్య అతిధిగా పాల్గొని డ్రోన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ మొత్తం 7 డ్రోన్లను 7 రైతు గ్రూపులకు రూ.68 లక్షల 60 వేలు రూపాయలతో పంపిణీ చేయగా,వీటిలో రూ.54 లక్షల 88 వేల రూపాయలను ప్రభుత్వం సబ్సిడీగా అందించిందన్నారు. ఈ మొత్తం వ్యయంలో రూ.13 లక్షల 72 వేల రూపాయలు రైతు వాటాగా చెల్లిం చారన్నారు.ఇప్పటికే డ్రోన్ల వినియోగంపై పైలట్లకు 15 రోజులు పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి వ్యవస్థకు దార్శనికత కలిగిన నాయకుడు అవసరమని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర సాధన కొరకు ముందు సాగుతుందన్నారు. దీనిలో భాగంగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకుని వచ్చి ఆధునిక సాంకేతికతను జోడిస్తూ పెట్టుబడి ఖర్చులను, లేబర్ సమస్యను అధిగమించే దిశగా ముందుకు సాగుతుందన్నారు. డ్రోన్‌ల వినియోగం చాలా ఉపయోగకరంగా ఉంటుందనీ వీటిని వివిధ పనులకు ఉపయోగిస్తూ, రైతులకు సమయం, డబ్బు ఆదా చేయ డంలో డ్రోన్ వ్యవస్థ కీలకంగా మారిందన్నారు. డ్రోన్‌ల ప్రధానంగా విత్తనాలు చల్లడం, కష్టమైన ప్రదేశా లలో లేదా పెద్ద పొలాలలో విత్తనాలను వేగంగా, సమర్థవంతంగా వెదచల్లగలవన్నా రు. సాంప్రదాయ పద్ధతుల కంటే ఇది చాలా వేగంగా పనిచే యడం జరుగుతుంద న్నారు. పంటల ఆరోగ్య పర్యవేక్షణ కొరకు డ్రోన్‌లలో అమర్చిన కెమెరాలు, సెన్సార్ల ద్వారా పంటల ఆరోగ్యాన్ని పర్యవే క్షిస్తాయ న్నారు.ఏదైనా తెగుళు ,,వ్యాధులు ఉన్నా లేదా నీటి లభ్యత తక్కు వగా ఉన్నా వెంటనే గుర్తించగలవన్నారు. పురుగుమందులు, ఎరువులు చల్లడం వంటి పనులు ఎంతో కచ్చితంగా సులవతరంగా సమర్థవం తంగా నిర్వహిస్తాయన్నారు. అవసరమైన చోట మాత్రమే రసాయనాలను చల్లడం ద్వారా క్రిమి స%శీ% హారక మందుల అనవసర వినియో గాన్ని తగ్గిస్తుందన్నారు. పర్యా వరణానికి హానిని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. డ్రోన్‌లు తీసిన డేటా ఆధారంగా పంటల దిగుబడిని అంచనా వేయవచ్చున న్నారు. రైతులకు తమ పొలాల నుండి ఎంత దిగుబడి వస్తుందో ముందు గానే అంచనా వేయడానికి సహాయ పడుతుందన్నారు. డ్రోన్‌లలోని థర్మల్ సెన్సార్ లు పొలంలో తేమ స్థాయిలను గుర్తించి, నీటి అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తిస్తాయన్నారు. దీనివల్ల నీటిని అనవసరంగా వాడకుండా సమర్థవంతంగా వినియో గించుకోవచ్చునన్నారు. ఈ విధంగా వ్యవసాయంలో డ్రోన్‌ల వాడకం వల్ల పంట దిగుబడిని పెంచడం, ఖర్చులను మానవ శ్రమను తగ్గిస్తూ వ్యవసాయ కార్య కలాపాలను మరింత సమ ర్థవంతంగా నిర్వహించడం సాధ్యమవు తుందన్నారు.

## చెన్నై, హైదరాబాద్.., బెంగళూరు ఇక 2 అవర్స్... అమరావతి నుంచి కొత్త లైన్లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. హైదరాబాద్- చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎలైన్‌మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ కారిడార్ అమరావతిని చేరుకుంటూ, సీఆర్డీయే మీదుగా వెళ్తుంది. ఇదే విధంగా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్లే హైదరాబాద్- బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్‌కూ ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ రెండు రైలు మార్గాల నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లో ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.మెట్రో నగరాల మధ్య బుల్లెట్ రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్, హైదరాబాద్- బెంగళూరు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్తాయి. ఈ రెండు కారిడార్లు ప్రారంభంలో హైదరాబాద్ నుంచి శంషాబాద్ వరకు 38.5 కిలోమీటర్ల వరకూ ఒకే మార్గంలో వెళ్తాయి. అనంతరం, చెన్నై, బెంగళూరు వైపుగా విడిపోయే వేర్వేరు మార్గాలుగా సాగుతాయి.హైదరాబాద్- చెన్నై హైస్పీడ్ కారిడార్ కోసం 839.5 కి.మీ, 749.5 కి.మీ, 744.57 కి.మీలతో 3 ప్రతిపాదిత మార్గాలను పరిశీలించారు. వీటిలో అతి తక్కువ దూరమైన 744.5 కి.మీ. మార్గాన్ని ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఖరారు చేశారు. ఈ కారిడార్‌లో తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 8, తమిళనాడులో 1 స్టేషన్ నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, నాయుడుపేట, తడ ఉన్నాయి.ఈ మార్గం హైదరాబాద్‌లో ప్రారంభమై అటు నుంచి శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం/కోదాడ మీదుగా అఖీఆం ప్రాంతానికి చేరుకుని, అక్కడి నుంచి గుంటూరు వైపు సాగుతుంది. గుంటూరు తర్వాత చీరాల వైపు వెళ్తూ, విజయవాడ - చెన్నై రైల్వే లైన్‌కు సమాంతరంగా చెన్నై వరకు వెళ్లేలా కారిడార్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో అత్యధికంగా ఏపీలో 448.11 కి.మీ, తరువాత తెలంగాణలో 236.48 కి.మీ, తమిళనాడులో 59.98 కి.మీ మేర రైలు మార్గం ఉండనుంది.ఈ కారిడార్‌ను తిరుపతి మీదుగా మళ్లిస్తే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని ప్రాథమికంగా చర్చ జరిగింది. గూడూరు నుంచి తిరుపతి మీదుగా మారిస్తే, కారిడార్ పొడవు అదనంగా 53.5 కి.మీ దూరం పెరుగుతుంది. ఈ మార్పుతో నాయుడుపేట, తడ స్టేషన్లు మార్గంలో ఉండకపోవచ్చు. మొత్తం హైస్పీడ్ ట్రాక్ నిర్మాణంలో డబుల్ ట్రాక్, లూప్‌లైన్లు, సైడింగ్స్ కలిపి మొత్తం 1,419.4 కి.మీ వరకు ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.హైదరాబాద్- బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌కు సంబంధించి మూడు ప్రతిపాదిత మార్గాలు 621.8 కి.మీ, 576.6 కి.మీ, 558.2 కి.మీలను పరిశీలించారు. వీటిలో 576.6 కి.మీ మార్గం అత్యుత్తమంగా భావించి ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఆమోదం లభించింది. ఈ మార్గం ప్రస్తుత హైదరాబాద్- బెంగళూరు హైవేకి చాలావరకు సమాంతరంగా ఉంటుంది. ఈ కారిడార్‌లో తెలంగాణలో 4, ఆంధ్రప్రదేశ్‌లో 6, కర్ణాటకలో 3 స్టేషన్లు నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం ఉన్నాయి. ఈ మార్గంలో తెలంగాణలో 218.5 కి.మీ, ఏపీలో 263.3 కి.మీ, కర్ణాటకలో 94.80 కి.మీ మేర రైలు మార్గం ఉంటుంది. డబుల్ లైన్, లూప్‌లైన్లు, సైడింగ్స్ కలిపి మొత్తం 1,363 కి.మీ మేర ట్రాక్ నిర్మించనున్నట్లు ఎలైన్‌మెంట్‌లో పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండ సమీపంలో ఉన్న కియా పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల నేపథ్యంలో దుద్దేబండ వద్ద ప్రత్యేకంగా స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. హైదరాబాద్- అమరావతి- చెన్నై హై స్పీడ్ రైలు కారిడార్, హైదరాబాద్- బెంగళూరు మధ్య బుల్లెట్ రైళ్ల కారిడార్లు పూర్తవడంతో పాటు బెంగళూరు- చెన్నై మధ్య చేపట్టే బుల్లెట్ రైలు కనుక అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి అమరావతికి.. అమరావతి నుంచి చెన్నై, బెంగళూరు నగరాల మధ్య బుల్లెట్ రైళ్ల చతుర్భుజి ఏర్పాటు అవుతుంది. తద్వారా ఈ నగరాల మధ్య ప్రయాణం గంట నుంచి రెండు గంటల్లోనే పూర్తవుతుంది.

## వైసీపీ ఉక్కు రాజకీయం

**విశాఖపట్టణం:** ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ " విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ " అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు -విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు "పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి" గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు.

## కాజులూరు గ్రామంలో మెగారక్తదాన శిబిరం...

### ముఖ్య అధితిగా పాల్గొన్న వేగుళ్ళ లీలాకృష్ణ.....




**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** సెప్టెంబర్ 2వ తేదీన జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గం, కాజులూరు గ్రామంలో అన్యం శ్రీరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ముఖ్య అధితిగా రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు లీలాకృష్ణ కు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన దాతలు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## తర్వానిపేట వరసిద్ధి వినాయకుని మందిరంలో విద్యా గణపతి పూజ



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మండపేట పట్టణం 4వ వార్డు తర్వణిపేటలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నవరాత్రి పూజ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యా గణపతి పూజ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మండపేట మున్సిపల్ చైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలు, పెన్ లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎనిమిదవ సంవత్సరం ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. చిన్నారులకు సాంప్రదాయం పట్ల అవగాహన కల్పించడంలో భాగంగా ప్రతి సంవత్సరం విద్యా గణపతి పూజ నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబర్ మూడవ తేదీన శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు పూజలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ గుండు రామ తులసి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మచ్చానాగు, ఆలయ కమిటీ సభ్యులు గుండు వీర తాతరాజు, గ్రంధి బుల్లిబాబు, జర్నలిస్ట్ జాయన సాయి సత్యనారాయణ, జర్నలిస్ట్ మోహన్ రావు, పొలమూరి శ్రీనివాస్,పోలమూరు త్రినాథ్, కోదూరి నాగరాజు, ఆరేటి మహేష్, బొల్లంరెడ్డి స్వామి, రెడ్డి రవిరాజు, కే రామకృష్ణ, ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాపు నేత నల్లా సూర్యచంద్రరావు 13వ వర్ధంతి కి ఘన నివాళులు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** ఆదివారం కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్, దివంగత నేత నల్లా సూర్యచంద్రావు 13 వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, కుమారులు సంజయ్, అజయ్, కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, మరియు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జనసేన నాయకులు కల్వకోలను తాతాజీ నల్లా సూర్యచంద్రరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నల్లా పవన్, నల్లా అజయ్,సంజయ్ నల్లా గార్డెన్, మహిపాలవీధి, గండు వీధి లలో వున్న ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నల్ల సూర్యచంద్రరావు అభిమానులు ప్రభుత్వ ఆసుపత్రిలో పళ్ళు ,బ్రెడ్డు పంచి పెట్టడం, రక్తదాన శిబిరం లాంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కౌన్సిలర్ ఎడిద శ్రీను, ఆర్డీఎస్ ప్రసాద్, కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, గోకరకొండ గంగన్న స్వామి, అరిగెల నాని మరియు నల్లా సూర్యచంద్రావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## ట్రాక్టర్ ట్రక్కుల దొంగల ముఠా అరెస్ట్

**రూ. 5.25 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా గండేపల్లి పోలీసులు ట్రాక్టర్ ట్రక్కులను దొంగిలిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ. 5,25,000 విలువైన దొంగిలించిన ట్రక్కులు, నేరానికి ఉపయోగించిన ట్రాక్టర్ ఇంజిన్, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.గత కొద్ది రోజులుగా గండేపల్లి మండలంలోని తాళ్లూరు, మురారి వంటి గ్రామాల్లోని రైతుల పొలాల నుంచి ట్రాక్టర్ ట్రక్కులు వరుసగా చోరీకి గురయ్యాయి. దీంతో ఆందోళన చెందిన రైతులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా జగ్గంపేట సీఐ వై.ఆర్.కె. శ్రీనివాస్ మరియు గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఈ దొంగతనాలకు ధవలేశ్వరం మండలం రాజోలు గ్రామానికి చెందిన బి. రత్నరాజు (నాని), కడియం మండలం జేగురుపాడుకు చెందిన ఎం. శ్రీను, పి. తరుణ్, ఎం. వినయ్ అనే నలుగురు వ్యక్తులు పాల్పడినట్లు గుర్తించారు. వీరు తమ సొంత ట్రాక్టర్ ఇంజిన్లతో వచ్చి రైతుల పొలాల్లో నిలిపి ఉంచిన ట్రక్కులను దొంగిలించి పరారవుతున్నట్లు సీఐ వై.ఆర్.కె. శ్రీనివాస్ వెల్లడించారు.పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు దొంగిలించిన ట్రక్కులు, ట్రాక్టర్ ఇంజిన్, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ రూ. 5,25,000 ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ దొంగల ముఠా అరెస్టుతో గండేపల్లి మండలంలోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

## జగ్గంపేటలో పోలీస్ సైకిల్ ర్యాలీ



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేటలో ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీస్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జగంపేట హైస్కూల్ వద్ద నుంచి మెయిన్ రోడ్ మీదగా స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై రఘు మాట్లాడుతూ సైక్లింగ్ అత్యంత ఉపయోగకరమన్నారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్య భద్రత పొందవచ్చన్నారు.ఇక నుంచి ప్రతి ఆదివారం ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై దృష్టి సారించాలన్నారు.ఆరోగ్య అవగాహనతో పాటు, ప్రజల్లో శారీరక దృఢత్వం, ఫిట్నెస్ ప్రాధాన్యతపై స్ఫూర్తిని నింపేందుకు ఈ ర్యాలీ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## జగ్గంపేట సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్‌కు ఉత్తమ సేవ పురస్కారం



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ చేతుల మీదుగా జగ్గంపేట సీఐ వై.ఆర్.కె. శ్రీనివాస్ ఉత్తమ సేవ పురస్కారం పత్రాన్ని అందుకున్నారు.విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, సేవా తత్పరతకు గుర్తింపుగా జిల్లా ఎస్పీ పలువురు పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంలో ఎస్పీ బిందు మాధవ్, ఉత్తమ సేవలందించినందుకు జగ్గంపేట సిఐ ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ అవార్డు అందుకున్నందుకు స్థానికులు, సహచరులు సి ఐ వై ఆర్ కె కు హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ

**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**మామిడాడ నుండి అప్పన పాలెం వెళ్లే 3 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు కోటి 20 లక్షలతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**


**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట గత వైసీపీ ప్రభుత్వంలోఅభివృద్ధికి నోచుకోని గ్రామీణ రహదారుల మహర్దశ పట్టిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం మామిడాడ నుండి ఏలేశ్వరం మండలం అప్పన పాలెం కు మూడు కిలోమీటర్లు కోటి 20 లక్షల రూపాయలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నెహ్రూ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడాడ చుట్టుపక్కల ఐదు గ్రామాల ప్రజలు ఏలేశ్వరం వెళ్లేందుకు మామిడాడ నుండి అప్పన్నపాలెం వెళ్లేందుకు మూడు కిలోమీటర్లు పంచాయతీరాజ్ నిధులతో కోటి 20 లక్షల రూపాయలతో తారు రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని అన్నారు. అప్పన పాలెం



వద్ద గత వరదల్లో బ్రిడ్జి కూలిపోవడం జరిగిందని రాబోయే రోజుల్లో 10 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టడం జరుగుతుందని అన్నారు. అంతవరకు ఇర్రిపాక వద్ద ఏలేరు నదిపై తాత్కాలిక వంతెన నిర్మాణం జరిగిందని ప్రజలు ఆ బ్రిడ్జిని ఉపయోగించుకోవచ్చని అన్నారు. రామవరం రాజుపాలెం రోడ్డుకు 14 కోట్లు మంజూరయ్యాయని ఆ నిధులు కాంట్రాక్టర్ తీసుకుని పనిచేయటం లేదని తాత్కాలిక మారామత్తులకు 28 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగిందని వారం రోజులనే పనులు పూర్తి మొదలుపెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, రేఖ బుల్లి రాజు, మండపాక అప్పన్న దొర, పంచాయతీరాజ్ ప్రాజెక్టు డి ఈ గంగాధర్, గల్లా శ్రీను, ఎంపీటీసీ వేగి చల్లారత్నం రామకృష్ణ, పెంటకోట సత్యనారాయణ, సర్పంచ్ కర్రీ సూర్యకుమారి శ్రీనివాస్, బోదిరెడ్ల సుబ్బారావు, గండే కాశి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పస గొడుగుల బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# సేవాభావాన్ని చాటిన పూర్వ విద్యార్థులు







**భూపతిపాలెం స్కూల్‌లో మెగా మెడికల్ క్యాంప్, కొత్త లైబ్రరీ ప్రారంభం**

**ముఖ్యఅతిథిగా హాజరై పూర్వ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** గోకవరం మండలం భూపతిపాలెం రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు మెగా మెడికల్ క్యాంపు తో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్కూల్లో ఉన్న విద్యార్థులు అందరికీ కంటి చూపు చికిత్స, చర్మవ్యాధుల చికిత్స, దంత సమస్యలపై మెడికల్ క్యాంపు పెట్టి టెస్టు చేశారు. అనంతరం లక్ష రూపాయలతో లైబ్రరీకి పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. పూర్వ విద్యార్థుల నూతన కమిటీ ప్రెసిడెంట్ సుజ్ఞాన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూలుకు పూర్వ విద్యార్థులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ గురుకుల పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని ఈరోజు విద్యార్థులకు వైద్య పరీక్షలు, వారి మేధోసంపత్తికి ఎంతో ఉపయోగపడే బుక్స్ లైబ్రరీ ఏర్పాటు చేయించడం చాలా అభినందనీయమని మీరు కూడా అదే స్థాయిలో కష్టపడి చదువుకుని రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాలని విద్యార్థులను ఎమ్మెల్యే కోరారు. అనంతరం మెడికల్ క్యాంపు లో పాల్గొన్న డాక్టర్స్ ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు పిల్లా చంటిబాబు, పోతుల మోహనరావు, భూపతిపాలెం గురుకుల పాఠశాల చైర్మన్ గల్లా రాము, సర్పంచులు యిడుదల అర్జున్ రావు, కమ్మెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మరిసేఅరుణఅప్పారావు,బదిరెడ్డి అచ్చన్న దొర, దాసరి సీతారామకృష్ణ, ఎస్ బాబు, పోసిన ప్రసాద్, వైస్ చైర్మన్ రాజీవ్, మెడికల్ క్యాంపు డా కాటన్,డాఅడ్డాల సత్యనారాయణ,డావివిమూర్తినిర్వహించబడింది,అలుమ్నిఅసోసియేషనూ ఏర్పఅధ్యక్షుడురత్నకుమార్, వర్మ పి.బి. శ్రీనివాస్, ,వైస్ ప్రెసిడెంట్ పరమహంస, జయచంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీహరి పి ఎస్ కె నాగేశ్వరరావు, ప్రసాదబాబు గోపాల్ , ఈసీ మెంబర్ పట్టాభి , మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# జనసేనాని సేవలు యువతకు ఆదర్శనీయం

**రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్**

**కాజులూరులో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు**

**రక్తదాన శిబిరంను ప్రారంభించిన మంత్రి సుభాష్**

**విశ్వం వాయిస్ న్యూస్ కాజులూరు** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ సమాజానికి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం కాజులూరులో దివంగత జనసేన నాయకులు అన్యం గోవిందు తనయుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకల్లో మంత్రి సుభాష్ పాల్గొని ప్రారంభించారు. ఈమేరకు స్థానిక జడ్పీ హై స్కూల్ లో మెగా రక్తదాన శిభిరం నిర్వహించగా ఆ శిభిరంలో 102మంది జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. అదేవిధంగా అన్న దాన కార్యక్రమం సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా హాజరైన మంత్రి సుభాష్ నిర్వాహకులు అన్యం శ్రీరామ చంద్రమూర్తి, ఇతర జనసైనికులను అభినందించారు. స్వచ్ఛందంగా రక్త దానం చేసిన వారికి ఆయన చేతులమీదుగా పవన్ కళ్యాణ్ చిత్రపటాలను, సర్టిఫికెట్లనుఅందజేశారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే సదుద్దేశంతో పవన్ కళ్యాణ్ పార్టీను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని కీర్తించారు. కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా తనదైన శైలిలో ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. సమాజాన్ని జాగృతం చేసే కార్యక్రమాలు చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన పుట్టినరోజు వేడుకలు ముందస్తుగా నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. మాజీ





మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ నేటి తరాన్ని జాగృతం చేసే గొప్ప నాయకత్వ లక్షణాలు కలిగిన జనసేనాని పవన్ కళ్యాణ్ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఏఎంసి చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ మాట్లాడుతూ మానవతా విలువలు ఉన్న గొప్ప నాయకుడుగా, మంచితనానికి నిదర్శనంగా డిప్యూటీ సీఎం ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమలో జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, గంధం పళ్ళంరాజు, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, దుగ్గిన బాబ్జి, శ్రీయువసేన సతీష్ తదితరులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సామాజిక సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసిన అన్యం శ్రీరామ్ ను అభినందించారు. వారి తండ్రి దివంగత నాయకులు అన్యం గోవిందు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కేకు కోసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి సలాది వీరబాబు, జనసేన జిల్లా నాయకులు దేగల సతీష్ పలువురు పవన్ కళ్యాణ్ అభిమానులు, యువకులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు తప్పవా...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించాల్సిన నిధులు ఇప్పటికే తెచ్చేసుకున్నారు. తొలి ఏడాదిలోనే అవసరమైన నిధులకు సమీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించింది. అయితే రానున్న కాలంలో చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లినా అనుకున్న స్థాయిలో నిధులు వచ్చే అవకాశాలు లేవన్నది ఉన్నతాధికారుల నుంచి అందుతున్న సమాచారం. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వం ఫోకస్ అంతా బీహార్ పైనే ఉంది. బీహార్ లోనూ, వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడుపైన ఎక్కువ దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కు ఇప్పట్లో ఎన్నికలు లేకపోవడంతో పాటు ఇప్పటికే చంద్రబాబు అడిగినంత మేరకు ఆర్థిక సాయం చేయడమే కాకుండా అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పుడు బీజేపీకి చంద్రబాబు ప్రయారిటీ కాదన్నది రాజకీయంగా వాస్తవం. చంద్రబాబు నాయుడు కూటమిలోనే ఉన్నందున ఆయన వల్ల రాజకీయంగా ఇబ్బందులు తలెత్తవని కూడా బీజేపీ నేతలు భావిస్తున్నారు. అందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ లోని 34 విభాగాల్లో ప్రయివేటీకరణకు సిద్ధమయిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల విడుదలలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇక పెద్దగా ఆసక్తి చూపదని చెబుతున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉంటుందని భావించి సంక్షేమ పథకాలను గ్రౌండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు చేశారు. ఎఫ్ఆర్ఎంబీ పరిమితికి మించి అప్పులు చేశారన్న ఆరోపణలు కూడా విపక్ష వైసీపీ నేతలు చేస్తున్నారు. అదే సమయంలో ఇక ప్రతి నెలా సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఆంధ్రప్రదేశ్ లో ఆదాయం కంటే హామీలకు అవసరమైన నిధుల అవసరం ఎక్కువ కావడంతో ఇక రానున్న కాలంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్పవన్న కామెంట్స్ అధికారిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో చంద్రబాబు సమావేశమయినప్పటికీ ఆశించిన స్పందన లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడుకు రానున్న కాలం ఖజానాను నింపడం, వెల్ఫేర్ స్కీమ్స్ ను కొనసాగించడం కత్తిమీద సాము వంటిదేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

==================

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్

విశాఖపట్టణం : ప్రముఖ దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పుడు వైజాగ్‌లోనూ అడుగుపెట్టనుంది. సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. అంతేనా.. ఆసియా ఖండంలోనే ఇది అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్ కానుంది. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసే అతిపెద్ద కేంద్రానికి సైతం విశాఖ వేదిక కానుంది. ఈ మేరకు గూగుల్‌కు చెందిన ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో వెల్లడించింది. గూగుల్ ప్రతిపాదన గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి డిజిటల్ హబ్‌గా దేశానికి గుర్తింపు వస్తుందని జాతీయ పెట్టుబడుల ప్రోత్సాహక, సమన్వయ సంస్థ ఇన్వెస్ట్ ఇండియా తన ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ ఇండియా ప్రకటనలో ఇప్పుడు యావత్ ప్రపంచం ఫోకస్ ఏపీపై నిలిచింది. గూగుల్ క్లౌడ్, సెర్చ్, యూట్యూబ్, ఏఐ వర్క్‌ల పర్యావరణ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపయోగపడనుంది. అంతేకాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది.విశాఖలో త్వరలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్.. దేశానికి చెందిన మొత్తం డేటా నిల్వ చేయనుంది. దీనివల్ల ఉగ్రమూక చేతిలోకి విలువైన డేటా చేరే అవకాశం తప్పుతుంది. అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను పెంచేందుకు 3 సబ్ మెరైన్ కేబుల్స్‌కు సరిపడా ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి డేటా సెంటర్‌ను అనుసంధానిస్తుంది. ముంబయిలో గూగుల్‌కు చెందిన పియరింగ్, క్యాచీ సర్వర్లు ఉన్నాయి. అక్కడి నుంచి సముద్ర మార్గంలో కేబుల్ తీసుకోవడం సులువు అవుతుంది. డార్క్ ఫైబర్ ద్వారా తక్కువ ఖర్చుతో తీసుకోవాలని ప్రణాళికలు వేస్తున్నారు. డేటా సెంటర్ కూలింగ్ కోసం పెద్దఎత్తున నీరు అవసరం అవుతుంది. అందుకే డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ విశాఖ సముద్ర తీరాన్ని ఎంపిక చేసుకుంది.పైగా ఐటీ రంగంలో రూ.2 కోట్ల పెట్టుబడి పెడితే ఒకరికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఆ లెక్కన గూగుల్ సంస్థ పెట్టే సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రంలోని సుమారు 25 వేల మంది నిరుద్యోగులకు దశలవారీగా ప్రత్యక్ష ఉపాధి అవకాశం లభించనుంది. ఇక పరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి లభించనుంది. అంతేకాకుండా డేటా సెంటర్ కోసం పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలని గూగుల్ నిర్ణయించింది. ఆ విద్యుత్ ప్రాజెక్టుల కోసం సుమారు రూ.20 వేల కోట్లు గూగుల్ ఖర్చు చేయనుంది. సముద్ర తీరం వెంట చిన్న హైడ్రో ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వచ్చే విద్యుత్‌ను గూగుల్ వినియోగించుకోనుంది.



# బలమైన బిజెపి -బలమైన భారత్ నినాదంతో మాధవ్ నేడు పర్యటన

- మాధవ్ పర్యటన జయప్రదం చేయాలి
- సారధ్యం యాత్రకు అనూహ్య స్పందన
- అభివృద్ధి ,సంక్షేమంతో ఎన్డీయే పాలన
- బలమైన బిజెపి,బలమైన భారత్ నినాదంతో మాధవ్ పర్యటన
- ఉదయం ఆర్ఎస్ఎస్ శాఖ సందర్శన,హేపీ స్ట్రీట్ లో చాయ్ పే చర్చా
- వైజంక్షన్ నుంచి సుబ్రహ్మణ్య మైదానం వరకు శోభాయాత్ర
- బహిరంగ సభ,ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో ప్రముఖులతో భేటీ



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సారథ్యం పేరిట చేస్తున్న పర్యటనను జయప్రదం చేయాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు,అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ఈరాత్రికి రాజమండ్రి చేరుకొని, సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. స్థానిక క్వారీ ఏరియాలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో ఎన్డీయే పాలనా సాగిస్తోందని వారు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు నిర్దేశం చేస్తూ, బలమైన బిజెపి - బలమైన భారత్ నినాదంతో మాధవ్ చేపట్టిన పర్యటన రోజుకో జిల్లాలో సాగుతోందని వారు వివరించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ జాతీయ వాదుల మద్దతు బిజెపికి బాగా పెరుగుతోందని, అందుకే రాయలసీమ జిల్లాల్లో సైతం పర్యటనకు అనూహ్య స్పందన లభించిందని అన్నారు. 19జిల్లాల్లో పర్యటన పూర్తిచేసుకుని తూర్పు గోదావరి పర్యటనకు మాధవ్ వస్తున్నారని, విశాఖతో ఈ పర్యటన ముగుస్తుందని ఆయన చెబుతూ, ముగింపు సభకు అఖిల భారత అధ్యక్షుడు జెపి నడ్డా వచ్చే అవకాశం ఉందన్నారు. మాధవ్ పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని ఒక ఆర్ఎస్ఎస్ శాఖను సందర్శించి ప్రముఖులను కలుస్తారని తెలిపారు. అనంతరం 7న్నర గంటలకు హేపీస్ట్రీట్ లో ప్రజలతో చాయ్ పే చర్చా కార్యక్రమంలో ప్రముఖులతో చిట్ చాట్ ఉంటుందని తెలిపారు.

అనంతరం వైజంక్షన్ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర నుంచి శోభా యాత్ర ప్రారంభమై, దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానానికి చేరుతుందని, అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో మాధవ్ ప్రసంగం చేస్తారని సోము వీర్రాజు తెలిపారు. ఒకవేళ వర్షం వస్తే శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రానికి సభ మారుతుందని సూచించారు. పార్టీ ఆఫీసులో మీడియాతో సమావేశం అనంతరం సాయంత్రం ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో ప్రముఖులతో పలు అంశాలపై చర్చిస్తారని చెప్పారు. రాత్రికి భీమవరం చేరుకుంటారని తెలిపారు. ట్రంప్ సుంకాల పెంపు అంశంపై సోము వీర్రాజు స్పందిస్తూ,వాళ్ళు చేసేది వాళ్ళు చేస్తే, మనం చేసేది మనం చేస్తామన్నారు. ఎవరు ఎవరిని చూసి భయపడుతున్నారో ప్రపంచం అంతా చూస్తోందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు,పార్టీ నాయకులు రేలంగి శ్రీదేవి, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్,నర్సిపల్లి హారిక, అడబాల రామకృష్ణ, యెనుముల రంగబాబు, వీరా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బాలగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

- బాలగణపతి ఆలయంలో సరస్వతి పూజలు




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** శాంతినగర్ స్థానిక మిలటరీ కాలనీలో వేంచేసిన బాలగణపతి స్వామి వారిని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కొట్టు శ్రీను, మంచింశెట్టి శ్రీను, నిట్ల శ్రీను, నిట్ల వీరబాబు,దొడ్డ బాబురావు,మదిని రాజేష్, కన్నయ్యమ్మ, గుమ్మడి త్రిమూర్తులు, చిట్టిపల్లి నాగేంద్ర, రాజు, వీరబాబు లతో ఆయన మాట్లాడుతూ త్వరలో బాలగణపతి మందిరాన్ని నిర్మించుకోవాలని దానికి కావల్సిన సహాయ సహకారాలు తాము అందిస్తామని, ముందుగా కమిటీ సభ్యులతో సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. తొలుత కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు ఘనస్వాగతం పలికారు. ఆయన గణనాధుని నారికేళం సమర్పించి దర్శనం చేసుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు కొట్టు శ్రీను, మంచింశెట్టి శ్రీను తదితరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన సోమవారం జరగబోయే సారథ్య యాత్రను విజయవంతం చెయ్యాలని సూచించారు. ఎమ్మెల్సి వెంట అసెంబ్లీ కన్వీనర్ యానాపు ఏసు, బిజెపి మోర్చ జిల్లా అధ్యక్షులు సత్య సాయిరాం, కమిటీ సభ్యులు దామురాజు జగదీష్, సింగులూరి రాజు, సింగులూరి వీరబాబు, కేబుల్ శ్రీను, కొట్టు హరీష్, మంచింశెట్టి సుబ్రహ్మణ్యం, గుమ్మడి గిరిధర్, కొట్టు హరీష్ , కొట్టు దివ్య, తదితరులు పాల్గొన్నారు.

**బాలగణపతి ఆలయంలో సరస్వతి పూజలు..:**
బాలగణపతి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు రామకృష్ణ శాస్త్రి సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. సరస్వతి పూజలకు మిలటరీ కాలనీలో ఉన్న బాలబాలికలందరూ హాజరై బాలగణపతి సన్నిధిలో సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బాలబాలికలందరికీ పుస్తకం, పెన్ను, పెన్సిల్ వితరణ చేశారు. అనంతరం స్వామివారి ప్రసాదం బాలబాలికలకు, భక్తులకు పంపిణీ చేశారు.

**బాలగణపతి ఆలయంలో భజన సంకీర్తనలు...**
తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే ఎన్నో పురస్కారాలు పొందిన అనపర్తి మండలం దుప్పలపూడి, కాపవరం గ్రామాలకు చెందిన ఉండమట్ల దుర్గా ప్రసాద్, ఉండమట్ల సత్తిబాబు, కొట్టు చక్రరావు, అన్నదాసు నాగేశ్వరరావు, చిక్కాల వీరబాబు, పోసిన శేషు, కుంతం లక్ష్మీ, మద్దిపూడి నాగవేణి, కుంతం అనంత లక్ష్మీ, ఆనందారి అనంత లక్ష్మీ,కొప్పిరెడ్డి అమ్మజి తదితర భక్త బృందం ఆధ్వర్యంలో భజన సంకీర్తలు నిర్వహించారు.

## బీవీపీ ఆధ్వర్యంలో... కె.బి.రామారావు సంస్మరణ సభ
# నివాళులర్పించిన ప్రముఖులు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** భారత్ వికాస్, పరిషత్( బీవీపీ) రాజమహేంద్రవరం శాఖల ఆధ్వర్యం లో బీవీపీ మాజీ జోనల్ చైర్మన్, చార్టెడ్ అక్కౌంటెంటు,కీర్తిశేషులు కె. బి.రామారావు సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి కళ్యాణ మండపం నెంబర్-2లో న జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాలేపు సత్యనారాయణమూర్తి, బీవీపీ సౌత్ రీజినల్ టీం జనరల్ సెక్రెటరీ డి.పురుషోత్తమశాస్త్రి, రాష్ట్ర శాఖ పూర్వ అధ్యక్షులు పివిఎస్ కృష్ణారావు, ఓలేటి సత్యనారాయణ జ్యోతిని వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొత్తలో బీవీపీ రాజమండ్రి శాఖ ప్రారంభానికి హాజరై, వారి సేవలు అందించారని, బీవీపీకి అనేక పదవులు నిర్వహించి జాతీయ,రాష్ట్ర శాఖలో ఉన్నత స్థాయిలో పరిషత్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లారని,అన్ని వర్గాలను కలుపుకొంటూ దేశభక్తిని, దేశ సేవ ఔన్నత్యాన్ని యువతరానికి అందించడానికి ఎంతగానో శ్రమించారని వక్తలు కొనియాడారు. వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు అందించడానికి ఎంతో కృషి చేశారని,జాతీయస్థాయిలో సామూహిక వివాహాలు, పూర్తి వందేమాతరం మొదలైనవి ఘనంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.బి.వి.తిలక్, డాక్టర్ పరమహంస,జయప్రద, డి.అనురాధ, పిచ్చుక రాంబాబు, సత్తి మూలారెడ్డి, బోడ ఆనంద్ రావు, రుక్మాభాయ్, రత్నా భాయ్, ఎ.రామలింగేశ్వరరావు ఎ.రామకృష్ణారావు,ఎన్. వెంకటేశ్వర రావు తదితరులు కె.బి.రామారావుతో తమ సానిహిత్యాన్ని తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ గణపతిస్వామివారి కల్యాణం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** స్థానిక 23వ వార్డు నందివాడవారి వీధిలోని శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పేరూరి మహేంద్రనాధ్ వెంకటరమణ దంపతులు పీటలమీద కూర్చొని స్వామివారి కల్యాణం ఘనంగా జరిపించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కన్నులపండువగా జరిగిన కల్యాణాన్ని తిలకించి పులకించారు. స్వామివారికి ఏకదశ హారతులు ఇచ్చిన అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం వై.వి.నాగరాజు, లక్ష్మీ సౌమ్య దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కొల్లేపల్లి శేషయ్య హాజరయ్యారు. శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చందా సత్రం మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ,పేరూరి మహేంద్రనాధ్ సరిదే ధన వెంకటేశ్వరరావు కనమర్లపూడి చంద్రకాంత్ మారడుగుల సుబ్బయ్య వానపల్లి మురళీకృష్ణ నంబూరి కృష్ణ చైతన్య సోమిశెట్టి భీమేశ్వరరావు జ్యోతిరామ్ విఠల్ మోరే,వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ జోన్ సలహా సమావేశం



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** సమాజంలో అవసరతలను గుర్తించి మరిన్ని సేవలను అందించడంలో లైన్స్ క్లబ్ ముందుంటుందని లైన్స్ క్లబ్ జోనల్ చైర్పర్సన్ యనమదల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు జిల్లా గవర్నర్ జోన్ సలహా సమావేశం నిర్వహించారు. జోనల్ పరిధిలోని కొవ్వూరు దేవరపల్లి తాళ్లపూడి లైన్స్ క్లబ్ అధ్యక్షులు పాల్గొన్న ఈ సమావేశంలో జోన్ చైర్పర్సన్ ఎనమదల సుబ్రమణ్యం మాట్లాడుతూ లైన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సమాజంలో వివిధ సేవలను అందించడం జరిగిందని పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు మరియు నేత్ర పరీక్షలు నిర్వహించడం ఉత్తమ విద్య కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందించడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందరికి చేయడమే లక్ష్యంగా లైన్స్ క్లబ్ పనిచేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు లైన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుమాక జయరాజు, దేవరపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్ రామరహిత, పాలకొల్లు లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు మద్దిపాటి ప్రకాశం, ఎల్సిఐడిసి యూత్ క్యాంప్స్ అండ్ ఎక్స్చేంజి చైర్పర్సన్ పాలెంపాటి చినబాబు చౌదరి, మారిన రామ్మూర్తి, దుగ్గిరాల సూర్యప్రకాష్ రావు, గోలి వెంకటరత్నం, బూరుపల్లి వెంకటేశ్వరరావు కలగర వెంకటరావు ఉప్పులూరి రామకృష్ణ నాలం శ్రీనివాసరావు తదితర లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

## అన్నదాన మహోత్సవానికి సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రూ 16116/లు వితరణ



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్** తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో శ్రీ శ్రీ శ్రీ దుర్గా భవాని ఆటో యూనియన్ వారిచే 2025వ సం:9వ నెల 6వ తేదీన బారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన మహోత్సవానికి సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు రూ 16116/లు విరాళంగా ఇవ్వడం జరిగిందని ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు చిడిపి బంగారయ్య విలేకరులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు, సిపిఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి చిట్టి స్వామి మండల అధ్యక్షుడు సిద్దే నాగరాజు పలువురు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## శీర్షిక:ఉపాధ్యాయ దినోత్సవం



ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థులను
మంచి మార్గంలో నడిపించే వ్యక్తి ఆచార్యులె
భావి భారత పౌరులగా తీర్చిదిద్దేది ఆచార్యులె
జ్ఞానవంతులయ్యేలా వెలుగు అక్షరాలు
విద్యార్థుల మదిలో నింపి దిక్సూచిలా గమ్యస్థానం వైపు నడిపిస్తారు,
మబ్బులను తొలగించే సూర్యకిరణం తానయి నడిపిస్తారు,
పసిడి జీవితాన్ని అక్షరాల లోకంలోకి చేర్చే బాటసారి
విద్యార్థుల భవిష్యత్తును అంచనా వేసి
బంగారు భవితకు బాటలు వేసే బాటసారి
సమాజం అవినీతి రహితంగా మారడానికి కృషిచేసే కృషీవలుడు
శిష్యులకు వెలుగినివ్వడం కోసం తనను తాను అర్పించుకునే వ్యక్తి ఉపాధ్యాయుడు,
తన జీవితంలో కొన్ని వేల మంది విద్యార్థుల
జీవితాలను తీర్చిదిద్దుతారు
తన జీవితంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి
అక్కడే అన్నట్లు అలాగే వుండిపోతారు
నేను ఒక ఉపాధ్యాయురా లుగా పనిచేసిన అనుభవం తో చెపుతున్నా ఏ గురువు గురుదక్షిణ అడగడు మీరు గొప్పవారు కావడమే మీరు మాకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ.
ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

**రచన**
**మంజుల పత్తిపాటి,**
**మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,**
**యాదాద్రి, భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం, చరవాణి 9347042218.**

## వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (దిపీఎంపీ అసోసి యేషన్) రాజానగరం, రంగంపేట మండలాల ఆధ్వర్యంలో రాజమండ్రి టీ ఎస్ కే హాస్పిటల్ ఆవరణలో ఆదివారం మండల అధ్యక్షులు బుడ్డిగ అప్పారావు అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో టీ ఎస్ కే హాస్పిటల్ కు చెందిన శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ టీ స్వరూప్ మాట్లాడుతూ శస్త్రచికిత్స లలో నూతన విధానాలపై అవగాహన కల్పించారు. గాల్బ్లేడర్ లో రాళ్లు, అపెండిసైటీస్,ప్యాంక్రైటీస్ వంటి రుగ్మతలలో చేయు లాప్రోస్కోపిక్ సర్జరీల గురించి వివరించారు. వెరికోసిస్ రుగ్మతలో చేయు లేజర్ సర్జరీ గురించి వివరించారు. డాక్టర్ తోట సాయి స్మరణ్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో ట్రామా కేసులలో పీఎంపీలు చేయు ప్రాథమిక వైద్యం గురించి,ఎముకలకు సంబంధించిన ఇబ్బందులు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి పీ దేవానందం, మండల కార్యదర్శి కాపా సత్యనారాయణ, కోశాధికారి ఏ నాగేశ్వరరావు,డి గోపి,డి వీర్రాజు,చంద్రశేఖర్, ఎమ్ వెంకన్న,కె సత్తిబాబు తదితర సభ్యులు హాజరయ్యారు.

## తెలుగు సాహితీ వనం లోనూ ఆరుద్ర చెరగని ముద్ర..

- ఆరుద్ర పరిశోధనాత్మక సాహిత్యం మరలా పునరుద్ధరణ చెయ్యాలి..
- తెలుగు సారస్వత పరిషత్ కళా గౌతమి ఆధ్వర్యంలో ఆరుద్ర జయంతి



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్** తెలుగు సాహితీ వనంలోనూ,సినిమా రంగంలోనూ ఆరుద్ర ముద్ర చెరిగిపోనిది జక్కంపూడి రాజా అన్నారు. తెలుగు సారస్వత పరిషత్ కళా గౌతమి ఆధ్వర్యంలో గౌతమి ఘాట్లో ఆరుద్ర శతజయం తోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ కవిగా, రచయితగా, పరిశోధకునిగా,నాటక కర్తగా,విమర్శకునిగా ఆరుద్ర సాగిన తీరు అనితరసాధ్యం అని అన్నారు. చిత్రసీమలో ఆరుద్ర పాటలు,మాటలు జనాన్ని ఎంతగానో మురిపించాయని తెలిపారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ పి వి బి సంజీవరావు మాట్లాడుతూ, వేదమంలా ఘోషించే గోదావరి పాటతోనే ఆరుద్ర రాజమండ్రి ప్రజల మనసులో స్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఆయన పరిశోధనాత్మక సాహిత్యమంతా తిరిగి పునరుద్ధరణ చేయాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆరుద్ర వ్రాసిన గీతాన్ని పిచ్చుకల సత్యనారాయణ ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చల్లా శంకర్రావు,మంతెన కేశవరాజు,ఇమ్మంది మోహనరావు,సలాది సతీష్,ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం,వడ్డీ మురళీకృష్ణ,దేశినీడి బలరామనాయుడు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని చీర్ల సీతారామనాయుడు, పర్యవేక్షించారు.

# డ్రాగన్-ఏనుగు ఒక్కటవ్వాలి

తియాన్‌జిన్ (చైనా)

డ్రాగన్, ఏనుగు ఒక్కటవ్వాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. బీజింగ్‌కు న్యూఢిల్లీ ఒక ముఖ్యమైన మిత్రుడని పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు తమ బంధాన్ని వ్యూహాత్మకంగా, సుదీర్ఘకాల దృక్పథంతో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. చైనా పోర్టు నగరం తియాన్‌జిన్‌లో ఆదివారం ప్రారంభమైన రెండు రోజుల షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఆయన భారత ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. స్నేహితులుగా ఉండటం, మంచి పొరుగువారిగా ఉండటం, డ్రాగన్, ఏనుగు కలిసి రావడం చాలా ముఖ్యమని జిన్‌పింగ్ అన్నారు. సరిహద్దు సమస్య భారత్–చైనా సంబంధాన్ని నిర్వచించనివ్వకూడదని జిన్‌పింగ్ పేర్కొన్నట్టు ఆ దేశ పత్రిక జిన్హువా వెల్లడించింది. కాగా, భారత్–చైనా సరిహద్దు సమస్యపై న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేందుకు కలిసి పనిచేయడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అంగీకరించారు. పరస్పర విశ్వాసం, గౌరవం భారత్–చైనా సంబంధాలకు మార్గనిర్దేశం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గంటసేపు జరిగిన ఇరు నేతల సమావేశంలో సరిహద్దు ప్రతిష్టంభనపై ప్రత్యేక ప్రతినిధుల మధ్య ఒప్పందం నుంచి కైలాస మానససరోవర్ యాత్ర పునః ప్రారంభం, రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాల పునరుద్ధరణ వరకు ద్వైపాక్షిక సంబంధాలలో ఇటీవలి పురోగతిని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. 280 కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు ఈ రెండు దేశాల సహకారంతో ముడిపడి ఉన్నాయని, సర్వ మానవాళి సంక్షేమానికి ఇది మార్గదర్శనం చేస్తుందని మోదీ పేర్కొన్నారు. పరస్పర నమ్మకం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా మన సంబంధాలను ముందుకు తీసుకువెళ్లడానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. కాగా, ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ద్వైపాక్షిక, ప్రాంతీయ, ప్రపంచ సమస్యలు, ఉమ్మడి సవాళ్లపై బహుళపక్ష వేదికలకు విస్తరించడం అవసరమని ఇద్దరు నాయకులు భావించారని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

**సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కొనసాగుతుందని ఆశిస్తున్నా : ప్రధాని మోదీ**

పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడానికి తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో చర్చల సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల ప్రజల సంక్షేమం ఇరుదేశాల ద్వైపాక్షిక సహకారంతో ముడిపడి ఉందని అన్నారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఇవాళ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా వీరి మధ్య భేటీ జరిగింది. ఏడేళ్ల తర్వాత చైనాలో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ.. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అమెరికా భారీ సుంకాల నేపథ్యంలో ఇరుదేశాల మధ్యనున్న విభేదాలను పక్కన పెట్టి, రెండు ఆసియా పొరుగు దేశాలు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

షాంఘై సహకార సంస్థ సదస్సు 2025 కోసం చైనాలోని తియాంజిన్ నగరానికి చేరుకున్న ప్రధాని..



అక్కడ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తోపాటు అనేక మంది ప్రపంచ నాయకులతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలోనే మోదీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. దాదాపు 10 నెలల తర్వాత ఈ ఇద్దరు నేతలు భేటీ అయ్యారు. చివరిసారిగా ఈ నేతలు రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో కలుసుకున్నారు.

2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకున్న ఘర్షణల తర్వాత భారత్–చైనా సంబంధాలు మసకబారాయి. ఆ సంబంధాలు మళ్లీ సాధారణ స్థితికి రావడానికి ఈ భేటీ తోడ్పడుతుందని నిపుణులు భావిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును సాకుగా చూపి ట్రంప్ విధించిన సుంకాల కారణంగా ఇరుదేశాలు ఒత్తిడికి గురవుతున్న సమయంలో ఈ సమావేశం కీలకంగా మారింది. మోదీ, జిన్‌పింగ్ మధ్య జరిగిన చర్చల్లో ఇరుదేశాల సంబంధాలను మెరుగుపరుచుకోవడమనేది ప్రధాన ఎజెండాగా ఉంది.

**ఏమిటీ పంచశీల ఒప్పందం?**

1954 ఏప్రిల్ 29వ తేదీన భారత్, చైనా అనుసరించాల్సిన విధానాలను ఐదు సూత్రాల నియమావళిగా రూపొందించారు. వీటిని పంచశీల సూత్రాలు అంటారు. అవి..

1. తోటి దేశ ప్రాదేశిక సమగ్రత, సారభౌమత్వాన్ని పూర్తిస్తాయిలో గౌరవించడం
2. ఆ దేశంపై దురాక్రమణకు పాల్పడకపోవడం
3. ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం
4. ఇరుదేశాల మధ్య సమానత్వం, ఉమ్మడి ప్రయోజనాల కోసం కృషిచేయడం
5. శాంతియుత సహజీవనానికి బాటలు వేయడం

**ఆంక్షలపై పోరాడుతాం: పుతిన్**


ట్రంప్ విధించిన వివక్షాపూరిత ఆంక్షలపై చైనా, రష్యా పోరాడుతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. ఎస్‌సీఓ సదస్సు కోసం తియాంజిన్ సిటీకొచ్చిన ఆయన చైనా అధికారిక వార్తాసంస్త జిన్‌హువాతో మాట్లాడారు. "అంతర్జాతీయ సవాళ్లను బ్రిక్స్ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా కీలక మౌలికసదుపాయాల ప్రాజెక్టుల నిర్వహణకు చైనా, రష్యా అదనపు వనరుల సమీకరణలో తలమునకలయ్యాయి. సామాజికఆర్థికాభివృద్ధికి అవరోధంగా మారినఅమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు చైనా, రష్యా సమష్టిగా పోరాడుతున్నాయి"అని పుతిన్ అన్నారు.

**మోదీ, జిన్‌పింగ్ భేటీ 'పది'నిసలు**

రష్యాలో బ్రిక్స్ సదస్సు తర్వాత తొలిసారిగా భేటీ అయిన మోదీ, జిన్‌పింగ్‌లు ఇకమీదటైనా ద్వైపాక్షిక ఒప్పందాల్లో పురోగతిని సాధించాలని నిర్ణయించారు
భారత్, చైనా మధ్య నేరుగా పౌరవిమానయాన సర్వీసులను విస్తరించాలని నిర్ణయించారు
కైలాస్ మానససరోవర్ యాత్ర కోసం భారతీయులకు యాత్రా వీసాలు ఇచ్చేందుకు చైనా ముందుకొచ్చింది
పరస్పర వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని గౌరవించుకుంటూనే మూడో దేశం జోక్యాన్ని ఏమాత్రం సహించకూడదని నిర్ణయించుకున్నారు
సరిహద్దు వెంట బలగాల ఉపసంహారణతో శాంతి స్థాపన సాధ్యమైందని నేతలు పునరుద్ఘాటించారు
భారత్, చైనా ఎప్పటికీ మిత్రులుగా, మంచి పొరుగుదేశాలుగా మెలగాలని జిన్‌పింగ్ అభిలషించారు
ఇరుదేశాల బంధాన్ని కేవలం సరిహద్దు వివాదం కోణంలో చూసే ధోరణిని విడనాడాలని నిర్ణయించుకున్నారు. వాణిజ్య, పెట్టుబడుల బంధాన్ని బలోపేతం చేయాలని కోరుకున్నారు
చైనా కంపెనీలకు భారత్‌లో అవకాశం ఇవ్వడం ద్వారా భారత్‌లో విద్యుత్‌వాహన రంగం సైతం వేగంగా విస్తరిస్తుందని ఇరునేతలు ఆశించారు
ఇటీవల చర్చల నిర్ణయాలకు అనుగుణంగా మూడు సరిహద్దుల గుండా సరకు రవాణా, వాణిజ్యానికి ద్వారాలు తెరవాలని మోదీ, జిన్‌పింగ్ నిర్ణయించారు
అధిక టారిఫ్‌లతో చెడిన అమెరికా బంధానికి బదులు పరస్పర బంధాన్ని బలపర్చుకుని అంతర్జాతీయంగా వాణిజ్యరంగంలో ఎదగాలని ఇరునేతలు కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

# ఇదేం 'మైత్రి'.. భారత్‌పై అమెరికా ధోరణి

పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికాకు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు మధ్య ఉండాల్సిన సహజసిద్ధ మైత్రి అగ్రరాజ్య దుందుడుకు వైఖరి వల్ల కొన్నిసార్లు బలహీనపడుతోంది. తిరిగి ఆ సంబంధాలను గాడిలో పెట్టడానికి దశాబ్దాల సమయం పడుతోంది. వెరసి ద్వైపాక్షిక మైత్రిలో ఒక అడుగు ముందుకు.. ఒక అడుగు వెనక్కి పడుతోంది. సుంకాల ద్వారా మరోసారి స్నేహధర్మానికి అమెరికా తూట్లు పొడుస్తోంది. చరిత్ర పుటలను పరికిస్తే మనదేశం పట్ల అగ్రరాజ్యం తీరు ఇలాగే సాగినట్లు స్పష్టమవుతోంది. అక్కసుతో ఒకప్పుడు తుదముట్టిద్దామనుకున్న భారత రాకెట్‌నే ఆ తర్వాతి కాలంలో అమెరికా ఉపయోగించుకోవాల్సి రావడం.. అంతర్జాతీయ సంబంధాల విషయంలో ఆ దేశ అపసవ్య విధానాలకు నిదర్శనం.



**అప్పుడు 'నై'.. ఇప్పుడు 'సార్'!**

గత నెల 30న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి నైసార్ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. భారత్, అమెరికాలు ఈ ఉపగ్రహాన్ని ఉమ్మడిగా రూపొందించాయి. దీన్ని మన దేశానికి చెందిన జీఎస్ఎల్‌వీ మార్క్–2 ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఇరు దేశాల మైత్రికి వారిధిగా నిలిచిన ఈ రాకెట్.. ఒకప్పుడు విభేదాలకు కారణమైంది. అది 1990ల నాటి మాట! అప్పట్లో భారత్.. తన అంతరిక్ష కార్యక్రమం కోసం రాకెట్లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రాజెక్టును కూడా చేపట్టింది. ఈ వాహకనౌకలోని ఎగువ దశలో క్రయోజెనిక్ ఇంజిన్ పరిజ్ఞానం అవసరం. అత్యంత సంక్లిష్టమైన ఈ టెక్నాలజీని నాడు రష్యా నుంచి సమకూర్చుకోవాలని భారత్ నిర్ణయించింది. ఈ పరిజ్ఞానాన్ని భారత్ సాధిస్తే.. ఉపగ్రహ ప్రయోగ రంగంలో భారత్ తనకు పోటీ అవుతుందని, తన వాణిజ్య ప్రయోజనాలు దెబ్బతింటాయని భావించిన అగ్రరాజ్యం వెంటనే తన దుర్బుద్ధి బయటపెట్టుకుంది. క్రయోజెనిక్ టెక్నాలజీని క్షిపణులకూ వాడే అవకాశం ఉందంటూ చిలువలు పలువలు చేసి మాట్లాడింది. ఈ పరిజ్ఞానాన్ని భారత్‌కు ఇవ్వవద్దంటూ రష్యా మీద ఒత్తిడి చేసింది. భారత్, రష్యాల అంతరిక్ష సంస్థలపై ఆంక్షలు విధించింది.

**ఇనుమడించిన తేజస్**

అమెరికా ఒత్తిడికి తలొగ్గిన రష్యా.. క్రయోజెనిక్ పరిజ్ఞానాన్ని అందించే ఒప్పందం నుంచి వైదొలిగింది. దీనికి బదులు దాదాపు అర డజను క్రయోజెనిక్ ఇంజిన్లను మాత్రమే అందించింది. ఆ తర్వాత ఈ ఇంజిన్ టెక్నాలజీలోని సంక్లిష్టతలను ఒడిసిపట్టి, సొంతంగా ఆ యంత్రాలను తయారుచేసుకోవడానికి భారత్ ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ఇందుకు 20 ఏళ్లు పట్టింది. ఈ పరిజ్ఞానంపై మన దేశం పట్టు సాధించకుండా చేయడానికి అమెరికా అన్ని ప్రయత్నాలూ చేసింది. ఈ అవరోధాలన్నీ భారత్‌కు వరాలే అయ్యాయి. ఎంతో శ్రమించి, మన శాస్త్రవేత్తలు క్రయోజెనిక్ పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించారు. అలా సొంతంగా తయారుచేసుకున్న ఇంజినే ఇటీవల నైసార్ ఉపగ్రహాన్ని చౌకగా రోదసిలోకి ప్రవేశపెట్టిన జీఎస్ఎల్‌వీ రాకెట్‌లో ఉపయోగపడింది.

1998లో భారత్ అణు పరీక్షలు జరిపినప్పుడూ అమెరికా ఆగ్రహంతో ఊగిపోయింది. ఎడాపెడా ఆంక్షలు విధించింది. దీనివల్ల అనేక సాంకేతిక ప్రాజెక్టులకు అవరోధం ఏర్పడింది. ఉన్నపళంగా మన శాస్త్రవేత్తలను తమ సంస్థల నుంచి అమెరికా బయటకు పంపేసింది. దీంతో అనేక ప్రాజెక్టుల్లో తీవ్ర జాప్యం జరిగింది. భారత్ కొంతకాలం ఇబ్బందులు పడింది. తేజస్ ప్రాజెక్టు ఇందుకు ఉదాహరణ. ఆంక్షల కారణంగా ఈ స్వదేశీ యుద్ధవిమాన ప్రాజెక్టులో తీవ్ర జాప్యం జరిగింది. తొలుత ఉత్పత్తి చేసిన వేరియంట్లలో గగనతలంలోనే ఇంధనం నింపుకోవడం వంటి సౌకర్యాలు కొరవడ్డాయి. అయినా భారత శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు దీన్ని తట్టుకున్నారు. స్వదేశీ పరిష్కార మార్గాలతో సాంకేతిక అవరోధాలను అధిగమించారు. దీనివల్ల స్వదేశీ సాంకేతిక సత్తా మెరుగుపడింది. ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తిని నమ్ముకుంటే ఒరిగే ప్రయోజనాన్ని ఇవి కళ్లకు కట్టాయి. తాజాగా సుంకాల పేరుతో అమెరికా చేస్తున్న దాదాగిరీని కూడా ఇదే రీతిలో ఎదుర్కొంటే ఫలితం ఉంటుందన్నది చరిత్ర చెబుతున్న పాఠం!

## పాక్ సరిహద్దు తీవ్రవాదంపై భారత్‌కు చైనా మద్దతు

న్యూఢిల్లీ

షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ పలు ద్వైపాక్షిక అంశాలను చర్చించారు. ఇందులో చైనా సరిహద్దుల నుంచి భారత్‌లోకి చొరబడుతున్న పాక్ టెర్రరిస్టుల అంశాన్ని కూడా ప్రధాని మోదీ.. జిన్‌పింగ్ వద్ద ప్రస్తావించారు. అయితే దీనికి చైనా తన సంపూర్ణ మద్దతును భారత్‌కు ఇస్తున్నట్లు స్పష్టం? చేసింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ' జిన్‌పింగ్ వద్ద పాక్ ఉగ్రవాద కార్యకలాపాలను కూడా మోదీ ప్రస్తావించారు. ఇందుకు చైనా సానుకూలంగా స్పందించింది. టెర్రర్ కార్యకలాపాల వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తామని జిన్‌పింగ్ అన్నారు. ఎటువంటి ఉగ్రవాద చర్యల నిర్మూలనకైనా తమ మద్దతు ఉంటుందని జిన్‌పింగ్ అన్నారు. ఇరుదేశాలకు ప్రమాదంగా మారిన ఉగ్రవాద అంశాన్ని జిన్‌పింగ్ కూడా తీవ్రంగానే పరిగణిస్తున్నారు. ఉగ్రవాద నిర్మూలనకు భారత్‌కు తమ వంతు సహకారం అందిస్తామన్నారు' అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. టియాంజిన్ నగరంలో ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్న మోదీ.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రాంతీయ శాంతి, ఆర్థిక స్థిరత్వం, సరిహద్దు ఉద్రిక్తతల తగ్గింపు, సాంకేతిక రంగాల్లో సహకారం పెంచుకునే వంటి అంశాలపై చర్చలు జరిగాయి.వాణిజ్య, టెక్నాలజీ, రక్షణ రంగాల్లో ఒప్పందాలు చేసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

భారత్–చైనా మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, శ్రేయస్సుపై సానుకూల ప్రభావం చూపుతాయి అని ప్రధాని మోదీ తెలపడంతో ఇరు దేశాల సంబంధాలు బలోపేతం కావడానికి అడుగులు పడ్డాయి. ఈ పర్యటన ద్వారా భారత్ తన ప్రాంతీయ ప్రాబల్యాన్ని చాటింది. ఇది భారత్–చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికే అవకాశం ఉంది.

## ప్రొఫైల్ నకిలీ.. సైబర్ మకిలి

నకిలీ ప్రొఫైల్, సైబర్ వేధింపులు, ప్రొఫైల్ హ్యాకింగ్.. తీరు ఏదైనా సైబర్ నేరాల సంఖ్య భారత్‌లో ఏటా పెరుగుతూనే ఉంది. జనం డిజిటల్‌కు పెద్ద ఎత్తున మళ్లుతుండడం, అదే సమయంలో పూర్తిగా అవగాహన ఉండకపోవడం.. సైబర్ నేరగాళ్లకు కలిసి వస్తున్నాయి. ముఖ్యంగా ఆన్ లైన్ , సామాజిక మాధ్యమాల వేదికగా నకిలీ ఆన్ లైన్ ఖాతాలు తెరిచి చేస్తున్న మోసాలే ఎక్కువగా ఉంటున్నాయి.

ఇతర వ్యక్తులు, బ్రాండ్, సంస్థలా కనిపించడానికి నకిలీ ఆన్ లైన్ ఖాతా తెరిచి చేస్తున్న మోసాలు దేశంలో అధికంగా ఉంటున్నాయి. అక్రమంగా డబ్బు సంపాదించే లక్ష్యంతో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వివరాలను ఉపయోగించి సైబర్ నేరస్తులు ఇతరులను మోసం చేస్తున్నారు. గతేడాది ఇలాంటి ఘటనలు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఛి%ఎఎ%ఛటఛిటజీర్ఝు.జౌ౨.జీ%అ%) ద్వారా 39,846 నమోదయ్యాయి. నాలుగేళ్లలో ఈ తరహా మోసాలు మూడు రెట్లు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్ సీఆర్‌పీ వేదిక ద్వారా సైబర్ వేధింపుల ఫిర్యాదులు మూడున్నర రెట్లు పెరిగి 39,077కు చేరాయి. ప్రొఫైల్ హ్యాకింగ్, గుర్తింపు చోరీ ఘటనలు మూడింతలకుపైగా అధికమై 38,295కు పెరిగాయి. ఆన్ లైన్ జాబ్, మ్యాట్రిమోనియల్ మోసాలు కూడా పెరుగుతూ ఉన్నాయి.

**కేసులు ఎన్నోరెట్లు..**

అధికారిక లెక్కల ప్రకారం గతేడాది దేశవ్యాప్తంగా 22 లక్షలకుపైగా సైబర్ సెక్యూరిటీ ఘటనలు నమోదు కావడం ఆందోళన కలిగించే అంశం. ఆన్ లైన్ , సామాజిక మాధ్యమాల ద్వారా మోసాలు 2020తో పోలిస్తే 2024 నాటికి దాదాపు మూడింతలయ్యాయి. మహిళలు, పిల్లలపై జరుగుతున్న సైబర్ నేరాల సంఖ్య రెండింతలకుపైగా పెరిగి గత ఏడాది 48,475కు చేరాయి. సైబర్ నేరస్తులు ఇతర దేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు వారు ఉపయోగించిన ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్‌లను బట్టి తెలుస్తోంది. సైబర్ క్రిమినల్స్ చాలా సందర్భాల్లో తప్పుడు లొకేషన్ , గుర్తింపుతో తప్పుదోవ పట్టిస్తున్నట్టు హెూం మంత్రిత్వ శాఖ వర్గాలు గుర్తించాయి.

**కేటాయింపులు మూడింతలు..**

పౌరులు, వ్యాపారాలు, ప్రభుత్వానికి సురక్షిత సైబర్‌స్పేస్‌ను నిర్మించడానికి నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ (ఎన్ సీఎస్‌పీ)ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే దేశంలోని సైబర్‌స్పేస్‌ను జల్లెడ పట్టేందుకు, సైబర్ భద్రతా ముప్పులను గుర్తించడానికి నేషనల్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్ సీసీసీ) ఏర్పాటు చేసింది. డేటా సంరక్షణ కోసం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం%–%2023 తీసుకొచ్చింది. ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖ సైబర్ సెక్యూరిటీ మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులు 5 ఏళ్లలో మూడింతలకుపైగా పెరగడం గమనార్హం.

# 'వీధికుక్కల కేసుతో నేనిప్పుడు వరల్డ్ ఫేమస్'

తిరువనంతపురం: దేశ వ్యాప్తంగా చర్చాంశనీయమైన సుప్రీంకోర్టులో వీధి కుక్కల కేసు తనని వరల్డ్ ఫేమస్ చేసిందంటూ జస్టిస్ విక్రమ్ నాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజం తనకు శు భాకాంక్షలు చెప్పడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (ఎన్ఎస్ఎల్ఏ) నిర్వహించిన సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న చిన్న పనులు కారణంగా నేను న్యాయవాద వర్గాల్లో ప్రసిద్ధి చెందాను. కానీ వీధికక్కల కేసు కారణంగా ఈ దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం పౌర సమాజంలో నాకు గుర్తింపు ఇచ్చినందుకు వీధి కుక్కలకు కూడా నేను కృతజ్ఞుడను. ఈ కేసును నాకు అప్పగించినందుకు మా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గువాయ్‌కి నా కృతజ్ఞతలు. సుప్రీం తీర్పును సవరించడంతో జంతు ప్రేమికులతో పాటు శునకాల నుంచి కూడా తనకు శుభాకాంక్షలు, ఆశీస్సులు అందుతున్నట్లు సందేశాలు వచ్చాయన్నారు. వీధి కుక్కల దాడులు, రేబిస్ బారినపడి పలువురు మరణించిన ఘటనలపై మీడియాలో వచ్చిన కథనాలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ క్రమంలో.. ఢిల్లీ ఎన్సీఆర్ లో వీధి కుక్కలన్నింటినీ డాగ్ షెల్టర్స్ కి తరలించాలని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఆగస్టు 11న తీర్పు ఇచ్చింది. ఇందుకు ఆరు నుంచి ఎనిమిది వారాల గడువును ఢిల్లీ ప్రభుత్వానికి విధించిన సుప్రీం కోర్టు.. అవి మళ్లీ జనావాసాల్లోకి వస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించింది. అదే సమయంలో శునకాల తరలింపును గనుక అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవంటూ జంతు ప్రేమికులను హెచ్చరించిది కూడా. ఈ నేపథ్యంలో ఈ తీర్పు సమంజసం కాదంటూ జంతు ప్రేమికులు ఆందోళనకు దిగారు. కొందరు(వీళ్లలో రాజకీయ ఇతర రంగాల ప్రముఖులు) సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. మరికొందరు నేరుగా కోర్టును ఆశ్రయించారు. దీనితో ఆదేశాలను పునఃపరిశీలిస్తానని హామీ ఇచ్చిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్.. ఈ పిటిషన్‌ను ముగ్గురు జడ్జిలతో కూడిన విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దీన్ని విచారించింది.రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది.

# తప్పుడు ఆరోపణలపై రామచంద్రయాదవ్ ఫైర్



- నాపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఒక్కొక్కరి జాతకాలు బయట పెడతా
- దమ్ముంటే ప్రజా సమస్యలపై పోరాటం చేయండి
- శ్రీక్రిష్ణుడి గురించి తప్పుగా మాట్లాడితే తీవ్ర పరిణామాలు
- నాపై చేస్తున్న ఆరోపణలు నిరూపిస్తే... రాజకీయాలు వదిలేస్తా
- గాల్లో విమర్శలు చేస్తే చూస్తూ ఉండటానికి నేను జగన్ మోహన్ రెడ్డిని కాదు
- బిసిల ముసుగులో విమర్శలు చేస్తున్న కొందరు టిడిపి పేటిఎం ఏజెంట్లకు రామచంద్రయాదవ్ వార్నింగ్

**అమరావతి**

తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ స్పందించారు. సోషల్ మీడియాలో విమర్శలు చేసి వారిపై ఆయన ఫైర్ అయ్యారు. బిసిల ముసుగులో ఉంటూ టిడిపికి పనిచేస్తున్న కొందరు పేటిఎం ఏజెంట్లకు వార్నింగ్ ఇచ్చారు. తనపై చేస్తున్న విమర్శల్లో ఏ ఒక్కటి నిజమని నిరూపించినా రాజకీయాలు వదిలేస్తానని సవాల్ విసిరారు. వ్యక్తిగత విమర్శలు మానుకోకపోతే ఒక్కొక్కరి జాతకాలు బయటపెడుతానని అల్టిమేటం ఇచ్చారు. తక్కెళ్లపాడు ఘటనలో శ్రీక్రిష్ణుడి విగ్రహానికి అపచారం జరుగుతుందని అక్కడికి వెళ్లి నిర్వాహకులతో మాట్లాడి వచ్చాక వారు జరిగిన తప్పును తెలుసుకొని విగ్రహాన్ని మార్చారన్నారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆ రోజే క్రుతజ్ఞతలు తెలిపానన్నారు. కానీ కొందరు ఉన్మాదులు ఆరోజు నుంచి సోషల్ మీడియాలో తనపై, బిసివై పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వ్యక్తిగతంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసిల ముసుగులో ఉన్న కొందరు టిడిపి పేటిఎం ఏజెంట్లు, టిడిపి కోసం పనిచేసే కొందరు మీడియా ప్రతినిధులు, యూట్యూబర్లు నిద్రాహారాలు మాని తనపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. తాను పుంగనూరులో పోటీ చేస్తే 4500 ఓట్లు వచ్చాయని ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు ఎవరు వెన్నుపోటు కారణమో అందరికీ తెలుసునన్నారు. వెన్నుపోటుకు పేటెంట్ ఉన్న నాయకుడు నమ్మించి మోసం చేశాడని ఎద్దేవా చేశారు. పుంగనూరులో తాను కేవలం నామినేషన్ మాత్రమే వేశానని ఎన్నికలు చేయలేదన్నారు. దానికి కారణం కూడా ఎవరో అందరికీ తెలుసునన్నారు. 4500 ఓట్లు వచ్చిన రామచంద్రయాదవ్ ను చూసి ఉలిక్కిపడుతున్న ఈ పేటిఎం ఏజెంట్లు... ఒక వేళ పుంగనూరులో గెలిచి ఉంటే వారి పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని ఛలోక్తులు విసిరారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తే ఒక్కొక్కరి జాతకాలు బయటపెడుతానని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పేటిఎం ఏజెంట్లు లాగ గాల్లో మాట్లాడను అని, సాక్ష్యాలతోనే మాట్లాడుతానని సవాల్ విసిరారు. ఎన్టీ రామారావుకి పెట్టే విగ్రహాలకు తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ భగవంతుడికి అపచారం జరిగితే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమన్నారు. ఎన్టీఆర్ ను రాజకీయంగా వాడుకొని, పూజలు చేసే నాయకులు... అవసరం లేనప్పుడు చెప్పులతో కొట్టిన చరిత్ర కూడా గుర్తు పెట్టుకోవాలన్నారు. తాను సిద్దాంత పరంగా మాత్రమే విమర్శలు చేస్తానని వ్యక్తిగత విమర్శలు ఎప్పుడూ చేయలేదన్నారు. తనపై విమర్శలు చేసే ఆ ఉన్మాదులు ప్రజా సమస్యలపై ఫోకస్ పెడితే ప్రజలకు మంచి జరుగుతుందని హితవు పలికారు. రాష్ట్రంలో అందరికీ ఒక్క బాబాయ్ గురించి మాత్రమే తెలుసునని, తాను ఇంకో బాబాయ్ గురించి మాట్లాడితే తలలు ఎక్కడ పెట్టుకుంటారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హెరిటేజ్ పై కూడా సాక్ష్యాలతో మాట్లాడాల్సి వస్తుందన్నారు. తనకు ఒక్కొక్కరి చరిత్రా తెలుసునని, అనవసరంగా వ్యక్తిగత విమర్శలు చేసి తమ జాతకాలు బయటపడేలా చేసుకోవద్దని హెచ్చరించారు. తాను ఏదీ గాల్లో మాట్లాడనన్నారు. తాను మాట్లాడే ప్రతి మాటను ఆధారాలతోనే మాట్లాడుతానన్నారు. కొందరు ఉన్మాదులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తుంటే చూస్తూ ఉండటానికి తాను జగన్ మోహన్ రెడ్డిని కాదని రామచంద్రయాదవ్ ఫైర్ అయ్యారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే పరిస్థితి వేరేలా ఉంటుందన్నారు. నిజంగా దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. దోచుకున్న అవినీతి సొమ్మును కక్కించాలన్నారు. అవన్నీ వదిలేసి రామచంద్ర యాదవ్ పేరు చెబితేనే ఉలిక్కి పడుతున్నారని ఎద్దేవా చేశారు. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఒక్కటైనా నిజమని నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని రామచంద్రయాదవ్ సవాల్ విసిరారు. తాను ఎవరికో బినామీ అని, తన వెనుక ఏదో పార్టీ ఉందని, ఎవరో నాయకుడు తనను నడిపిస్తున్నాడని చిల్లర విమర్శలు చేసే వారికి ఘాటుగా బుద్ధి చెబుతానన్నారు. పసలేని, నిరాధార ఆరోపణలు చేసి విలువలు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. జాతికి జరుగుతున్న అవమానాలను చూస్తూ కూడా చిల్లర కాసులకు కక్కుర్తి పడి పార్టీల మోచేతి నీళ్లు తాగుతున్న కొందరు బిసి సంఘాల నాయకులు ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. శ్రీక్రిష్ణుడిపై కొంత మంది పేటిఎం ఉన్మాదులు అభ్యంతరకర వ్యాఖ్యలు, పోస్టులు పెడుతున్నారని అలాంటి వారిని ఉపేక్షించేంది లేదని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్వాపరయుగం గురించి, శ్రీక్రిష్ణుడి రూపం గురించి మాట్లాడితే తాట తీస్తామన్నారు. కొందరు ఎన్టీరామారావు వల్లే శ్రీక్రిష్ణుడి ప్రతిష్ట పెరిగిందని చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ ధర్మం గురించి, దేవుళ్ల గురించి పిచ్చి కూతలు కూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బీహార్ రాజధాని పాట్నాలో ఇటీవల తాను పర్యటించానని, కానీ దాన్ని కూడా రాజకీయం చేసి కొందరు చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మాజీ ఐఏఎస్ అధికారి ఆహ్వానం మేరకు తాను పాట్నాకు వెళ్లానన్నారు. అక్కడ ఉన్న కొందరు అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించామన్నారు. అయితే తాను అక్కడ పోటీ చేయబోతున్నానని ప్రచారం చేస్తున్నారన్నారు. తాను ఆ రోజే మాట్లాడనని, బీహార్ అభివృద్ధిలో ఒక రాజకీయ పార్టీగా బిసివై పార్టీ అండగా ఉంటుందని ప్రకటించానన్నారు. ఎన్నికల తరువాత బీహార్ లో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై ఒక రాజకీయ పార్టీగా స్పందిస్తానని అక్కడి వారికి మాట ఇచ్చానన్నారు. కానీ కొందరు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అక్కడ ఉన్న యాదవ నాయకులకు వ్యతిరేకంగా నేను పోటీ చేస్తున్నానే అర్థం వచ్చేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తాను బడుగులకు రాజ్యాధికారం రావాలనే రాజకీయాల్లోకి వచ్చానని, బడుగులు, బహుజనులను ఏకం చేస్తానే తప్ప చీలిక తీసుకువచ్చే శక్తులను కూడా ఉపేక్షించనని రామచంద్రయాదవ్ క్లారిటీ ఇచ్చారు.

# పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యం






**ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

**ఐవీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.67 లక్షల సహాయం**

**చల్లపల్లి**

సమాజంలో పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పురిటిగడ్డలో ఐవీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఇంజినీరింగ్ విద్యార్థులకు లాప్ టాప్స్, యూనివర్సిటీ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విచ్చేసి మాట్లాడుతూ సర్వ మతాలు దాతృత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. పొరుగువారికి సహాయపడమని ఏసుక్రీస్తు బోధిస్తున్నారని తెలిపారు. దివిసీమ ఉప్పెన అనంతరం తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు చేపట్టిన దివిసీమ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో ప్రపంచ దేశాల నుంచి వచ్చిన క్రైస్తవ సంస్థల సేవలు మరువలేనివి అన్నారు. వైద్య విద్య అభ్యసించినప్పటికీ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం అని గ్రహించిన డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా దంపతులు గత 24 ఏళ్ల నుంచి సమాజానికి విస్తృత సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనాథ, పేద బాల బాలికలను ప్రోత్సహించి వారికి ఫీజులు చెల్లించి కార్పొరేట్ విద్య అందిస్తున్న తీరు స్ఫూర్తిదాయకం అన్నారు. నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ పేద విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న సురేష్, రోజా దంపతులు ఆదర్శనీయులు అన్నారు. ప్రకృతి విపత్తులు కరోనా, వరదలు సంభవించినప్పుడు ఐవీఎం ట్రస్ట్ ద్వారా బాధితులకు సురేష్, రోజా అండగా నిలిచిన తీరు మరువలేనిది అన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ ఐవీఎం ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా వందలాది మంది ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఐవీఎం సురేష్ ప్రశంసనీయులు అన్నారు. ఈ సందర్భంగా ఐవీఎం ట్రస్ట్ ద్వారా ఇంటర్, ఇంజినీరింగ్, మెడిసన్, డిప్లమో, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులు చదువుతున్న వంద మంది పేద విద్యార్థులకు రూ.40లక్షలు స్కాలర్ షిప్ అందచేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న 175 మంది ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు రూ.ఇరవై లక్షలు స్కాలర్ షిప్ అందచేశారు. 15మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.ఏడు లక్షలతో లాప్ టాప్స్ బహుకరించారు. ఈ సందర్భంగా అతిథులను సురేష్, రోజా దంపతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐవీఎం ప్రతినిధులు వేములపల్లి విజయమ్మ, వేములపల్లి స్వితిన్ రాస్, వేములపల్లి సోఫీ, టీడీపీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, స్వచ్ఛ ఏపీ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ బోలెం నాగమణి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నానీ), టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, డాక్టర్ జయప్రసాద్, ఫణి, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం, పీఏసీఎస్ చైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, మాజీ చైర్మన్ హనుమానుల బెనర్జీ, విశ్రాంత డీఎస్పీ కే.హరి రాజేంద్రబాబు పాల్గొన్నారు.

## వైసీపీ ఉక్కు రాజకీయం

**విశాఖపట్టణం**

ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ “ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ “ అంశం ద్వారా వస్తోంది.’ఆంధ్రుల హక్కు –విశాఖ ఉక్కు’ నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి.

## 7న కృష్ణాజిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు

**విజయవాడ**

కృష్ణాజిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7వ తేదీన జిల్లా సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్ లో 7వ తేదీ ఉదయం 7గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లు సెప్టెంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటాయని తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులు తప్పవా..?

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించాల్సిన నిధులు ఇప్పటికే తెచ్చేసుకున్నారు. తొలి ఏడాదిలోనే అవసరమైన నిధులకు సమీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించింది. అయితే రానున్న కాలంలో చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లినా అనుకున్న స్థాయిలో నిధులు వచ్చే అవకాశాలు లేవన్నది ఉన్నతాధికారుల నుంచి అందుతున్న సమాచారం. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వం ఫోకస్ అంతా బీహార్ పైనే ఉంది. బీహార్ లోనూ, వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడుపైన ఎక్కువ దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కు ఇప్పట్లో ఎన్నికలు లేకపోవడంతో పాటు ఇప్పటికే చంద్రబాబు అడిగినంత మేరకు ఆర్థిక సాయం చేయడమే కాకుండా అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పుడు బీజేపీకి చంద్రబాబు ప్రయారిటీ కాదన్నది రాజకీయంగా వాస్తవం. చంద్రబాబు నాయుడు కూటమిలోనే ఉన్నందున ఆయన వల్ల రాజకీయంగా ఇబ్బందులు తలెత్తవని కూడా బీజేపీ నేతలు భావిస్తున్నారు. అందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ లోని 34 విభాగాల్లో ప్రయివేటీకరణకు సిద్ధమయిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల విడుదలలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇక పెద్దగా ఆసక్తి చూపదని చెబుతున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉంటుందని భావించి సంక్షేమ పథకాలను గ్రౌండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు చేశారు. ఎఫ్ఆర్ఎంబీ పరిమితికి మించి అప్పులు చేశారన్న ఆరోపణలు కూడా విపక్ష వైసీపీ నేతలు చేస్తున్నారు. అదే సమయంలో ఇక ప్రతి నెలా సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఆంధ్రప్రదేశ్ లో ఆదాయం కంటే హామీలకు అవసరమైన నిధుల అవసరం ఎక్కువ కావడంతో ఇక రానున్న కాలంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్పవన్న కామెంట్స్ అధికారిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో చంద్రబాబు సమావేశమయినప్పటికీ ఆశించిన స్పందన లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడుకు రానున్న కాలం ఖజానాను నింపడం, వెల్ఫేర్ స్కీమ్స్ ను కొనసాగించడం కత్తిమీద సాము వంటిదేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్

**విశాఖపట్టణం**

ప్రముఖ దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పుడు వైజాగ్‌లోనూ అడుగుపెట్టనుంది. సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. అంతేనా.. ఆసియా ఖండంలోనే ఇది అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్ కానుంది. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసే అతిపెద్ద కేంద్రానికి సైతం విశాఖ వేదిక కానుంది. ఈ మేరకు గూగుల్‌కు చెందిన ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో వెల్లడించింది. గూగుల్ ప్రతిపాదన గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి డిజిటల్ హబ్‌గా దేశానికి గుర్తింపు వస్తుందని జాతీయ పెట్టుబడుల ప్రోత్సాహక, సమన్వయ సంస్థ ఇన్వెస్ట్ ఇండియా తన ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ ఇండియా ప్రకటనలో ఇప్పుడు యావత్ ప్రపంచం ఫోకస్ ఏపీపై నిలిచింది. గూగుల్ క్లౌడ్, సెర్చ్, యూట్యూబ్, ఏఐ వర్క్‌ల పర్యావరణ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపయోగపడనుంది. అంతేకాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది.విశాఖలో త్వరలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్.. దేశానికి చెందిన మొత్తం డేటా నిల్వ చేయనుంది. దీనివల్ల ఉగ్రమూక చేతిలోకి విలువైన డేటా చేరే అవకాశం తప్పుతుంది. అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను పెంచేందుకు 3 సబ్ మెరైన్ కేబుల్స్‌కు సరిపడా ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి డేటా సెంటర్‌ను అనుసంధానిస్తుంది. ముంబయిలో గూగుల్‌కు చెందిన పియరింగ్, క్యాచీ సర్వర్లు ఉన్నాయి. అక్కడి నుంచి సముద్ర మార్గంలో కేబుల్ తీసుకోవడం సులువు అవుతుంది. డార్క్ ఫైబర్ ద్వారా తక్కువ ఖర్చుతో తీసుకోవాలని ప్రణాళికలు వేస్తున్నారు. డేటా సెంటర్ కూలింగ్ కోసం పెద్దఎత్తున నీరు అవసరం అవుతుంది. అందుకే డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ విశాఖ సముద్ర తీరాన్ని ఎంపిక చేసుకుంది.పైగా ఐటీ రంగంలో రూ.2 కోట్ల పెట్టుబడి పెడితే ఒకరికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఆ లెక్కన గూగుల్ సంస్థ పెట్టే సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రంలోని సుమారు 25 వేల మంది నిరుద్యోగులకు దశలవారీగా ప్రత్యక్ష ఉపాధి అవకాశం లభించనుంది. ఇక పరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి లభించనుంది. అంతేకాకుండా డేటా సెంటర్ కోసం పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలని గూగుల్ నిర్ణయించింది. ఆ విద్యుత్ ప్రాజెక్టుల కోసం సుమారు రూ.20 వేల కోట్లు గూగుల్ ఖర్చు చేయనుంది. సముద్ర తీరం వెంట చిన్న హైడ్రో ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వచ్చే విద్యుత్‌ను గూగుల్ వినియోగించుకోనుంది.

## చెన్నై, హైదరాబాద్, బెంగళూరు.. ఇక రెండు గంటల్లోనే.. అమరావతి నుంచి కొత్త లైన్లు

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. హైదరాబాద్– చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎలైన్‌మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ కారిడార్ అమరావతిని చేరుకుంటూ, సీఆర్డీయే మీదుగా వెళ్తుంది. ఇదే విధంగా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్లే హైదరాబాద్– బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్‌కూ ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ రెండు రైలు మార్గాల నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లో ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.మెట్రో నగరాల మధ్య బుల్లెట్ రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా, హైదరాబాద్–చెన్నై హైస్పీడ్ కారిడార్, హైదరాబాద్– బెంగళూరు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్తాయి. ఈ రెండు కారిడార్లు ప్రారంభంలో హైదరాబాద్ నుంచి శంషాబాద్ వరకు 38.5 కిలోమీటర్ల వరకూ ఒకే మార్గంలో వెళ్తాయి. అనంతరం, చెన్నై, బెంగళూరు వైపుగా విడిపోయే వేర్వేరు మార్గాలుగా సాగుతాయి.హైదరాబాద్– చెన్నై హైస్పీడ్ కారిడార్ కోసం 839.5 కి.మీ, 749.5 కి.మీ, 744.57 కి.మీలతో 3 ప్రతిపాదిత మార్గాలను పరిశీలించారు. వీటిలో అతి తక్కువ దూరమైన 744.5 కి.మీ. మార్గాన్ని ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఖరారు చేశారు. ఈ కారిడార్‌లో తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 8, తమిళనాడులో 1 స్టేషన్ నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, నాయుడుపేట, తడ ఉన్నాయి.

# రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువైనా ఆ సమస్యలు తప్పవట..





హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్త కణాలలో కనిపించే ఓ ప్రోటీన్. ఇది శరీరానికి ఆక్సిజన్‌ను తీసుకెళ్లడంలో, కార్బన్ డయాక్సైడ్‌ను ఊపిరితిత్తులకు తిరిగి తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా అమ్మాయిల శరీరంలో తగినంత హిమోగ్లోబిన్ ఉండటం కూడా చాలా ముఖ్యం. పీరియడ్స్, గర్భధారణ, ప్రసవ సమయంలో హిమోగ్లోబిన్ పాత్ర ఎంతో కీలకం. ఈ సమయంలో శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల అలసట, బలహీనత, తల తిరగడం, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు వస్తాయి. శరీరంలో హిమోగ్లోబిన్ లేకపోవడం అనేది.. ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత వల్ల వస్తుంది. ఇది అమ్మాయిల ఋతు చక్రాలను కూడా ప్రభావితం చేస్తుంది. దీనివల్ల అమ్మాయిలకు ఋతుచక్రాలు సక్రమంగా రావు. ఒక్కోసారి పూర్తిగా ఆగిపోతాయి కూడా. శరీరం అంతటా, పునరుత్పత్తి అవయవాలకు ఆక్సిజన్‌ను తీసుకువెళ్ళే హిమోగ్లోబిన్ ఉత్పత్తికి ఐరన్ చాలా అవసరం. అందువల్ల కాలక్రమేణా, మహిళల్లో హిమోగ్లోబిన్ లోపం వల్ల రక్తంలో తగినంత ఆక్సిజన్ అందదు. ఇది పీరియడ్స్ సమయంలో రక్త ప్రవాహాన్ని ప్రభావితం చేస్తుంది. దీనివల్ల క్రమరహిత పీరియడ్స్ వస్తాయి. గైనకాలజిస్టుల ప్రకారం.. మహిళల శరీరంలో హిమోగ్లోబిన్ లోపానికి కారణాలలో ఐరన్, ఫోలేట్ వంటి అనేక రకాల విటమిన్లు, ముఖ్యమైన పోషకాల లోపం ఒకటి. రక్తంలో హిమోగ్లోబిన్ లోపం అనేది ఏదైనా అనారోగ్యం కారణంగా శరీరంలో రక్తం లేకపోవడం వల్ల వస్తుంది. ముఖ్యంగా అధిక రుతుస్రావం ఉన్న స్త్రీలలో కూడా హిమోగ్లోబిన్ లోపం ఉంటుంది. గర్భధారణ, తల్లిపాలు ఇవ్వడం, వేగంగా బరువు పెరగడం వంటి శరీరంలోని మార్పులు కూడా హిమోగ్లోబిన్ లోపానికి కారణమవుతాయి. తలసేమియా వంటి వ్యాధులతో బాధపడేవారిలో తక్కువ హిమోగ్లోబిన్ ఉండటం సాధారణం. మహిళల శరీరంలో ఐరన్ లోపం కూడా తక్కువ హిమోగ్లోబిన్‌కు ప్రధాన కారణం. కీమోథెరపీ, రక్తం పలుచబడే మందుల వల్ల కూడా హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గుతాయి. శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటానికి అతిపెద్ద కారణం ఐరన్ లోపం. కాబట్టి మీ ఆహారంలో ఐరన్ అధికంగా అందించే వాటిని చేర్చుకోవాలి. టోఫు, ఖర్జూరాలు, బ్రోకలీ, గ్రీన్ బీన్స్, డ్రై ఫ్రూట్స్, గింజలు మొదలైన వాటిని మీ ఆహారంలో చేర్చుకోవాలి. ఐరన్ శోషణలో విటమిన్ సి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాబట్టి విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, నిమ్మకాయలు, కివి, బొప్పాయి, క్యాప్సికమ్‌ను ఆహారంలో చేర్చుకోవాలి. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి ఫోలేట్ ఒక ముఖ్యమైన పోషకం. అందువల్ల ఆహారంలో ఆకుకూరలు, వేరుశెనగలు, బియ్యం, కిడ్నీ బీన్స్, అవకాడో, అరటిపండ్లు, బ్రోకలీని చేర్చుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగాశరీరంలో హిమోగ్లోబిన్ స్థాయి చాలా తక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. హిమోగ్లోబిన్ పెంచడానికి ఐరన్ సప్లిమెంట్లను కూడా తీసుకోవచ్చు.

# పీరియడ్స్ సమయంలో తల స్నానం చేస్తే ఏమవుతుంది?



పీరియడ్స్ సమయంలో కొందరికి తీవ్రంగా కడుపు నొప్పి, తలనొప్పి వంటి వివిధ సమస్యలు తలెత్తుతాయి. అయితే మన సమాజంలో ఋతుస్రావం గురించి అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. ఈ సమయంలో మహిళలు కూరగాయలను ముట్టుకోకూడదని, మతపరమైన కార్యక్రమాలలో పాల్గొనకూడదని కొందరు అంటుంటారు. ప్రతి నెలా అమ్మాయిల లైఫ్‌లై జరిగే సహజ ప్రక్రియల్లో పీరియడ్స్ ఒకటి. సాధారణంగా ఇది నాలుగు నుంచి ఐదు రోజుల పాటు ఉంటుంది. ఈ సమయంలో కొందరికి తీవ్రంగా కడుపు నొప్పి, తలనొప్పి వంటి వివిధ సమస్యలు తలెత్తుతాయి. అయితే మన సమాజంలో ఋతుస్రావం గురించి అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. ఈ సమయంలో మహిళలు కూరగాయలను ముట్టుకోకూడదని, మతపరమైన కార్యక్రమాలలో పాల్గొనకూడదని కొందరు అంటుంటారు. ఇలాంటి వివిధ మూఢనమ్మకాల్లో ఒకటి.. పీరియడ్స్ సమయంలో తలస్నానం చేయకూడదు. తల స్నానం చేస్తే ఆరోగ్యానికి హానికరమని పెద్దలు సైతం అంటుంటారు. చాలా మంది పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయడానికి నిరాకరిస్తారు. కానీ వైద్యుల అభిప్రాయం ప్రకారం.. దీనికి ఎటువంటి శాస్త్రీయ ఆధారం లేదు. చల్లటి నీరు పీరియడ్స్ నొప్పిని మరింత తీవ్రం చేస్తుందని, రక్త ప్రవాహానికి అంతరాయం కలిగిస్తుందని కూడా చెబుతుంటారు. కానీ దీనికి వైద్య ఆధారాలు లేవు. అంతేకాకుండా స్నానం, పీరియడ్స్ మధ్య ప్రత్యక్ష శాస్త్రీయ సంబంధం అంటూ ఏదీ లేదు. అయితే కొంతమంది మహిళలు ఈ సమయంలో స్నానం చేసేందుకు భయపడతారు. ఎందుకంటే ఈ సమయంలో వారి శరీరంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అలాంటి సమయంలో స్నానం చేయడం వల్ల పరిస్థితి మరింత దిగజారిపోతుంది. ఈ ప్రక్రియ శారీరక అలసటకు కూడా దారితీస్తుంది. అంతేకాకుండా, బహిష్టు సమయంలో సంభవించే హార్మోన్ల మార్పులు, శారీరక అసౌకర్యం కారణంగా మహిళలకు విశ్రాంతి చాలా అవసరం. కాబట్టి స్నానం చేయడం వల్ల శరీరం మరింత బలహీనపడుతుంది. కాబట్టి ఇలాంటి వారు తల స్నానం చేయకపోవడమే మంచిది. పీరియడ్స్ సమయంలో స్నానం చేయడం వల్ల సంతానోత్పత్తిపై, గర్భాశయంపై ఎలాంటి ప్రభావం ఉండదని డాక్టర్ జ్యోతి చెబుతున్నారు. కానీ ఇది శరీర ఉష్ణోగ్రత, రక్త ప్రసరణపై ప్రభావం చూపుతుంది. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మాత్రమే ఈ అసౌకర్యం కలుగుతుంది. చల్లటి నీటికి బదులుగా గోరువెచ్చని నీరు, కొద్దిగా వేడి నీటిని వాడటం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవని నిపుణులు అంటున్నారు. పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత చాలా ముఖ్యమని వైద్యులు అంటున్నారు. స్నానం చేయడం వల్ల శరీరానికి రిఫ్రెష్ లభించడమే కాకుండా అసౌకర్యం, తేలికపాటి నొప్పుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా గోరువెచ్చని నీరు కండరాలను సడలించి, శారీరక నొప్పిని తగ్గిస్తుంది. మొత్తంమీద ఈ సమయంలో స్నానం చేయడం పూర్తిగా సురక్షితం. ఇది శరీర పరిశుభ్రతకు చాలా మంచిది. కాబట్టి శాస్త్రీయ ఆధారం లేకుండా మూఢనమ్మకాలను నమ్మవద్దు. అంతేకాకుండా ఋతుస్రావం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. నిల్వ నీటితో స్నానం చేయకూడదు. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.



# జ్వరం తగ్గినా పొడి దగ్గు వేధిస్తోందా?

జ్వరం వచ్చి తగ్గిపోయిన తర్వాత కూడా దగ్గు తీవ్రంగా వేధిస్తూ ఉంటుంది. ఈ పొడి దగ్గు కొన్ని వారాల పాటు కొనసాగి అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యమైన సందర్భాల్లో ఆగకుండా వచ్చే దగ్గు ఇబ్బంది పెడుతుంటుంది. జ్వరం వచ్చి తగ్గిపోయిన తర్వాత కూడా దగ్గు తీవ్రంగా వేధిస్తూ ఉంటుంది. ఈ పొడి దగ్గు కొన్ని వారాల పాటు కొనసాగి అసౌకర్యాన్ని కలిగిస్తుంది. అసలు జ్వరం పోయిన తర్వాత ఈ దగ్గు ఎందుకు వస్తుంది? దీనికి ఇంట్లో పాటించాల్సిన నివారణోపాయాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకుందాం.జ్వరం తగ్గినా కొంతమందిని పొడి దగ్గు తీవ్రంగా వేధిస్తుంది. ఇది చాలామందిలో కనిపించే సాధారణ సమస్య. ముఖ్యంగా జ్వరం వచ్చినప్పుడు శరీరంలో ఏర్పడే మార్పుల వల్ల ఈ దగ్గు వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ పొడి దగ్గు కొన్ని వారాలపాటు కొనసాగవచ్చు.

జ్వరం తగ్గిన తర్వాత దగ్గు రావడానికి ప్రధాన కారణం పోస్ట్-వైరల్ దగ్గు. జ్వరానికి కారణమైన వైరస్లు శ్వాసనాళాల్లో వాపు కలిగిస్తాయి. జ్వరం తగ్గాక కూడా ఈ వాపు పూర్తిగా పోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ కారణంగా శ్వాసనాళాలు సున్నితంగా మారి, చిన్నపాటి ప్రేరణలకే దగ్గు వస్తుంది. గొంతు వెనుక భాగంలో స్రావాలు జారి, ఇరిటేషన్ కలిగించడం వల్ల కూడా దగ్గు వస్తుంది. దీన్నే పోస్ట్ నాసల్ డ్రిప్ అంటారు. పొడి దగ్గు తగ్గించడానికి ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించవచ్చు.తేనె వినియోగం: గోరువెచ్చని నీటిలో కొద్దిగా తేనె కలిపి తాగితే గొంతుకు ఉపశమనం లభిస్తుంది.ఉప్పు నీటితో పుక్కిలించడం: గోరువెచ్చని ఉప్పు నీటితో పుక్కిలించడం వల్ల గొంతులోని వాపు తగ్గుతుంది.ఆవిరి పట్టడం: వేడి నీటిలో ఆవిరి పట్టడం వల్ల శ్వాసనాళాలు శుభ్రపడతాయి.నీరు ఎక్కువగా తాగడం: శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. ఇది గొంతు పొడిబారకుండా కాపాడుతుంది.పొగాకుకు దూరం: పొగతాగడం వల్ల దగ్గు మరింత ఎక్కువవుతుంది. దీనికి దూరంగా ఉండాలి. ఈ చిట్కాలు పాటించినా దగ్గు తగ్గకపోతే లేదా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే వైద్య సలహా తీసుకోవడం తప్పనిసరి.

# చెవి ఆరోగ్యానికీ ఉందో డైట్.. డాక్టర్లు చెప్తోన్న సూపర్ ఫుడ్స్..!

మన చెవులు నిరంతరం శబ్దాలతో పోరాడుతూనే ఉంటాయి. వినికిడి లోపం అనేది వయసుతో సంబంధం లేకుండా చాలా మందిలో కనిపిస్తుంది. అయితే, కొన్నిసార్లు ఈ సమస్యకు సరైన ఆహారం తీసుకోకపోవడం కూడా ఒక కారణం అవుతుంది. ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ శ్రీ రావు, చెవి ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడే కొన్ని ఆహారాల గురించి వివరించారు. ఈ ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల వినికిడి సమస్యలను నివారించవచ్చని ఆమె చెప్పారు.నిరంతరం శబ్దాలతో ఉండే ప్రస్తుత ప్రపంచంలో చెవుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వినికిడి లోపానికి వంశపారంపర్య, వయసు పెరగడం, శబ్ద కాలుష్యం వంటివి కారణాలు. అయితే, మన అదుపులో ఉండే కొన్ని విషయాలు కూడా ఉన్నాయి. అవే మనం తినే ఆహారం. మనం తీసుకునే ఆహారం చెవుల ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అందుకే, విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు ఉన్న పోషక ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ శ్రీ రావు, చెవుల ఆరోగ్యాన్ని కాపాడే నాలుగు ఆహార పదార్థాలను పంచుకున్నారు. ఆరోగ్యకరమైన వినికిడి కోసం ఈ నాలుగు ఆహారాలు ప్రతిరోజు తినాలని డాక్టర్ సూచించారు. ఆకుకూరలు కేవలం కళ్ళు, ఎముకలు, గుండెకు మాత్రమే కాదు, చెవులకు కూడా మంచిది. ముఖ్యంగా పాలకూర చెవుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. డాక్టర్ రావు ప్రకారం, ఆకుకూరలలో బి12, ఫోలేట్ అధికంగా ఉంటాయి. అవి కణాల ఆరోగ్యానికి చాలా ఉపయోగపడతాయి. శబ్ద కాలుష్యం, వయసుతో వచ్చే వినికిడి లోపాలను ఇవి నివారిస్తాయి. ఈ ఎన్‌టీ సర్జన్ ప్రకారం, ఆహారంలో చేపలు, గుడ్లు చేర్చుకోవడం చెవులకు ఆరోగ్యం. వీటిలో ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బి12 అధికంగా ఉంటాయి. ఈ పోషకాలు యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి చెవి ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ప్రతిరోజూ పండ్లు, కూరగాయలు తినడం చాలా ముఖ్యం. అవి కేవలం జీర్ణక్రియకు మాత్రమే కాదు, చెవులకు కూడా పోషకాలను అందిస్తాయి. డాక్టర్ రావు కొన్ని పండ్లు, కూరగాయలను సూచించారు. అరటిపండు తినడం వల్ల చెవుల వ్యాధులు రాకుండా ఉంటాయని ఆమె చెప్పారు. నారింజ, చిలగడదుంపలు కూడా ఆమె జాబితాలో ఉన్నాయి. వీటిలో పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది లోపలి చెవిలో ద్రవ సమతుల్యతకు సహాయపడుతుంది. ప్రతిరోజు కొన్ని గింజలు, విత్తనాలు తినడం చెవులకు చాలా ఉపయోగకరం. డాక్టర్ గుమ్మడి గింజలు, అవిసె గింజలు, జీడిపప్పు, బాదం వంటివి తినమని సూచించారు. “వీటిలో మెగ్నీషియం, జింక్ పుష్కలంగా ఉంటాయి. వీటిని సూపర్ ఫుడ్స్ అంటారు. ఇవి శబ్దం వల్ల వచ్చే వినికిడి లోపాన్ని నివారించడంలో సహాయపడతాయి” అని ఆమె వివరించారు.



## బిజినెస్

### సెప్టెంబర్‌లో సెలవులున్నాయా? ట్రేడింగ్ ఆగుతుందా?



వినాయక చవితితో ఆగస్టు నెలాఖరులో ప్రారంభమైన పండుగ సీజన్ సెప్టెంబర్, అక్టోబర్ వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో చాలా మంది ఇన్వెస్టర్లు తదుపరి స్టాక్ మార్కెట్ సెలవుల గురించి ఆలోచిస్తున్నారు. సెప్టెంబర్ నెలలో ఏమైనా సెలవులు ఉన్నాయా.. ఎన్ని రోజులు ట్రేడింగ్ అందుబాటులో ఉంటుంది? అన్న సందేహాలుంటే ఈ కథనంలో తెలుసుకోండి. గణేష్ చతుర్థి సందర్భంగా ఆగస్టు 27 బుధవారం స్టాక్ మార్కెట్‌కు సెలవు వచ్చింది. తదుపరి మార్కెట్ సెలవు సెప్టెంబర్ లో కాకుండా అక్టోబర్ లో వస్తుందని ఇన్వెస్టర్లు గమనించాలి. అయితే, రెగ్యులర్ వారాంతపు సెలవులను పరిగణనలోకి తీసుకుంటే, సెప్టెంబర్ నెలలో ఎనిమిది రోజులు భారత స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ అందుబాటులో ఉండదు. వారాంతాలు మినహా అక్టోబర్ లో మూడు రోజుల పాటు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ట్రేడింగ్ కు మూతపడతాయని ఇన్వెస్టర్లు గమనించాలి. దసరా, దీపావళి, బలిప్రతిపాద వంటి పండుగ రోజులతో పాటు గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతీయ సెలవు దినాలను ఈ సెలవుల్లో చూడవచ్చు.

### యాప్‌లపై కొరడా.. ప్లే స్టోర్ నుంచి 77 డేంజరెస్ యాప్‌లు తొలగింపు..!



యాప్‌లపై టెక్ దిగ్గజం గూగుల్ కొరడా ఝుళిపించింది. ప్లే స్టోర్ నుంచి గూగుల్ 77 ప్రమాదకరమైన యాప్‌లను తొలగించింది. ఆయా యాప్‌లన్నీ వినియోగదారుల భద్రత, గోప్యతకు ముప్పుగా మారడంతో చర్యలు తీసుకున్నది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. గూగుల్ గత సంవత్సరం సుమారు 40 లక్షల యాప్‌లను తొలగించింది. సగటున ప్రతిరోజూ 11వేల యాప్‌లను ప్లే స్టోర్ నుంచి వేటు వేసింది. నివేదిక ప్రకారం.. తొలగించబడిన యాప్‌లలో సగానికి పైగా డేటా భద్రత, గోప్యతా నియమాలను ఉల్లంఘిస్తున్నాయని తేలింది. గూగుల్ గత సంవత్సరం యాప్ ప్లబిషింగ్‌కు సంబంధించి కఠినమైన నియమాలను అమలు చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. 2024 ప్రారంభం నాటికి ప్లే స్టోర్‌లో ఉన్న దాదాపు సగం యాప్‌లను తొలగించారు. గూగుల్ ఈ సంవత్సరం దాదాపు 1.55 లక్షల డెవలపర్ ఖాతాలను కూడా బ్లాక్ చేసింది. కంపెనీ ఇప్పుడు సైడ్‌లోడెడ్ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా వెళ్లే డెవలపర్స్ మాత్రమే యాప్‌లను ప్రచురించగలరని గూగుల్ చెబుతోంది. ప్లే స్టోర్ నుంచి ఒక యాప్ అదృశ్యమైతే.. దాని అర్థం డెవలపర్ దాన్ని తీసివేసినట్లు కాదని గూగుల్ వినియోగదారులను హెచ్చరించింది. తరచుగా దీనికి కారణం యాప్ నియమాలను ఉల్లంఘించడమే. అయితే, యాప్ ఇప్పటికే మీ ఫోన్‌లో ఉంటే.. అది రన్ అవుతూనే ఉంటుంది. కానీ, అది మరిన్ని అప్‌డేట్‌లు అందవు. యాప్ ప్రమాదకరమైనదిగా తేలితే.. ప్లే ప్రొటెక్ట్ దాన్ని అన్ ఇన్‌స్టాల్ చేయమని హెచ్చరిస్తుంది అని కంపెనీ స్పష్టం చేసింది. కానీ, అలాంటి హెచ్చరిక రాకపోతే యాప్ భద్రతా అప్‌డేట్స్ లేకుండా మీ ఫోన్‌లో రన్ అవుతూనే ఉంటుంది. యూజర్లు సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకునే అలవాటును మార్చుకోవాలని నిపుణులు అంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అనుమతులను తనిఖీ చేయాలని.. రివ్యూలను చదవాలని.. విశ్వసనీయ డెవలపర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ నివేదిక పేర్కొంది. ఆండ్రాయిడ్ అథారిటీ నివేదిక ప్రకారం.. గూగుల్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో కొత్త 'అన్ఇన్‌స్టాల్' బటన్‌ను పరీక్షిస్తోంది. ఈ బటన్ యాప్ పేజీలో నేరుగా కనిపిస్తుంది. తద్వారా వినియోగదారులు తమ ఫోన్ నుంచి ఏదైనా యాప్‌ను వెంటనే తీసివేసే అవకాశం ఉంది.

# ట్యాబ్లెట్ పీసీల మార్కెట్ డౌన్

**ప్రథమార్థంలో 32.3 శాతం క్షీణత**

**మార్కెట్ లీడరుగా శాంసంగ్**

**ఐడీసీ నివేదికలో వెల్లడి**



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఏడాది ప్రథమార్థంలో దేశీయంగా ట్యాబ్లెట్ పీసీల మార్కెట్ 21.5 లక్షల యూనిట్లకు పరిమితమైంది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 32.3 శాతం క్షీణించింది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) రూపొందించిన వరల్డ్‌వైడ్ క్వార్టర్లీ పర్సనల్ కంప్యూటింగ్ డివైజ్ ట్రాకర్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అమ్మకాలు నెమ్మదించినప్పటికీ 41.3 శాతం మార్కెట్ వాటాతో శాంసంగ్ అగ్రస్థానంలో కొనసాగగా, 12.3 శాతంతో లెనొవొ రెండో స్థానంలో నిల్చింది. 11.8 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ మూడో స్థానంలో ఉంది. "భారత్‌లో ట్యాబ్లెట్ మార్కెట్ (డిటాచబుల్, స్లేట్ ట్యాబ్లెట్స్ కలిపి) 2025 ప్రథమార్థంలో 21.5 లక్షల యూనిట్లుగా నమోదైంది. వార్షికంగా చూస్తే 32.3 శాతం తగ్గింది. 2025 రెండో త్రైమాసికంలో మార్కెట్ గణనీయంగా నెమ్మదించింది. వార్షిక ప్రాతిపదికన 42.1 శాతం క్షీణించింది. 2025 తొలి త్రైమాసికంలో 18.4 శాతం నెమ్మదించింది" అని ఐడీసీ నివేదిక తెలిపింది. డిటాచబుల్ ట్యాబ్లెట్ సెగ్మెంట్ వార్షికంగా 18.9 శాతం పెరగ్గా, స్లేట్ ట్యాబ్లెట్ విభాగం గణనీయంగా 44.4 శాతం క్షీణించడంతో మొత్తం అమ్మకాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. కమర్షియల్ సెగ్మెంట్‌లో 47.9 శాతం, వినియోగదారుల సెగ్మెంట్‌లో 37.6 శాతం వాటాతో శాంసంగ్ అగ్రస్థానంలో నిల్చింది. ప్రభుత్వ రంగానికి సంబంధించిన విద్యా ప్రాజెక్టులతో పాటు ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా దూకుడుగా విక్రయ వ్యూహాలు అమలు చేయడం ఇందుకు తోడ్పడింది. 2025 రెండో త్రైమాసికంలోనూ 40.8 శాతం మార్కెట్ వాటాతో శాంసంగ్ ఆధిపత్యం కొనసాగించింది. యాపిల్‌కు కొత్త మోడల్స్ దన్ను కమర్షియల్ సెగ్మెంట్‌లో ఇటు చిన్న, మధ్య తరహా సంస్థలతో పాటు అటు కంపెనీల విభాగంలోనూ లెనొవొ మెరుగ్గా రాణించింది. మొత్తం మార్కెట్లో 12.3 శాతం వాటా దక్కించుకుంది. ఇక 11.8 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ మూడో స్థానంలో నిల్చిందని ఐడీసీ నివేదిక తెలిపింది. కన్స్యూమర్ సెగ్మెంట్‌లో యాపిల్ వాటా 14.4 శాతంగా నిల్చింది. కొత్త ఐప్యాడ్ మోడల్స్, విద్యార్థులకు డిస్కౌంట్ ప్రోగ్రాంలు ఇందుకు తోడ్పడ్డాయి. కమర్షియల్ సెగ్మెంట్లో కంపెనీ వాటా 7.3 శాతానికి పెరిగింది. అటు ఐడీసీ అంచనాల ప్రకారం షావోమీ, ఏసర్ మార్కెట్ వాటాలు వరుసగా 11.4 శాతం, 9.1 శాతంగా ఉన్నాయి. ట్యాబ్లెట్ పీసీ సెగ్మెంట్లో ఏసర్ అత్యధికంగా నష్టపోయింది. అమ్మకాలు 73 శాతం క్షీణించాయి.

# ఐటీఆర్ నుంచి క్రెడిట్ కార్డుల వరకు..! సెప్టెంబర్ ఒకటి నుంచి మారనున్న రూల్స్ ఇవే..!

ఈ ఆర్థిక సంవత్సరంలో మరో నెల గడిచిపోయింది. రేపటి నుంచి సెప్టెంబర్ మాసం మొదలుకానున్నది. సెప్టెంబర్ నుంచి పలు రూల్స్ మారనున్నాయి. మారనున్న నిబంధనలు రోజువారీ జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. సెప్టెంబర్ నెలలో ఆదాయపు పన్ను రిటర్న్‌లు, యూపీఎస్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన నియమాలను మారనున్నాయి. అలాగే, ఎల్‌పీజీ ధరలు సైతం మారే సూచనలున్నాయి. రేపటి నుంచి కొత్తగా మారనున్న రూల్స్ ఏంటో తెలుసుకుందాం రండి..! ఐటీఆర్ దాఖలు చేసేందుకు చివరి తేదీ జులై 30 కాగా.. ఆదాయపు పన్నుశాఖ సెప్టెంబర్ వరకు పొడిగించింది. తప్పనిసరిగా సెప్టెంబర్ 15 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.





**యూపీఎస్–ఎన్‌పీఎస్**

యూపీఎస్ఎన్‌పీఎస్ అంటే నేషనల్ పెన్షన్ సిస్టమ్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 30లోగా ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో జూన్ 30 వరకు గడువు ఉండగా.. సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించారు.

**క్రెడిట్ కార్డ్ రూల్స్**

ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల రూల్స్‌ను మార్పులు చేసింది. సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. రూల్స్ ప్రకారం కొన్ని కార్డుల రివార్డ్ పాయింట్ల నిబంధనలను సవరించింది. ఇకపై డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో లావాదేవీలపై రివార్డ్ పాయింట్ల పొందలేరు.

**ఎల్‌పీజీ గ్యాస్ ధర..**

సెప్టెంబర్ ఒకటి నుంచి ఎల్‌పీజీ గ్యాస్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన చమురు కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సవరించే విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేపు ఎల్‌పీజీ ధరలు మారే అవకాశం ఉంది. అలాగే, సీఎన్‌జీ, పీఎన్‌జీ, జెట్ ఇంధన ధరల్లో కూడా మార్పులు ఉండే అవకాశం ఉంది. చమురు కంపెనీలు ధరలు పెంచడం, తగ్గించడం లేదకపోతే యథావిధిగా కొనసాగించే అవకాశం ఉంటుంది.

# బీభత్సం సృష్టించిన రింకూ సింగ్.. ఇక ఆ జట్లకు మూడినట్లే!

ఉత్తర్‌ప్రదేశ్ టీ20 లీగ్ 2025లో టీమిండియా విధ్వంసకర బ్యాటర్ రింకూ సింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నాడు. ఎన్నో అనుమానాల నడుమ (బ్యాటింగ్ నైపుణ్యంపై) ఈ లీగ్ బరిలోకి దిగిన రింకూ.. తనలోని అత్యుత్తమ టాలెంట్‌ను వెలికి తీసి, తనెంత విలువైన ఆటగాడో మరోసారి జనాలకు రుచి చూపించాడు. ఫినిషర్ అన్న బిరుదుకు రింకూ మరోమారు సార్దకత చేకూర్చాడు. ఈ లీగ్‌లో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడిన రింకూ.. 170కి పైగా స్ట్రయిక్‌రేట్‌తో, 59 సగటున సెంచరీ, 2 హాఫ్ సెంచరీల సాయంతో 295 పరుగులు చేశాడు. ఇందులో 20కి పైగా ఫోర్లు, 20కి పైగా సిక్సర్లు ఉన్నాయంటే రింకూ విధ్వంసం ఏ రేంజ్‌లో సాగిందో ఇట్టే అర్థమవుతుంది. గోరఖ్‌పూర్ లయన్స్‌పై రింకూ చేసిన 45 బంతుల శతకం సీజన్ మొత్తానికే హైలైట్‌గా నిలిచింది. తాజాగా రింకూ సృష్టించిన బీభత్సకాండ చూసిన తర్వాత ఆసియా కప్‌లో పాల్గొనే జట్ల బౌలర్లు బెదిరిపోతుంటారు. కాశీ రుద్రాస్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో రింకూ శివాలెత్తిపోయాడు. కేవలం 48 బంతుల్లో 6 సిక్సర్లు, 6 బౌండరీల సాయంతో అజేయమైన 78 పరుగులు చేసి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ ఇన్నింగ్స్‌లో రింకూ గేర్ మార్చిన తీరు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. 26 పరుగులకే తన జట్టు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉండగా రింకూ ఎంట్రీ ఇచ్చాడు. తొలుత అతి నిదానంగా ఆడిన రింకూ.. ఆతర్వాత ఒక్కసారిగా పేట్రేగిపోయాడు. తానెదుర్కొన్న 48 బంతుల్లో తొలి 20 బంతుల్లో కేవలం 7 పరుగులే చేసిన రింకూ.. ఆతర్వాత పెను విధ్వంసం సృష్టించాడు. తర్వాతి 28 బంతుల్లో ఏకంగా 71 పరుగులు రాబట్టాడు. తానెదుర్కొన్న చివరి 11 బంతుల్లో రింకూ 4 ఫోర్లు, 5 సిక్సర్లు బాది మరో 26 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు. రింకూ సృష్టించిన ఈ బీభత్సకాండ ఐపీఎల్‌లో యశ్ దయాల్‌ను చీల్చిచెండాడిన (5 బంతుల్లో 5 సిక్సర్లు) వైనాన్ని గుర్తు చేసింది. త్వర్లో ఆసియా కప్ ప్రారంభం కానుండగా.. రింకూ ప్రత్యర్థులను ఇప్పటినుంచే భయపెడుతున్నాడు. వాస్తవానికి రింకూను ఆసియా కప్‌కు ఎంపిక చేయకూడదనే చర్చ నడిచింది. ఇటీవలి కాలంలో అతను చెప్పుకోదగ్గ ఒక్క ప్రదర్శన కూడా చేయకపోవడమే ఇందుకు కారణం. రింకూ స్థానంలో ఆల్‌రౌండర్‌నో లేక శ్రేయస్ అయ్యర్‌నో ఎంపిక చేయాల్సిందని చాలామంది అభిప్రాయపడ్డారు. అయితే అలాంటి వారి అభిప్రాయాలు తప్పని రింకూ తాజా ప్రదర్శనలతో రుజువు చేశాడు. యూపీ లీగ్‌లో రింకూ బౌలర్‌గానూ తనలోని యాంగిల్‌ను పరిచయం చేశాడు. ఆల్‌రౌండర్‌ను తీసుకుంటే బాగుండేదని భావించే వారిని రింకూ ఈ ర?కంగానూ సమాధాన పరిచాడు. యూపీ లీగ్‌లో మీరట్ మెవెరిక్స్‌కు సారథిగానూ వహిస్తున్న రింకూ.. తన జట్టును అదిరిపోయే విజయాలతో ముందుండి నడిపిస్తున్నాడు. కాశీ రుద్రాస్‌పై విజయం తర్వాత మీరట్ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం కాశీ రుద్రాస్ మాత్రమే మీరట్ కంటే ముందుంది.





### చరిత్ర సృష్టించిన జింబాబ్వే ప్లేయర్.. అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత

జింబాబ్వే ఆటగాడు బ్రెండన్ టేలర్ ఇటీవలికాలంలో తరుచూ వార్తల్లో నిలుస్తున్నాడు. అవినీతి ఆరోపణల కేసులో మూడున్నరేళ్ల ఐసీసీ నిషేధాన్ని పూర్తి చేసుకున్న అతడు.. కొద్ది రోజుల కిందటే అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు. రీఎంట్రీలో దారుణంగా విఫలమైన బ్రెండన్.. తాజాగా అంత ర్జాతీయ క్రికెట్‌లో ఓ అరుదైన మైలురాయిని తాకి మరోసారి వార్తల్లోకెక్కాడు. ఈసారి అతడు జింబాబ్వే తరఫున చారిత్రక మైలురాయిని అందుకున్న ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఇవాళ (ఆగస్ట్ 31) శ్రీలంకతో జరుగుతున్న వన్డేలో బ్రెండన్ అంతర్జాతీయ క్రికెట్‌లో 10000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. జింబాబ్వే క్రికెట్ చరిత్రలో బ్రెండన్‌కు ముందు ఆండీ ఫ్లవర్ (320 ఇన్నింగ్స్‌ల్లో 11580 పరుగులు), గ్రాంట్ ఫ్లవర్ (337 ఇన్నింగ్స్‌లోల? 10028 పరుగులు) మాత్రమే ఈ ఘనత సాధించారు. జింబాబ్వే ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాటర్లలో ఒకడైన బ్రెండన్ తన కెరీర్‌లో 320 ఇన్నింగ్స్‌ల్లో 10000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్‌గా ప్రపంచ క్రికెట్‌లో ఈ ఘనతను ఓ వంద మాత్రమే సాధించారు.



జింబాబ్వే తరఫున అత్యధిక వన్డే సెంచరీలు (11) చేసిన ఆటగాడిగా రికార్డు కలిగిన బ్రెండన్.. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, సనత్ జయసూర్య తర్వాత అత్యధిక వన్డే కెరీర్ (21 ఏళ్లు) కలిగిన ఆటగాడిగానూ రికార్డుల్లో ఉన్నాడు. మ్యాచ్ విషయానికొస్తే.. శ్రీలంకతో జరుగుతున్న రెండో వన్డేలో బ్రెండన్ టేలర్ 20 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే.. బెన్ కర్రన్ (79), సికందర్ రజా (59 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి వన్డేలో పర్యాటక శ్రీలంక 7 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొందింది.

## స్పోర్ట్స్

### 12 బంతుల్లో 11 సిక్సర్లు.. ఆకాశమే హద్దుగా రెచ్చిపోయిన చిచ్చరపిడుగు..!



ఫార్మాట్ ఏదైనా యువ క్రికెటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతూ ప్రకంపనలు సృష్టిస్తున్నారు. బౌలర్లను వణికిస్తూ సిక్సర్ల మోతతో విరుచుకుపడూ ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేస్తున్నారు. తాజాగా కేరళ క్రికెట్ లీగ్‌లో సల్మాన్ నిజార్ తనదైన విధ్వంసక బ్యాటింగ్‌తో ఔరా అనిపించాడు. ఎదుర్కొన్న 12 బంతుల్లో 11 సిక్సర్లు బాదేశాడు. కాలికట్ గ్లోబ్‌స్టార్స్ కెప్టెన్ అయిన సల్మాన్ తమ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఊచకోతను తలపించిన అతడి బ్యాటింగ్ వీడియో నెట్టింట వైరలవుతోంది. కాలికట్ గ్లోబ్ స్టార్స్ సారథి అయిన సల్మాన్ నిజార్ శనివారం కెరీర్లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. అదానీ త్రివేండ్రం రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి అంచున నిలిచిన జట్టును గెలిపించాడు. 14వ ఓవర్లో అతడు క్రీజులోకి వచ్చే సరికి కాలికట్ టీమ్ స్కోర్.. 76/4. కీలక వికెట్లు పడిన వేళ సల్మాన్ టాప్ గేర్ ఆటతో చెలరేగాడు. డెత్ ఓవర్లో వీరంగం సృష్టించిన అతడు.. 12 బంతుల్లో 11 సిక్సర్లు బాదాడు. ఐపీఎల్ పేసర్ బసిల్ థంపి వేసిన 19వ ఓవర్లో అతడు వరుసగా ఐదు బంతుల్ని స్టాండ్‌లోకి పంపాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఆరు బంతుల్ని సిక్సర్లుగా మలిచిన అతడు.. ఒక నో బాల్, ఒక వైడ్‌తో కలిపి 40 రన్స్ పిండుకున్నాడు. అతడి అసాధారణమైన బ్యాటింగ్‌తో కాలికట్ గ్లోబ్‌స్టర్స్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 186 రన్స్ చేసింది. అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి తక్కువ స్కోర్‌కే ప్రత్యర్థిని నిలువరించారు. అదానీ జట్టు బౌలర్లపై ఉప్పెనలా విరుచుకుపడిన సల్మాన్ వచ్చే సీజన్ ఐపీఎల్ వేలంలో భారీ ధర పలకడం ఖాయమనిపిస్తోంది.

## నాకు అలాంటి ఉద్దేశం లేదు..!
## హీరోయిన్ అంజలికి క్షమాపణలు చెప్పిన హీరో పవన్ సింగ్..!



భోజ్‌పురి సూపర్ స్టార్ పవన్ సింగ్ ఎట్టకేలకు దిగివచ్చాడు. ఇటీవల లక్నోలో జరిగిన స్టేజ్ షోలో అసభ్యంగా హీరోయిన్ నడుమును తాకిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో పలువురు హీరో అనుచిత ప్రవర్తనపై సర్వత్రా మండిపడ్డారు. ఈ ఘటన జరిగిన రెండురోజుల తర్వాత పవన్ సింగ్ మౌనం వీడాడు. హీరోయిన్ అంజలి రాఘవన్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాడు. నటుడి అనుచిత ప్రవర్తనతో మనస్తాపానికి గురైన హీరోయిన్ అంజలి భోజ్‌పురి పరిశ్రమను వీడుతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్ట్‌లో పవన్ సింగ్ స్పందిస్తూ.. 'అంజలి జీ బిజీ షెడ్యూల్ కారణంగా నేను మీ లైవ్ చూడలేకపోయాను. ఈ విషయం నాకు తెలిసినప్పుడు నాకు చాలా బాధగా అనిపించింది. అందరం కళాకారులం కాబట్టి నాకు మీపై ఎలాంటి దురుద్దేశం లేదు. అయినప్పటికీ, నా ప్రవర్తతో మీరు బాధపడి ఉంటే దానికి నేను క్షమాపణలు కోరుతున్నాను' అని పేర్కొన్నారు. అయితే, హీరో పవన్ సింగ్ అంతకు ముందుకు ఓ పోస్ట్ చేశాడు. చేతులు ముడుచుకుని నిలబడి ఉన్న తన చిత్రాన్ని షేర్ చేశాడు. పోస్ట్‌తో పాటు 'ఏక్ కహానీ హై- జిస్ తన్ లగే సో తన్, కోయి నా జానే పీర్ పరాయీ' అని కాప్షన్ పెట్టాడు. లక్నోలో జరిగిన ఓ కార్యక్రమంలో 'సైయాన్ సేవా కరే' పాట ప్రమోషన్ సందర్భంగా ఈ సంఘటన జరిగింది. 'సైయా సేవా కరే' పాట రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజలి దగ్గరకు హీరో పవన్ సింగ్ వచ్చాడు. ఆమె అనుమతి లేకుండా ఆమె నడుమును తాకాడు. చీరపై ట్యాగ్ ఉందని, దాన్ని తీసేందుకు అలా చేశానని పవన్ చెప్పినట్లు వీడియోలో వినిపించింది. ఆ క్షణంలో అంజలి నవ్వినప్పటికీ, ఆమె ముఖంలో అసౌకర్యానికి గురైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే, ఈ వ్యవహారంలో అంజలిని తప్పుపడుతూ పలువురు మీమ్స్ చేయడంతో మనస్తాపానికి గురైంది. బహిరంగంగా ఎవరో అనుమతి లేకుండా తాకితే దాన్ని ఎవరైనా ఆనందంగా స్వీకరిస్తారా? ఆ సమయంలో కొత్త చీర కావడంతో ట్యాగ్ ఉందేమోనని అనుకున్నాను. కానీ, ఆ తర్వాత ఏమీ లేదని తెలిసి కన్నీళ్లు ఆగలేదు. ఇదేందని నిలదీసేలోగానే పవన్ సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు' అంటూ చెప్పుకొచ్చింది. ఈ ఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అందుకే భోజ్‌పురి సినిమా ఇండస్ట్రీని పూర్తిగా వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఎవరి అనుమతి లేకుండా వారిని తాకడం ఎప్పటికీ సమంజసం కాదని.. ఇకపై తాను కుటుంబంతో కలిసి హర్యానాలోనే జీవిస్తానని చెప్పుకొచ్చింది. పలువురు అభిమానులు ఆమెకు మద్దతు ప్రకటించారు.




## ఉస్తాద్ భగత్ సింగ్ నుండి అదిరిపోయే పోస్టర్..
## ఇక జాతర మొదలు

మొన్నటి వరకు రాజకీయాలతో బిజీ బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ తాను కమిటైన ప్రాజెక్ట్‌లకి బ్రేక్ వేశాడు. ఇటీవల ఒక్కొక్కటి పూర్తి చేస్తూ దూసుకుపోతున్నాడు. హరిహర వీరమల్లు చిత్రం కొద్ది రోజుల క్రితం విడుదల కాగా, ఈ మూవీ అభిమానులని కూడా ఏ మాత్రం అలరించలేకపోయింది. ఇక ఓజీ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఏ ప్రాజెక్ట్ ప్రకటించినా అది అభిమానులకే కాదు, టాలీవుడ్ మొత్తానికి ఉత్సాహాన్ని కలిగిస్తుందన్న విషయంలో సందేహం లేదు. ఇప్పుడు అదే స్థాయిలో హైప్ తెచ్చుకుంటున్న సినిమా "ఉస్తాద్ భగత్ సింగ్". ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఒకప్పుడు గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన ఈ కాంబో మళ్లీ కలిసి వస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫ్యాన్స్ అయితే ఈ సినిమాను ఒక పండుగలా భావిస్తున్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఫ్యాన్స్ ముందుగానే పండుగను స్టార్ట్ చేశారు. కటౌట్లు, ఫ్లెక్సీలు, బ్లడ్ డొనేషన్లు, సోషల్ సర్వీస్ కార్యక్రమాలు మొదలైపోయాయి. ఈ వేడుకలో మేకర్స్ కూడా భాగమవుతూ, ఒకటి తర్వాత ఒకటి సర్ప్రైజ్ గిఫ్ట్స్ ఇస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్ ఈ జోష్‌కు మరింత బలాన్నిచ్చింది. ఈ పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ ఒక సాంగ్ షూట్ లుక్‌లో కనిపించగా, ఆయన వింటేజ్ మాస్ స్టైల్, ఎనర్జీ ఫ్యాన్స్‌ను ఫుల్ ఖుషీ చేసింది.

ఈ లుక్‌లోని కాస్ట్యూమ్, పవన్ బాడీ లాంగ్వేజ్ అంతా అభిమానుల్లో ఫుల్ జోష్ కలిగిస్తుంది. సోమవారం సాయంత్రం 4:45 గంటలకు మేకర్స్ "ఫుల్ మీల్స్" అంటూ హైప్ క్రియేట్ చేయడం చూస్తుంటే, ఈ మూవీ కూడా సూపర్ డూపర్ హిట్ కావడం ఖాయం అంటున్నారు. హరీష్ శంకర్ %-% పవన్ కలయిక అంటేనే ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి. "గబ్బర్ సింగ్"లో ఆయన పవన్ మాస్ ఇమేజ్‌ని ఎలా వాడుకున్నారో అందరికీ గుర్తే. ఇప్పుడు మళ్లీ అదే డైరెక్టర్ చేతిలో పవన్ పడడంతో ఈ సినిమా ఫుల్ మాస్ ఎంటర్టైనర్గా వస్తుందన్న ఆశలు పెరిగిపోయాయి. సంగీతం దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్, యాక్షన్ సీక్వెన్సుల విషయంలో మేకర్స్ భారీగా ఖర్చు చేస్తున్నారని సమాచారం. పవన్ కళ్యాణ్ స్టామినాకు తగ్గ రీతిలో గ్రాండ్ విజువల్స్ చూపించేందుకు అన్ని విభాగాలూ జాగ్రత్తలు తీసుకుంటున్నాయట. "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమా పవన్ అభిమానుల కోసం ఒక ఫుల్ మాస్ ఫెస్టివల్‌గా మారుతోంది.

## దుబాయ్ బిజినెస్‌మెన్ ప్రేమలో ఈ యంగ్ బ్యూటీ!



టాలీవుడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ రీసెంట్‌గా తన ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రజిత్ ఇబ్రాన్‌తో రిలేషన్‌లో ఉన్నానని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ ప్రకటనా అనంతరం సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే నివేదా తాజాగా తన ప్రేమాయణంకి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఐదేళ్ల క్రితం దుబాయ్‌లో నిర్వహించిన ఓ రేసింగ్ ఈవెంట్‌లో రజిత్‌ను మొదటిసారి కలిశాను. మొదట మేము మంచి స్నేహితులుగా ప్రారంభించాము. ఆపై సమయం గడుస్తూ అభిప్రాయాలు కలవడం, మనసులు దగ్గర కావడంతో ప్రేమలో పడిపోయాము. మా రిలేషన్ గురించి చాలా తక్కువ మందికే తెలుసు. ఇండస్ట్రీలో కూడా ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఈ విషయాన్ని బయటపెట్టడంతో నా మేనేజర్ కూడా షాక్ అయ్యాడు అని చెప్పింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మేం ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నాం. పెళ్లి జనవరిలో ప్లాన్ చేస్తున్నాం. తుది తేదీ ఇంకా ఫిక్స్ కాలేదు కానీ, పెళ్లి పనులు మొదలుపెట్టేశాం. మా ఇరు కుటుంబాలు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాయి. మేము సింపుల్‌గా, కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య పెళ్లిని జరుపుకుంటాం అని నివేదా వివరించింది. మధురైలో జన్మించి పెరిగిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో హీరోయిన్‌గా అడుగుపెట్టింది. అనంతరం 'చిత్రలహరి', 'బ్రోచేవారేవరురా', 'అల వైకుంఠపురములో', 'రెడ్', 'పాగల్', 'విరాటపర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి సినిమాల్లో నటించింది. సినిమాల పరంగా టాలెంట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త ప్రాజెక్టులు లేనట్లు తెలుస్తోంది. కార్ రేసింగ్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లోనూ ఆమె ప్రత్యేక ఆసక్తి కలిగి ఉంది. ఇకపై ఆమె వ్యక్తిగత జీవితం కొత్త అధ్యాయానికి తెరలేవనుంది. పెళ్లి తర్వాత నివేదా సినిమాలు చేస్తుందా లేదా అనేది చూడాలి.




## వరుణ్ సందేశ్ 'కానిస్టేబుల్' మూవీ ట్రైలర్ రిలీజ్

వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటించిన సినిమా 'కానిస్టేబుల్'. ఆర్యన్ సుభాన్ దర్శకత్వం వహించగా బలగం జగదీష్ నిర్మించారు. థ్రిల్లర్ కథతో తీసిన ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో ఆదివారం జరిగింది. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి ట్రైలర్ లాంచ్ చేశారు. ఇప్పటివరకు లవర్ బాయ్‌గా నాకు పేరుంది. సినిమాతో పాటు నా పాత్ర కూడా బాగా వచ్చిందని మూవీ టీం చెప్పడంతో చాలా సంతోషం అనిపించింది. తప్పకుండా మా అంచనాలని 'కానిస్టేబుల్' నిలబెడుతుందని అనుకుంటున్నానని వరుణ్ సందేశ్ చెప్పుకొచ్చాడు. మా అందరి కెరీర్ మలుపుతిప్పే చిత్రం ఇది అవుతుంది. వరుణ్ సందేశ్‌కి కూడా కమ్ బ్యాక్ ఇస్తుందని దర్శకుడు ఆర్యన్ సుభాన్ అన్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com